అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

శనివారం 17-3-2018

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 4 సంచిక : 78 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | 12 + 16 పేజీలు ధర : 5.00

రియల్ రహదారి రాజకీయం

- వెంచర్ కోసం రోడ్డు... రైతుల బతుకులు ఆగం
- 50 లక్షల నుంచి కోటికిపైగా రైతులకు నష్టం
- ఓ రోడ్డు ఉండగా..మరో రోడ్డు ఎందుకో?
- అదీ 160 ఫీట్ల రోడ్డంట.. అక్కడ 60 ఫీట్ల రోడ్డే
- ఎక్కువ
- మంత్రి అనుయాయునికి రోడ్డు కాంట్రాక్టు
- రోడ్డు హద్దురాళ్లను పాతిస్తున్న అపర్ణ వెంచర్ యాజమాన్యం
- ఆందోళనలో అన్నదాతలు


కొత్తగా రోడ్డేస్తే పోయే పొలాలు, బోర్లు
ప్రస్తుత రోడ్డు

నవతెలంగాణ - సంగారెడ్డి ప్రతినిధి

గతుకుల రోడ్లను కనీసం పట్టించుకోని మన ఆర్అండ్బీ అధికారులకు ఉన్న ఫలంగా ఓ రెండు గ్రామాలపై ప్రేమ పుట్టుకొచ్చింది. ఆ ఊర్ల మధ్య జాతీయ రహదారిని తలదన్నేలా నాలుగులైన్ల (160 ఫీట్ల) రోడ్డు నిర్మించాలని ఆర్అండ్బీ ప్రణాళికలు రచించింది. రూ.151.62కోట్ల రూపాయలనూ కేటాయించింది. పక్కనుంచే రోడ్డు ఉండగా..ఇన్ని డబ్బులు పెట్టి మరో రోడ్డు ఎందుకు వేస్తున్నారు? కోట్లాది రూపాయల విలువచేసే రైతుల భూములను ఎందుకు లాక్కోవాల్సి వస్తున్నది? మూడు పంటల భూముల్ని కోల్పోతూ రైతులు నెత్తీనోరు బాదుకుంటున్నా అధికారులు ఎందుకు మొండిగా ముందుకెళ్తున్నారు? ఓ సంస్థ కాంట్రాక్టు పొందితే వెంచర్ యాజమాన్యం ఎందుకు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నది? ఏమిటా కథాకమీషు! ...9లో



అవిశ్వాసం

మోడీ సర్కార్కు వ్యతిరేకంగా లోక్సభలో టీడీపీ, వైసీపీ తీర్మానం

- కాంగ్రెస్, సీపీఐ(ఎం), టీఎంసీ మద్దతు
- నిరసనల సాకుతో సభ వాయిదా


వివరాలు 9లో

దేశ రాజధాని హస్తినలో రాజకీయ పోరు వేడెక్కింది. నాలుగేండ్ల పాటు అధికారంలో ఉన్న మోడీ సర్కారు మొట్టమొదటిసారి అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కొబోతున్నది. టీడీపీ,వైసీపీ పోటాపోటీగా అవిశ్వాసతీర్మానాలు ప్రవేశపెట్టాయి. దీనికి సీపీఐ(ఎం)తో సహా పలు పార్టీలు మద్దతు తెలపగా..మోడీ సర్కారులోని మిత్రపక్షాలు గుర్రుగా ఉన్నాయి. లోక్సభలో విశ్వాసం నెగ్గటానికి మ్యాజిక్ ఫిగర్ 271. కాగా ఎన్డీయే సర్కారుకు అవసరమైన బలం ఉన్నా... అవిశ్వాస తీర్మానం వైపు మళ్లుతాయన్న చర్చకు తెరతీసినట్టయింది.ఇన్నాళ్లూ తమకు ఎదురులేదనుకున్న మోడీకి..అవిశ్వాసఅస్త్రం మింగుడుపడటంలేదు. మారుతున్న రాజకీయ సమీకరణలతో బీజేపీ పెద్దలు అంత్మరథనంలో పడ్డారు. దీంతో గల్లీనుంచి ఢిల్లీదాకా లోక్సభ వైపు అందరూ దృష్టికేంద్రీకరించారు.ఈ అవిశ్వాసతీర్మానంతో ఎన్డీయే సర్కారుకు ఎలాంటి ముప్పులేకపోయినా.. నైతికంగా మోడీ ప్రభుత్వానికి పెద్ద ఎదురుదెబ్బఅని విశ్లేషకులు అంటున్నారు.

అవిశ్వాసతీర్మానాల చరిత్ర..

దేశ చరిత్రలో మొత్తం 26 సార్లు అవిశ్వాసం

- 1963.. మొట్టమొదటి అవిశ్వాసతీర్మానం
- అప్పటి ప్రధాని జవహర్లాల్ నెహ్రూపై కృపలానీ అవిశ్వాస తీర్మానం
- అనుకూలంగా 62 ఓట్లు.. వ్యతిరేకంగా 347 ఓట్లు

1978..
- కాంగ్రెసేతర ప్రధాని మొరార్జీదేశాయ్పై రెండ్లు సార్లు అవిశ్వాసం
- రెండోసారి మిత్రపక్షాలు దూరం..కూలిన ప్రభుత్వం
- ఇందిరా సర్కారుపై 15 సార్లు అవిశ్వాసం
- పార్లమెంటు చరిత్రలో ఎక్కువ అవిశ్వాస తీర్మానాలు ఎదుర్కొన్న ప్రధాని ఇందిరాగాంధీయే..
- ఏకంగా 15 సార్లు అవిశ్వాసం.

9

నిరసనల దెబ్బకు ప్రధాని మోడీ వెనక్కి

మణిపూర్లో 'డ్యామ్' ప్రారంభోత్సవం రద్దు

వివరాలు 2లో

'గోరక్షకులు' హత్యకు పాల్పడిన కేసులో

12 మంది దోషులు

జార్ఖండ్ ట్రయల్ కోర్టు తీర్పు

వివరాలు 2లో

రైతులకు రుణమాఫీ!

2019 ఎన్నికలకు కాంగ్రెస్ కసరత్తు

- నేడు, రేపు ఢిల్లీలో ప్లీనరీ సమావేశాలు



నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

2019 లోక్సభ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ కసరత్తు ప్రారంభించింది. నరేంద్రమోడీ సర్కారుపై తీవ్ర అసంతృప్తితో ఉన్న రైతాంగాన్ని, యువతను పార్టీకి దగ్గర చేసుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. వచ్చే యేడాది జరిగే సాధారణ ఎన్నికల్లో మరోసారి దేశవ్యాప్త రుణమాఫీని ముందుకు తీసుకురావాలని భావిస్తోంది. శని, ఆదివారాలు రెండు రోజుల పాటు జరగనున్న ఆ పార్టీ ప్లీనరీ సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేయనున్నట్టు తెలుస్తోంది. అలాగే ఆంధ్రప్రదేశ్కు ప్రత్యేక హోదా కల్పించడంపై కూడా ఓ తీర్మానం ఆమోదించనున్నట్టు సమాచారం. పార్టీ ప్లీనరీ సమావేశాల నేపథ్యంలో శుక్రవారం కాన్స్టిట్యూషన్ క్లబ్లో జరిగిన స్టీరింగ్కమిటీ సమావేశంలో ఈ మేరకు పలువురు నేతలు ప్రతిపాదించినట్టు తెలిసింది. ఈ సమావేశానికి టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్కుమార్రెడ్డితో పాటు మండలి కాంగ్రెస్ విపక్ష నేత షబ్బీర్ అలీ తదితరులు పాల్గొన్నారు. వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత కల్పించాలని తాము కోరామని సమావేశనంతరం ఉత్తమ్కుమార్రెడ్డి తెలిపారు. అలాగే మద్దతు ధరలను పెంచాలని సూచించామన్నారు. 2019లో అధికారంలోకి వస్తే 'దేశవ్యాప్తంగా కాంగ్రెస్ రుణమాఫీ అమలు చేయనుంది' అని తెలిపారు. యూపీఏ హయాంలో ఇచ్చిన ప్రత్యేక హోదా హామీని బీజేపీ విస్మరించడాన్ని ఖండిస్తూ రాజకీయ తీర్మానంలో ఏపీ అంశాన్ని పొందుపరిచామని ఏపీ పీసీసీ అధ్యక్షులు రఘువీరారెడ్డి చెప్పారు. కాంగ్రెస్ ప్లీనరీలో ఒక రాష్ట్రానికి సంబంధించిన అంశాన్ని ప్రత్యేక చేర్చడం ఇదే మొదటిసారని తెలిపారు. కాగా నేడు ఢిల్లీలోని ఇందిరాగాంధీ ...9లో

సింగరేణి కార్మికులపై తేనెటీగల దాడి

33మందికి గాయాలు, ఒకరి పరిస్థితి విషమం



నవతెలంగాణ-బెల్లంపల్లి

విధులకు హాజరవుతున్న సింగరేణి కార్మికులపై తేనె టీగలు ఒక్కసారిగా దాడి చేశాయి. అక్కడ్నుంచి పరుగులు తీసేలోపే 33 మంది గాయపడ్డారు. అందులో ఒకరి పరిస్థితి విషమంగా మారింది. ఈ ఘటన మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలో శుక్రవారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... మందమర్రి ఏరియాలోని శాంతిఖని గని కార్మికులు శుక్రవారం ఉదయం ఏడు గంటలకు విధులకు వచ్చారు. గని ఆవరణలోని ముఖద్వారం వద్ద ఉన్న చెట్టుపై కోతి దూకడంతో తేనెతుట్టె కదిలింది. దీంతో ఈగలు ఒక్కసారిగా లేచి కార్మికులపై దాడి చేశాయి. ఒక్కొక్కరు ఒక్కోవైపు పరుగులు తీసినా వెంటాడాయి. 33 మంది కార్మికులు గాయపడగా.. వారిలో వెంకటేష్ పరిస్థితి విషమంగా ఉన్నది. అతన్ని మెరుగైన చికిత్స కోసం కరీంనగర్లోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. మిగతా వారు కూడా చికిత్స పొందుతున్నారు.

టీఆర్ఎస్,కాంగ్రెస్తో పొత్తు లేదు..

తమ్మినేని వీరభద్రం

- గత బడ్జెట్లపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- 19న బీఎల్ఎఫ్ రాష్ట్ర కార్యాలయం ప్రారంభం
- ముఖ్య అతిథిగా గుజరాత్ ఎమ్మెల్యే జిగ్నేశ్ మేవాని
- అదే రోజు మహాజన పాదయాత్ర ముగింపు వార్షికోత్సవం


వివరాలు 9లో



మోడీ పరేషాన్

- 2014 తర్వాత ఉపపోరులో వికసించని కమలం
- 22 లోక్సభ స్థానాలకు ఎన్నికలు..3 స్థానాలకే బీజేపీ పరిమితం

నవతెలంగాణ- జనరల్ డెస్క్

మోడీ వేవ్గా అభివర్ణించిన 2014 లోక్సభ ఎన్నికల్లో ఊహించని మెజారిటీతో నరేంద్రమోడీ నాయకత్వంలో బీజేపీ నేతృత్వంలో.. ఎన్డీయే ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. 2014 తర్వాత దేశవ్యాప్తంగా 22 లోక్సభ స్థానాలకు ఉప ఎన్నికలు జరిగాయి. వీటి ఫలితాలు బీజేపీని ఇరకాటంలో నెట్టేస్తున్నాయి. మోడీ వేవ్ రోజురోజుకూ బలహీనపడుతుందనే సంకేతాలిస్తున్నాయి. 22 స్థానాల్లో బీజేపీ మూడింటిలో విజయం సాధించగా.. ఉప ఎన్నికల్లో ఆ పార్టీకి ఎన్నడూ లేనివిధంగా ఓటమి ఎదురైంది. సాధారణంగా ..అధికారంలో ఉన్న పార్టీ ఉప ఎన్నికల్లో గెలవటం సహజం. కానీ, ఉపఎన్నికలు జరిగిన 22 స్థానాల్లో బీజేపీ కేవలం మూడింటికే పరిమితం కావడంతో మోడీ చరిష్మా తగ్గుతుందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. మొదట్లో మోడీపై ఓటర్లు పెట్టుకున్న ఆశలు క్రమక్రమంగా సన్నగిల్లుతున్నా యనడానికి ఈ ఉప ఎన్నికలే చక్కటి ఉదాహరణలని వారు పేర్కొంటున్నారు.

2014 - మెయిన్పురి, వడోదర, కందమాల్, మెదక్

సాధారణ ఎన్నికల ఫలితాల తర్వాత, మెయిన్పురి, వడోదర లోక్సభ స్థానాలకు 2014 సెప్టెంబరులో ఉప ఎన్నికలు జరిగాయి. ములాయం సింగ్ యాదవ్, నరేంద్ర మోడీ రెండు స్థానాల్లో గెలుపొందగా... మెయిన్పురి, వడోదర స్థానాలకు వారు రాజీనామా చేశారు. దీంతో ఆ రెండు స్థానాలకు ఉప ఎన్నికలు జరిగాయి. మెయిన్పురి ...9లో



అంబానీ..అదానీ..నీరవ్ మోడీ.. విజయ్ మాల్యా.. ఇలా చాలామంది డోంట్వర్రీ..!!

నజరానా...

- రూ. కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలం ఒవైసీ హాస్పిటల్కు
- మాసబ్ ట్యాంక్లోని మహావీర్ భూమి లీజ్ రద్దుకు నిర్ణయం?
- సీఎం కార్యాలయం నుంచి రెవిన్యూ శాఖకు నోట్
- వచ్చే క్యాబినెట్ సమావేశంలో పెట్టటానికి కసరత్తు

కొండూరి రమేశ్బాబు

హైదరాబాద్ నగరం నడిబొడ్డున ఉన్న రూ.కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని ఒవైసీ హాస్పిటల్కు కేటాయించటానికి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది.మాసబ్ ట్యాంక్లోని మహావీర్ హాస్పిటల్కు గతంలో కేటాయించిన ఈ స్థలాన్ని నామమాత్రపు ధరకు దారూసలం ఎడ్యుకేషనల్ సొసైటీకి లీజు పేరుతో బదలాయించటానికి సూత్రప్రాయంగా అంగీకరించిన ప్రభుత్వం వచ్చే మంత్రివర్గ సమావేశంలో దీనిని ఎజెండా అంశంగా పెట్టటానికి ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఒక నోట్ రెవిన్యూ శాఖకు అందింది. దీనిపై రెవిన్యూ శాఖలో ఫైల్ కదులుతున్నది.



వివరాలు 9లో

మద్దతు ధర కోసం ఒడిషాలో

306మంది రైతుల నిరవధిక దీక్ష



భువనేశ్వర్: ఒడిషాలోనూ రైతులు ఉద్యమ బాట పట్టారు. 306మంది రైతులు ఆ రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లో నిరవధిక దీక్ష చేపట్టారు. దీక్షకు మద్దతుగా వేలాదిమంది రైతులు భువనేశ్వర్‌లో ర్యాలీ నిర్వహించారు. వరికి కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ)తోపాటు వృద్ధ రైతులకు నెలకు రూ.5000 పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నవనిర్మాణ్ కృషక్ సంఘటన్(ఎన్‌కేఎస్) నేతృత్వంలో రైతులు శాంతియుత నిరసన చేపట్టారు. ఈ ఏడాది ఆ రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయానికి రూ.21,600 కోట్లు కేటాయించాలని రైతాంగం డిమాండ్ చేస్తోంది. వరికి ఎంఎస్‌పీని క్వింటాకు రూ.3000 చేయాలని డిమాండ్ చేస్తోంది. గత ఐదేండ్లుగా ఒడిషా రైతులు పింఛన్, ఎంఎస్‌పీ, తదితర డిమాండ్లపై ఉద్యమాలు, ఆందోళనలు నిర్వహిస్తున్నారు. మహారాష్ట్రలోనే కాదు, కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దేశంలోని రైతుల డిమాండ్లన్నీ ఒకటేనని ఎన్‌కేఎస్ కన్వీనర్ అక్షయకుమార్ అన్నారు. అప్పులు, పంట నష్టాలతో ఇబ్బందులకు గురవుతున్న 36 లక్షలమంది సన్న, చిన్నకారు రైతుల తరఫున తాము పోరాడుతున్నామని రైతు సంఘాల కో ఆర్డినేటర్ శేషదేవ్‌నందా అన్నారు. తమ డిమాండ్లు సాధించే వరకూ ఉద్యమాన్ని కొనసాగిస్తామని రైతు సంఘాల నేతలు తెలిపారు.

లక్నోలో రైతుల భారీ ర్యాలీ

మహారాష్ట్ర తరహా ఆందోళనకు సిద్ధమవుతున్న అన్నదాత

లక్నో : మహారాష్ట్ర, రాజస్థాన్ రైతుల ఆందోళన విజయంతో... ఇప్పుడు ఉత్తరప్రదేశ్‌లోనూ రైతులు ఆందోళనబాటపడుతున్నారు. మహారాష్ట్ర రైతుల తరహాలో ఆందోళనకు శ్రీకారం చుట్టాలని నిర్ణయించుకున్నారు. ఆ ప్రయత్నాల్లో భాగంగా లక్నోలో రైతులు గురువారం ఒక రోజు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఏఐకేఎస్ నేతృత్వంలో 'లక్నో చలో, కిసాన్ ప్రతిరోధ్ (ఉగ్ర) ర్యాలీ' పేరుతో రాష్ట్రంలోని 60 జిల్లాల నుంచి 20 వేల మంది రైతులు గురువారం ఉదయం లక్నో చేసుకున్నారు. రైతుల అసంతృప్తికి పెరుగుతున్న రుణాలే కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం రూ. 35 వేల రుణమాఫీ రైతులకు ఏ మాత్రం ఉపయోగకరంగా లేదని వ్యవసాయ శాస్త్ర వేత్త ఒకరు వ్యాఖ్యానించారు. రుణాల కోసం అత్యధిక మంది రైతులు సాధారణంగా స్థానిక వడ్డీ వ్యాపారులు, ప్రయివేటు వ్యక్తులపైనే ఆధారపడి ఉన్నారని చెప్పారు. జంతువధపై నిషేధం విధించ డంతో పశువులు పొలాలపై పడి పంటలను నాశనం చేస్తున్నాయని, వాటిని కాపాడుకోవడం ఇప్పుడు రైతు లకు తీవ్ర శ్రమతో కూడుకున్న పనైందని చెప్పారు. 2019 ఎన్నికల్లో ప్రధాన అంశం వ్యవసాయం, వ్యవసాయ సంక్షోభమేనని అన్నారు. రైతులు, గ్రామీణ ప్రజల్లో ఉన్న అసంతృప్తి, ఆగ్రహమే కీలక నియోజకవర్గాలైన గోరఖ్‌పూర్, ఫూల్‌పూర్ ఉప ఎన్నికల్లో బీజేపీ ఓటమికి కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు.



ఈ దేశ సాంప్రదాయాలకు గౌరవమివ్వాలి

- విదేశీ పర్యాటకులకు కేంద్ర మంత్రి సూచన



న్యూఢిల్లీ: విదేశీ పర్యాటకులు భారత్‌కు వచ్చినప్పుడు ఇక్కడి సాంప్రదాయాలకు తగ్గట్టు నడుచుకోవాలని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కె.జె. అల్ఫోన్స్ అన్నారు. ఢిల్లీలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... 'ఇతర దేశాల నుంచి వచ్చే పర్యాటకులు ఇక్కడకు వచ్చినప్పుడు బీచ్‌ల్లో, పట్టణాల వీదుల్లో బికినీలు వేసుకుని తిరుగుతారు. గోవా, ఇతర బీచ్‌లలో ఇది తరుచూ కనపడుతోంది. ఇట్లాంటి సాంప్రదాయం లాటిన్ అమెరికాలాంటి దేశాల్లో చెల్లుబాటు అవుతుంది. ఈ దేశం వచ్చినప్పుడు మీరు చీర కట్టుకోమని నేను చెప్పట్లేను. కానీ, ఇక్కడి సాంప్రదాయాలకు గౌరవమివ్వాలి' అంటూ విదేశీ పర్యాటకులకు సూచించారు. ఫ్రాన్స్, జర్మనీలాంటి దేశాల్లోని రెస్టారెంట్‌లకు వెళ్లినప్పుడు అక్కడ బిగ్గరగా అరిచినా, నవ్వినా రెస్టారెంట్ నుంచి తోసేయడమో లేక అలా చేసిన వారిని వింతగా చూస్తారన్నారు. అలాంటి నిర్బంధాలేవి ఇక్కడ లేవన్నారు. పర్యాటకులు వారి దేశంలో నిరభ్యంతరంగా బీఫ్ తినవచ్చునని, ఇక్కడ తినడానికి ఆస్కారం లేదని అల్ఫోన్స్ గతేడాది విదేశీ పర్యాటకులపై చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమైన విషయం విధితమే.

ప్రజల మానసిక ధోరణుల్లో మార్పు రాలేదు

- 'నిర్భయ' తల్లి ఆశాదేవి

న్యూఢిల్లీ: ప్రజల మానసిక ధోరణుల్లో ఇంకా మార్పు రాలేదని 'నిర్భయ' తల్లి ఆశాదేవి అన్నారు. ఆమెనుద్దేశించి కర్నాటక మాజీ పోలీస్ అధికారి హెచ్.టి. సంఘాలియా చేసిన వ్యాఖ్యలపై ఆమె పై విధంగా స్పందించారు. ముంబయిలో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో సంఘాలియా..'ఈ రోజు నిర్భయ తల్లిని కలిశాను. ఆమె చక్కని శారీరక దేహం కలిగి ఉంది. ఈమే ఇంత అందంగా ఉంటే నిర్భయ ఇంకెంత అందంగా ఉంటుందో నేను ఊహించుకోలేకపోతున్నాను' అంటూ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ఈ వ్యాఖ్యలపై ఆశాదేవి మాట్లాడుతూ... ఆయన సొంత విషయాలు కాక తాము చేస్తున్న పోరాటం గూర్చి చెప్తే బాగుండేదన్నారు.

కార్తీ బెయిల్‌పై తీర్పు వాయిదా

న్యూఢిల్లీ:ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో కార్తీ చిదంబరం బెయిల్ పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు తన తీర్పును రిజర్వ్ చేసింది. శుక్రవారం అటు సీబీఐ, ఇటు కార్తీ తరఫు వాదనలు విన్న హైకోర్టు జడ్జి ఎస్‌పి గార్గ్ తన నిర్ణయాన్ని రిజర్వ్ చేశారు. నిందితుడిని బయట ఉంచితే సాక్ష్యులను ప్రభావితం చేస్తారని సీబీఐ తరఫున అడిషనల్ సొలిసిటర్ జనరల్ తుషార్‌మెహతా వాదన వినిపించారు. కార్తీకి బెయిల్ ఇవ్వొద్దంటూ మెహతా కోర్టుకు సూచించారు. కార్తీ తరఫున సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, అభిషేక్ మనూసింఘ్వీ కోర్టుకు హాజరై తమ వాదన వినిపించారు. ఈ కేసులో ఇప్పటికే అరెస్టయిన కార్తీ ప్రస్తుతం తీహార్ జైలులో ఉన్నారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో(2007లో) ఐఎన్‌ఎక్స్ మీడియాలోకి నిబంధనలకు విరుద్ధంగా విదేశాల నుంచి రూ.305 కోట్ల పెట్టుబడులు వచ్చేలా విదేశీ పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు(ఎఫ్‌ఐపీబీ)ని ప్రభావితం చేశారని కార్తీపై సీబీఐ అభియోగాలు మోపింది. ఆ సమయంలో కార్తీ తండ్రి, కాంగ్రెస్ నేత చిదంబరం కేంద్రమంత్రిగా ఉన్నారన్నది గమనార్హం.

చిన్నారిని చిదిమేశాడు...

- ఏడాది బాలికపై లైంగిక దాడి
- ఢిల్లీలో దారుణం

న్యూఢిల్లీ: ఢిల్లీలో మరో దారుణ ఘటన చోటు చేసుకుంది. ముక్కు పచ్చలారని పసిపాపపై ఓ దుర్మార్గుడు లైంగికదాడికి పాల్పడ్డాడు. బుధవారం జరిగిన ఈ అమానవీయ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం... ఢిల్లీలోని ప్రీత్ విహార్ ప్రాంతానికి చెందిన చిన్నారి తండ్రి కూలీ పనులు చేసుకుంటూ భార్య, కూతురితో జీవిస్తున్నాడు. గత బుధవారం బాలిక తల్లిదండ్రులు పని కోసం బయటకు వెళ్లారు. ఈ క్రమంలో ఆమెను పక్కింటి వారికి అప్పగించివెళ్ళారు. ఇంటి బయట ఆడుకుంటున్న బాలికను పొరుగున నివసించే అస్లాం అనే వ్యక్తి తన గదిలోకి తీసుకెళ్లాడు. అనంతరం ఆ చిన్నారిపై అఘాయిత్యానికి ఒడిగట్టాడు. ఇంటికి చేరుకున్న తర్వాత బాలిక పరిస్థితిని చూసి ఖంగుతిన్న తల్లిదండ్రులకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు నిర్వహించారు. అస్లాంపై అనుమానంతో ప్రశ్నించగా విషయం బయటపెట్టాడు. దాంతో నిందితుడిని అరెస్టు చేసినట్టుగా పోలీసులు తెలిపారు.

నిరసనల దెబ్బకు ప్రధాని మోడీ వెనక్కి

మణిపూర్‌లో 'డ్యామ్' ప్రారంభోత్సవం రద్దు

ముంపు బాధితులకు దక్కని న్యాయం

న్యూఢిల్లీ : మణిపూర్‌లో 'మాపిథెల్ డ్యామ్' నిర్వాసితుల నిరసనల ధాటికి ప్రధాని మోడీ తన కార్యక్రమాన్ని రద్దుచేసుకోవాల్సి వచ్చింది. మణిపూర్ యూనివర్శిటీలో 105వ 'ఇండియన్ సైన్స్ కాంగ్రెస్'ను ప్రారంభోత్సవం చేయడానికి శుక్రవారం మణిపూర్‌కు వెళ్లిన దేశ ప్రధాని నరేంద్ర మోడీ పనిలో పనిగా ఆ రాష్ట్రంలో తౌబాల్ నదిపై నిర్మించిన మాపిథెల్ డ్యామ్‌ను ప్రారంభోత్సవం చేయాల్సి ఉంది. కానీ డ్యామ్ నిర్వాసితులు, నష్టపోతున్న స్థానికులు అడ్డుకుంటామంటూ ఆందోళన చేయడంతో నరేంద్ర మోడీ చివరి నిమిషంలో ఈ కార్యక్రమాన్ని రద్దు చేసుకున్నారు.

20 సామాజిక వర్గాలతో కూడిన 'సంయుక్త కార్యాచరణ సమితి' డ్యామ్ ప్రారంభోత్సవాన్ని అడ్డుకునేందుకు 48 గంటల ఆందోళనకు 14వ తేదీన పిలుపునిచ్చింది. దీంతో డ్యామ్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ప్రధాని రద్దు చేసుకోవాల్సి వచ్చింది. ఈ విషయాన్ని మణిపూర్ సీఎం ఎన్. బీరేన్ సింగ్ మీడియా సలహాదారు ఇరెంగ్‌బమ్ అరుణ్ ధృవీకరించడంతో సంయుక్త కార్యాచరణ సమితి ఆందోళనను విరమించింది.

బాధితుల పక్షాన తీర్పు ఉన్నా...

డ్యామ్ నిర్మాణం పనులు ప్రారంభమైన 11 ఏండ్ల తర్వాత పర్యావరణ అనుమతులు మొదటిసారి వచ్చాయని, రెండోసారి అటవి శాఖ బాధితులను అసలు సంప్రదించకుండానే అనుమతులు మంజూరు చేశారని, అది అటవీ చట్టాలను ఉల్లంఘించడమేనని ఆరోపిస్తూ కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖకు ఆందోళనకారులు ఫిర్యాదు చేశారు. ఆ శాఖ 2013 సంవత్సరంలోనే ఈ అంశాన్ని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు అప్పగించింది. 2017,



డిసెంబర్ నెలలో గ్రీన్ ట్రిబ్యునల్ బాధితుల పక్షాన తీర్పు చెప్పింది. అటవీ చట్టాలను గౌరవించడంతోపాటు బాధితులతో చర్చలు జరిపి వారికి తగిన నష్టపరిహారం ఇవ్వాలని తీర్పు ఇచ్చింది.

తీర్పు వెలువడి నాలుగు నెలలవుతున్నా బాధిత వర్గాలతో ఎలాంటి చర్చలు చేపట్టకుండానే మణిపూర్ ప్రభుత్వం ప్రధాని మోడీ చేతులమీదుగా డ్యామ్ ప్రారంభోత్సవానికి ముహూర్తం పెట్టింది. బాధితుల ఆందోళనతో ఆ కార్యక్రమం శుక్రవారం రద్దయింది. అయితే ఇది బాధితులకు తాత్కాలిక ఉపశమనమేనని, ఆ తర్వాత మరో రోజు డ్యామ్‌ను ప్రభుత్వం ప్రారంభించి తీరుతుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. 1989లో డ్యామ్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ప్రాజెక్టు నిర్మాణంలో తీవ్ర జాప్యం జరిగింది. చివరకు డ్యామ్ నిర్మాణాన్ని పూర్తి చేసి 2015లో తొలిసారిగా తౌబాల్ నదీ ప్రవాహాన్ని అడ్డుకున్నారు. దాంతో అప్పటి వరకు వేసిన లెక్కలన్నీ తప్పని తేలింది. పెద్ద సంఖ్యలో ప్రజలు నివసిస్తున్న ప్రాంతాలు ముంపునకు గురయ్యారు. దిగువన వ్యవసాయం, చేపలపై ఆధారపడి బతుకుతున్న కొన్ని వందల కుటుంబాలు చితికిపోయాయని పర్యావరణ పరిరక్షకవేత్తలు తెలియజేస్తున్నారు.

జస్టిస్ లోయా కేసులో స్వతంత్ర దర్యాప్తుపై..

తీర్పు రిజర్వ్ చేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ:సీబీఐ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి బిహెచ్ లోయా అనుమానాస్పద మృతి కేసులో స్వతంత్ర దర్యాప్తునకు ఆదేశించాలన్న పిటిషన్లపై తీర్పును సుప్రీంకోర్టు రిజర్వ్ చేసింది. ఓ వ్యక్తిని లక్ష్యంగా చేసుకొని స్వతంత్ర దర్యాప్తును ఫిర్యాదిదారులు కోరుతున్నారంటూ మహారాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహ్తగీ వాదన వినిపించారు. ఈ కేసు దర్యాప్తు చేసిన సీబీఐపై ఫిర్యాదిదారులు పలు ప్రశ్నలు సంధించారు. సోహ్రాబుద్దీన్ నకిలీ ఎన్‌కౌంటర్ కేసులో బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షాను విడుదల చేయడాన్ని సీబీఐ ఎందుకు సవాల్ చేయలేదని వారు ప్రశ్నించారు. ప్రధాన న్యాయమూర్తి దీపక్‌మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం సూచనమేరకు ఫిర్యాదిదారులు తమ అభ్యర్థనలను రాతపూర్వకంగా కోర్టుకు సమర్పించారు.

సోహ్రాబుద్దీన్ కేసుపై విచారణ జరుపుతున్న సమయంలో సీబీఐ కోర్టు జడ్జి బిహెచ్ లోయా 2014, డిసెంబర్ 1న అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. నాగపూర్‌లో ఓ న్యాయమూర్తి కూతురి పెండ్లికి హాజరైన సందర్భంలో ఈ సంఘటన జరిగింది. 2005 నవంబర్‌లో సోహ్రాబుద్దీన్ షేక్, ఆయన భార్య కౌసరీబీని గుజరాత్ పోలీసులు అరెస్ట్ చేసి, కస్టడీలో ఉండగా హత్యగావించి ఎన్‌కౌంటర్ కట్టుకథ అల్లినట్టు అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ సంఘటన జరిగినపుడు అమిత్‌షా ఆ రాష్ట్ర హోంమంత్రిగా ఉన్నారు. దాంతో, ఈ కేసు దర్యాప్తును అప్పటి యూపీఏ ప్రభుత్వం సీబీఐకి అప్పగించింది. ఈ కేసులో బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షాసహా 38మందిపై సీబీఐ విచారణ జరిపింది. లష్కర్-ఏ-తాయిబాతో సోహ్రాబుద్దీన్‌కు సంబంధాలున్నట్టు గుజరాత్‌లోని అప్పటి మోడీ ప్రభుత్వం ఆరోపించింది.

రామసేతును తొలగించం

- సుప్రీం కోర్టులో కేంద్రం అఫిడవిట్

న్యూఢిల్లీ : సేతు సముద్రం ప్రాజెక్టును అమలు చేసేందుకు రామసేతును తొలగించబోమని కేంద్ర ప్రభుత్వం శుక్రవారం సుప్రీం కోర్టుకు తెలిపింది. ఆడమ్స్ బ్రిడ్జ్‌గా పిలవబడే రామసేతు ద్వారా శ్రీలంకకు మార్గాన్ని ఏర్పరిచేందుకు దానిని ధ్వంసం చేయబోమని పేర్కొంది. దీని వల్ల సామాజిక, ఆర్థిక ప్రతికూలతలు ఏర్పడతాయని నౌకాయాన శాఖ సుప్రీం కోర్టుకు దాఖలు చేసిన అఫిడవిట్‌లో పేర్కొంది. రామసేతుపై ప్రాజెక్టులు నిర్మించే విషయమై స్పష్టతనివ్వాలని సుప్రీం కోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన నాలుగేళ్ళ తరువాత మంత్రిత్వ శాఖ శుక్రవారం సమాధానమిస్తూ అఫిడవిట్ దాఖలు చేసింది. రామసేతును తొలగించబోమని కేబినెట్ నిర్ణయం తీసుకుందో లేదో పరిశీలించాలని బిజెపి నేత డాక్టర్ సుబ్రహ్మణ్య స్వామి 2014లో సుప్రీంను కోరారు. సుబ్రహ్మణ్య స్వామి తిరిగి శుక్రవారం ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం ముందు తన అభ్యర్థనను ప్రస్తావించారు. దీనికి అడిషనల్ సొలిసిటర్‌జనరల్ పింకీ ఆనంద్ స్పందిస్తూ ప్రభుత్వ వైఖరిని తెలియచేస్తూ అఫిడవిట్‌ను దాఖలుచేసినట్లు చెప్పారు. రామసేతును తొలగించబోమని, దానిని రక్షించుకుంటామని ప్రాజెక్టు నిర్మాణానికి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తామని కేంద్ర ప్రభుత్వం తన అఫిడవిట్‌లో పేర్కొంది.

'గోరక్షకులు' హత్యకు పాల్పడిన కేసులో

12 మంది దోషులు



రాంచీ: జార్ఖండ్‌లో గతేడాది గోమాంసం తరలిస్తున్నాడనే నెపంతో అస్గర్ అన్సారీని హత్య చేసిన కేసులో బీజేపీ నాయకుడితో సహా 12 మందిని దోషులుగా నిర్ధారిస్తూ జార్ఖండ్ ట్రయల్ కోర్టు తీర్పును వెల్లడించింది. గతేడాది జూన్‌లో రామ్‌గఢ్‌లోని బజర్తాండ్ గ్రామానికి చెందిన అన్సారీపై గో రక్షకులు దాడి చేశారు. అనంతరం అతడి వాహనానికి నిప్పంటించారు. ఈ ఘటనలో తీవ్ర గాయాల పాలైన అన్సారీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా అన్సారీని ఉద్దేశపూర్వకంగానే కుట్రపన్ని హత్య చేశారని పోలీసులు వెల్లడించారు. ఈ కేసులో నిందితులకు కోర్టు మార్చి 20న శిక్షను ఖరారు చేయనుంది.

పబ్‌లో మహిళలపై దాడి ఘటనలో..

శ్రీరామ్‌సేన కార్యకర్తలు నిర్దోషులుగా బయటపడటం సిగ్గుచేటు : ప్రకాశ్‌రాజ్



బెంగళూరు: తొమ్మిదేండ్ల క్రితం మంగళూరు పబ్‌లో మహిళలపై దాడి ఘటనలోని నిందితులందరూ నిర్దోషులుగా విడుదల కావడం సిగ్గుచేటని నటుడు ప్రకాశ్‌రాజ్ విమర్శించారు. శ్రీరామ్‌సేన చీఫ్ ప్రమోద్ ముతాలిక్‌సహా 26మంది నిందితుల్ని బెంగళూరులోని కోర్టు నిర్దోషులుగా ప్రకటిస్తూ ఈ నెల 12న తీర్పు వెల్లడించింది. నైతిక విలువల పరిరక్షణ పేరుతో శ్రీరామ్‌సేన కార్యకర్తలు 2009, జనవరి 24న పబ్‌పై దాడి చేసి మహిళలను కొడుతూ పరుగు పెట్టించారు. దాడి దృశ్యాలు, నిందితుల విజువల్స్ కూడా వీడియోల్లో రికార్డయ్యాయి. అయితే, కోర్టులో వీడియో సాక్ష్యాలు చెల్లవంటూ మెజిస్ట్రేట్ తీర్పు చెప్పారు. బాధితులైన ముగ్గురు మహిళలను కోర్టులో ప్రవేశపెట్టడంలో ప్రాసిక్యూషన్ విఫలమైంది. తీర్పును సవాల్ చేస్తూ ఉన్నత న్యాయస్థానానికి వెళ్లాలని సిటిజెన్స్ ఫోరం ఫర్ మంగళూరు డెవలప్‌మెంట్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. చట్టం గెలిచిందంటూ తీర్పుపై ప్రమోద్ ముతాలిక్ వ్యాఖ్యానించారు. పెరుగుతున్న పబ్ సంస్కృతికి నిరసన తెలపాలన్నదే తన లక్ష్యమని మమ్మల్ని గూండాలన్నవారికి ఈ తీర్పు సమాధానమని ముతాలిక్ అన్నారు. సాక్ష్యాలు ఉన్నా కూడా నిందితులను నిర్దోషులుగా చట్టాలు చెప్పడమేమిటని ప్రకాశ్‌రాజ్ ప్రశ్నించారు. సాక్ష్యులకు తగిన రక్షణ కల్పించి ఉంటే కోర్టు ముందుకు వచ్చేవారని ప్రకాశ్‌రాజ్ అన్నారు. తీర్పును సవాల్ చేయకపోవడం పట్ల కర్నాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూడా ప్రకాశ్‌రాజ్ తప్పుపట్టారు. గౌరీ లంకేశ్ హత్య కేసులోనూ ప్రభుత్వ తీరుపై ఆయన మండిపడ్డారు. ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినంత మాత్రాన సరిపోదని, అటువంటి ఘటనలకు కారణమైన ఆలోచనా విధానంపైనే తమ పోరాటమని ప్రకాశ్‌రాజ్ స్పష్టం చేశారు. గౌరీ కేసులో కెటి నవీన్‌కుమార్ అనే నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుత రాజకీయాల్లో అన్ని ఇజాలు విఫలమయ్యాయని ప్రకాశ్‌రాజ్ అన్నారు. కొత్త రాజకీయాలకు అవకాశమున్నదని అభిప్రాయపడ్డారు. పౌరులకు ప్రశ్నించే వాతావరణం కల్పించాలని, అధికారంలో ఉన్నవాళ్ల సమాజానికి జవాబుదారీగా ఉండాలని ప్రకాశ్‌రాజ్ అన్నారు.

ఉద్యోగం చేస్తోందని మహిళ తల నరికిన మామయ్య

రాజస్థాన్‌లో ఘాతుకం

జైపూర్: తన కోడలు ఉద్యోగం చేయటం మింగుడుపడని రాజ్‌పుత్ వంశస్తుడు ఆమె తల నరికి అతికిరాతకంగా హతమార్చాడు. ఈ అమానవీయ ఘటన రాజస్థాన్‌లోని అల్వార్ జిల్లాలో గురువారం చోటుచేసుకుంది. అల్వార్ జిల్లాలో షాజహాన్‌పూర్ గ్రామంలోని ఫ్యాక్టరీలో పనిచేయడానికి బయల్దేరిన ఉమ(32)ను దారి మధ్యలో దుండగుడు పదునైన ఖడ్గంతో దారుణంగా తల నరికి చంపేశాడు. నిందితుడు మామ్‌రాజ్‌ను ఉమ భర్త ముఖేశ్ పెద్దనాన్నగా గుర్తించారు. ఉమ, ముకేశ్‌లకు ఇద్దరు సంతానం. కుటుంబాన్ని పోషించుకునేందుకు భర్తతోపాటు ఉమ పనిచేసేవారు. ఉమ ఉద్యోగం చేయడంపై తన మామ మామ్‌రాజ్ తరచు గొడవపడేవారని స్థానికులు చెప్పారు. రాజ్‌పుత్ మహిళలు పనిచేయకూడదని ఆయన వాదించేవాడని అన్నారు. నిందితుడిని పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు.

జాతీయ గీతంలో... 'సింధ్'ను తొలగించండి

- రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ

న్యూఢిల్లీ: జాతీయగీతంలోని 'సింధ్' పదాన్ని తొలగించాలని రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ రిపున్ భోరా అన్నారు. రాజ్యసభలో ప్రయివేటు మెంబర్ తీర్మానాన్ని ప్రవేశపెడుతూ... జాతీయగీతంలో ఉన్న సింధ్ అనే పదాన్ని తొలగించి దాని స్థానంలో 'ఈశాన్య భారతం' అనే పదాన్ని రాయాలన్నారు. ఈశాన్య భారతానికి సంబంధించి ఆ గీతంలో చోటు లేదని, ఇప్పటికైనా ఆ ప్రాంత ప్రాధాన్యతను గుర్తించాలన్నారు. సింధ్ అనే ప్రాంతం ఇప్పుడు పాకిస్తాన్‌లో ఉందని.. నిత్యం ఘర్షణ పడే పాకిస్తాన్‌కు చెందిన ప్రాంతం పేరు జాతీయగీతంలో అవసరం లేదన్నారు. జాతీయగీతాన్ని మార్చవచ్చునని దానిని ఆమోదించినప్పుడే అప్పటి రాష్ట్రపతి బాబు రాజేంద్రప్రసాద్ అన్నారని చెప్పారు.

అంతర్జాతీయం

సిరియాలో ఆగని దాడులు

టర్కీ దాడుల్లో 18 మంది మృతి

డమాస్కస్ : సిరియాలో నరమేధం కొనసాగుతోంది. బాంబు పేలుళ్లు, ఫిరంగుల చప్పుళ్లతో ఈ ప్రాంతమంతా భీతావహంగా మారింది. తాజాగా ఆఫ్రిన్ నగరంలో టర్కీ సైన్యం జరిపిన దాడిలో 18 మంది మృతి చెందారు. ఉత్తర సిరియాలో కుర్దు వర్గానికి చెందిన ప్రజలు అధికంగా నివసించే ఆఫ్రిన్ నగరాన్ని లక్ష్యంగా చేసుకొని టర్కీ దాడులకు పాల్పడటంతో వీరంతా మరణించినట్టు సిరియాలోని హక్కుల పర్యవేక్షణ సంస్థ తెలిపింది. మృతుల్లో ఐదుగురు చిన్నారులున్నారని పేర్కొంది. ఈ ఏడాది జనవరి 20న టర్కీ, సిరియాకు చెందిన తిరుగబాటు ప్రతినిధులు ఆఫ్రిన్ ప్రాంతంలో ప్రమాదకరమైన ఫిరంగులను ఏర్పాటు చేశారు. వీటి మూలంగానే ఆఫ్రిన్ ప్రాంతంలో అలజడులు చెలరేగుతున్నాయి. యూఎస్ మద్దతు గల వైపీజీ తిరుగుబాటుదారుల నియంత్రణలో ఉన్న ఈ ప్రాంతం ఇప్పటికే టర్కీకి చెందిన బలగాల చేతిలో చిక్కుకోవడంతో రోజుకో ఘటన జరుగుతోంది. నగర ప్రజలు పారిపోయేందుకు వీలుగా ఒకే ఒక రోడ్డు మార్గం మాత్రమే ఉండటంతో వారంతా బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. శుక్రవారం నాటికి 30 వేల మంది ఆఫ్రిన్ ప్రజలు మరణించినట్టు ఒక నిఘా సంస్థ తెలిపింది. సిరియాలో 2011లో అంతర్యుద్ధం చెలరేగింది. ప్రాభభయంతో కోటి 20లక్షల మంది ఇతర ప్రాంతాలకు వలసవెళ్లారు. దాదాపు 4లక్షల మంది ఆచూకీ నేటికీ లభ్యం కాలేదు.

అమెరికాలో కూలిన ఫ్లైఓవర్

ఆరుగురు మృతి , 9 మందికి గాయాలు

వాషింగ్టన్ : అమెరికాలోని మియామి నగరంలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. ఫ్లోరిడా యూనివర్సిటీకి సమీపంలో నూతనంగా నిర్మించిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జి ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ఘటనలో ఆరుగురు మృతి చెందారు. మరో తొమ్మిది మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. స్థానిక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం...మియామి నగరంలోని బ్రిడ్జి కూలిపోవడంతో ఆరుగురు మృతి చెందారు. అనేక వాహనాలు బ్రిడ్జి కిందే ఉండిపోయాయి. మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని అధికారులు తెలిపారు. ఫ్లోరిడా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ, సిటీ ఆఫ్ స్వీట్‌వాటర్‌ను అనుసంధానించి విద్యార్థులు దాటేందుకు ఈ బ్రిడ్జిని నిర్మించగా..తాజాగా దీనిని ప్రారంభించారు. 14.2 మిలియన్ డాలర్లతో ఈ బ్రిడ్జిని నిర్మించారు. సెల్ఫ్ ప్రొపెల్డ్ మాడ్యూలర్ ట్రాన్స్ పోర్టేషన్ విధానంలో అమెరికాలో నిర్మించిన తొలి బ్రిడ్జి ఇదే కావటం గమనార్హం. ఫ్లోరిడా గవర్నర్ రిక్ స్కాట్, సెనెటర్ మార్కో రూబియో ఘటనాస్థలంలో సహాయక చర్యలను పర్యవేక్షించారు. మృతుల కుటుంబాలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.



హెచ్-1బీ వీసా భాగస్వాములకు వర్క్‌పర్మిట్లు కల్పించాలి : డెమోక్రాట్ల డిమాండ్

వాషింగ్టన్: అమెరికాలో హెచ్-1బీ వీసాదారుల జీవిత భాగస్వాములకు పని అనుమతిని తొలగించొద్దని డెమోక్రటిక్ పార్టీకి చెందిన ఆరుగురు పార్లమెంట్ సభ్యులు ట్రంప్ సర్కార్‌ను డిమాండ్ చేశారు. మాజీ అధ్యక్షుడు ఒబామా హయాంలో హెచ్-1బీ వీసాలు కలిగిన వారి జీవిత భాగస్వాములకు కూడా అమెరికాలో వర్క్ పర్మిట్ కల్పిస్తూ వెసులుబాటు కల్పించారు. దీనికి సంబంధించి నిబంధనలు అలాగే ఉంచాలని సిలికాన్ వ్యాలీకి చెందిన డెమోక్రట్ నేతలు డిమాండ్ చేశారు. జీవిత భాగస్వాములకు ఇచ్చే ఈ హెచ్-4 వీసాతో ఎక్కువగా భారతీయులు లాభపడుతున్నారు. దాదాపు లక్ష మంది దీని ద్వారా వర్క్‌పర్మిట్ పొందారు. 2015లో ఒబామా దీనిని ప్రవేశపెట్టినప్పటి నుంచి దాదాపు లక్ష మందికి పైగా హెచ్-4 వీసా ద్వారా పని అనుమతి పొందినట్టు సమాచారం. హెచ్-1బీ వీసాలు కలిగిన భాగస్వాములకు వర్క్ పర్మిట్ ఉంచాలని కోరుతూ డెమోక్రటిక్ పార్టీకి చెందిన ఆరుగురు సభ్యులు హోంల్యాండ్ సెక్యూరిటీ సెక్రటరీకి తాజాగా లేఖ పంపించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్-4 వీసా విధానాన్ని రద్దు చేయాలని భావిస్తున్న సంగతి తెలిసిందే. ట్రంప్ యంత్రాంగం తమ నిర్ణయంపై పునరాలోచించాలని డెమోక్రటిక్ పార్టీ నేతలు కోరారు. హెచ్-4 వీసాలపై నిర్ణయం తీసుకునేందుకు జూన్ వరకు సమయం కావాలని ఇటీవల కోర్టు విచారణలో హోంల్యాండ్ సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్ వెల్లడించిన సంగతి తెలిసిందే.

ఎమ్‌వి యాక్ట్ సవరణ బిల్లును ఉపసంహరించాలి



- మార్చి 20న రాష్ట్ర సదస్సు: వాల్‌పోస్టర్ విడుదల చేసిన ఆర్టీసీ కార్మికసంఘాలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

దేశ రవాణా రంగాన్ని ప్రయివేటు కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు ఉద్దేశించిన మోటారు వాహన చట్టం సవరణ బిల్లు-2017ను కేంద్రప్రభుత్వం తక్షణం ఉపసంహరించుకోవాలని ఆర్టీసీ కార్మిక సంఘాల కో ఆర్డినేషన్ కమిటీ డిమాండ్ చేసింది. ఇదే అంశంపై ఈనెల 20వ తేదీ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సును నిర్వహిస్తున్నట్టు కమిటీ నేతలు తెలిపారు. శుక్రవారంనాడు టీఎస్‌ఆర్టీసీ ప్రధాన కార్యాలయం బస్‌భవన్‌లో ఏడు ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలు సంయుక్తంగా రాష్ట్ర సదస్సు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. టీఎస్‌ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు, ఎంప్లాయీస్ యూనియన్ (ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి కె రాజిరెడ్డి, తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె హన్మంతు, టీఎస్‌ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) వర్కింగ్ ప్రెసిడెంట్ జి అబ్రహం, బహుజన వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్ సురేష్, కార్మిక పరిషత్ (టీఎన్‌టీయూసీ) ప్రధాన కార్యదర్శి బి యాదగిరి, టీఎస్‌ఆర్టీసీ సూపర్‌వైజర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వాసుదేవరావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రవాణారంగ కార్మికుల డిమాండ్‌ను పట్టించుకోకుండా కేంద్రప్రభుత్వం రాజ్యసభలో బిల్లును ఆమోదింపచేసుకుంటే దేశవ్యాప్తంగా సమ్మెకు సిద్ధమని ప్రకటించారు. రవాణా కార్మికులకు కనీస వేతనం రూ.24వేలు ఇవ్వాలని, పెట్రోల్, డీజిల్ ఉత్పత్తుల్ని జీఎస్టీ పరిధిలోకి తేవాలని, రాష్ట్రాలకు వచ్చే నష్టాల్ని కేంద్రప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. పై డిమాండ్లతో ఈనెల 20వతేదీ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సును నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సదస్సులో ప్రజలు, ఆర్టీసీ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

100 డయల్‌కు వచ్చే కాల్స్‌పై డీజీపీ ఆరా

- స్వయంగా ఫోన్ చేసిన మహేందర్‌రెడ్డి

నవతెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి



ఆపదలో ఉన్న వారు 100 నంబర్‌కు డయల్ చేస్తే వెంటనే పోలీసులు నుంచి సహాయం లభిస్తుంది. నేరం జరిగితే వెంటనే పోలీసులు స్పందించి తగిన చర్యలు చేపడతారు. చైన్ స్నాచింగ్ తదితర దారి దోపిడీలు జరిగితే సమాచారమందుకున్న వెంటనే దొంగల కోసం పోలీసుల హంట్ మొదలవుతుందని పోలీసు ఉన్నతాధికారులు పలుమార్లు ప్రకటనలు చేశారు. ఈ విధానం ద్వారా ప్రజల్లో పోలీసుల పట్ల భరోసాను పెంచడమే గాక పోలీసుల క్విక్ రెస్పాన్స్‌తో తమ ఆటలు ఇక ముందు సాగవని నేరస్తులను హెచ్చరించినట్టుగా అవుతుందని 100 డయల్ సిస్టమ్‌ను మరింత పటిష్ట పరిచే దిశగా రాష్ట్ర డీజీపీ మహేందర్‌రెడ్డి కార్యచరణకు పూనుకున్నారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో రాచకొండ, సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలలో ఘటన జరిగిన 10 నిమిషాల లోపు పోలీసులు ఘటనా స్థలికి చేరుకుంటున్నారు. దీన్నింకా తగ్గించి ఐదారు నిమిషాల్లోపే బాధితులను ఆదుకునేలా చేయాలనే లక్ష్యాన్ని ఉన్నతాధికారులు నిర్ణయించుకున్నారు. అయితే జిల్లాల్లో మాత్రం ఘటన జరిగిన వెంటనే పోలీసులు స్పందించే తీరు, ఆపదలో ఉన్న వారిని ఆదుకునే సమయంలో ఇంకా ఆశించిన ఫలితాలు రావడం లేదనే అభిప్రాయాలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాల్లో సైతం పోలీసుల నుంచి క్విక్ రెస్పాన్స్ లభించేలా వారికి దిశా నిర్దేశం చేయడమే గాక, ఆ విధానం పని జరుగుతున్నదా లేదా అనేది పరిశీలించడానికి రాష్ట్ర డీజీపీ మహేందర్‌రెడ్డి స్వయంగా రంగంలోకి దిగి సమీక్షిస్తున్నారు. పోలీస్ క్విక్ రెస్పాన్స్‌కు ఎదురవుతున్న ఆటంకాలను ఏ విధంగా అధిగమించాలనే విషయమై పరిష్కార మార్గాలను కూడా ఉన్నతాధికారులతో చర్చించి నిర్దేశిస్తున్నారు. పోలీసుల పట్ల ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందిస్తే సమాజంలో చోటు చేసుకునే అనేక నేరాలను వారి సహాయంతోటే సమర్థవంతంగా కట్టడి చేయగలమని, నేరాల సంఖ్యను గణనీయంగా తగ్గించగలమని డీజీపీ తమ అధికారులకు స్పష్టం చేస్తున్నారు.

ఎన్నికలకు ఏడాదే!

నిర్లక్ష్యం తగదు

- పనిచేయని అధికారులపై చర్యలు తీసుకుంటాం : కడియం
- ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధిపై సమీక్షా సమావేశం

నవతెలంగాణ-వరంగల్



"ఎన్నికలకు ఏడాదే గడువు ఉంది. నిర్లక్ష్యం తగదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకాల పనులను పూర్తి చేయడంలో అధికారుల అలసత్వం ప్రదర్శించ వద్దు. పనిచేయని అధికారులపై చర్యలు తీసుకుంటాం" అని డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి అన్నారు. వరంగల్‌లోని హన్మకొండలో గల నందనాగార్డెన్‌లో ఐదు జిల్లాలకు సంబంధించిన కలెక్టర్లు, జిల్లా ఉన్నతాధికారులతో మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, డబుల్‌బెడ్ రూం ఇండ్ల నిర్మాణం, హరితహారం కార్యక్రమాలపై శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ.. పనులు చేయలేని ఇంజినీరింగ్ అధికారులను సరెండర్ చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. కొత్తగా వచ్చిన కలెక్టర్లు అభివృద్ధి పనులను వేగిరం చేయాలని కోరారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని సూచించారు. వచ్చే ఏప్రిల్ 30లోపు జనగామ జిల్లాలో మిషన్ భగీరథ తాగునీటిని ప్రజలకు అందించాలని అధికారులను ఆదేశించారు. జనగామ, భూపాలపల్లి జిల్లాలు మినహాయించి మిగిలిన జిల్లాల్లో మిషన్ భగీరథ పనులు పూర్తి చేసి రానున్న జూన్ 31లోపు ప్రజలకు నల్లా నీళ్లు అందించాలన్నారు. వరంగల్ అర్బన్ జిల్లాలో మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని 24 గంటలపాటు ఇచ్చేలా సమగ్ర ప్రణాళికను రూపొందించాలని కోరారు. మళ్లీ ఏప్రిల్ 15న సమీక్షా సమావేశం నిర్వహిస్తానన్నారు. మార్చి 31లోపు వరంగల్ రూరల్ జిల్లాలోని పరకాలలో గల అన్ని ఇండ్లకు తాగునీటిని సరఫరా చేయాలన్నారు. వారంలో ఒకరోజు మిషన్ భగీరథ పనులను సమీక్షించాలన్నారు. మిషన్ కాకతీయ మొదటి దశ, రెండో దశ, మూడో దశ పనులను జూలై 31లోపు పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు.

లింగయ్య యాదవ్‌కు అభినందనల వెల్లువ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టీఆర్‌ఎస్ రాజ్యసభ అభ్యర్థిగా ఎంపికైన బడుగుల లింగయ్య యాదవ్‌ను నల్లగొండ జిల్లా యాదవ సంఘం నాయకులు, టీఆర్‌ఎస్ నేతలు ఘనంగా సన్మానించారు. శుక్రవారం వనస్థలిపురంలోని లింగయ్య నివాసంలో నాయకులు, యాదవ సంఘం నాయకులతో అభిమానులతో పండుగ వాతావరణం నెలకొంది. యాదవుల అభివృద్ధికి నిరంతం కృషి చేస్తున్న ఏకైక సీఎం కేసీఆర్ అని లింగయ్య యాదవ్ అన్నారు. ఎంతో నమ్మకంతో పెద్దల సభకు నామినేట్ చేస్తున్నందుకు సీఎంకు యావత్ గొల్లకుర్మల తరుపున ధన్యవాదాలు తెలిపారు. యాదవుల కోసం కోకాపేటలో 10 ఎకరాల స్థలంలో రూ. 10 కోట్లతో యాదవ భవన్ నిర్మిస్తున్నారని అన్నారు యాదవుల కోసం దేశంలోనే ఎక్కడా లేని పథకాలు అమలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని చెప్పారు. 75 శాతం సబ్సిడీతో గొర్రెల పంపిణీ చేయడంతో గొల్లకురుమలు ఆర్థికంగా ఎదుగుతున్నారని అన్నారు. ఏప్రిల్ 29న హైదరాబాద్ జింఖానా మైదానంలో నిర్వహించనున్న యాదవ కృతజ్ఞత సభకు రాష్ట్రం నలుమూలల నుంచి యాదవ సోదరులు సోదరీమణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అన్ని వర్గాల వారికి సముచిత స్థానం కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్‌ఎస్ నేతలు అయోధ్య, ఇస్తారు యాదవ్, సీనియర్ జర్నలిస్టు కృష్ణయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

మోడీకి ఎదురుగాలి...

దేశ రాజకీయ యువనికపై కదలికలు వేగం పుంజుకుంటున్నాయి. సరికొత్త సమీకరణలు, అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటు న్నాయి. వెరసి బీజేపీకి ఎదురుగాలి మొదలైంది.

ప్రజా ప్రయోజనాలకు విఘాతం కలుగుతున్నా పట్టించుకోని నేతలు తమ పార్టీల ప్రయోజనాలకు ప్రమాదం ఏర్పడినప్పుడు మాత్రమే ప్రత్యామ్నాయాల గురించి మాట్లాడటం వలన ప్రయోజనమేముంటుంది..!? ఇప్పుడు కావాల్సింది ఒక నిజమైన ప్రజాపక్షం. ఓ విధానపరమైన ప్రత్యామ్నా యం. అదే ప్రజల ఆకాంక్ష.

ఉత్తరప్రదేశ్, బీహార్ ఉప ఎన్నికల ఫలితాలే ఇందుకు తాజా ఉదాహరణ. నిజానికి ఈ ఎదురుగాలి గుజరాత్ ఎన్నికల నుండే మొదలైంది. ప్రధాని మోడీకి ప్రతిష్టాత్మకం, బీజేపీకి కంచుకోట అనుకున్న గుజరాత్‌లో బీజేపీ గెలిచినప్పటికీ అది అంత గౌరవప్రదమైన గెలుపేమీ కాదు. గుజరాత్‌లో బీజేపీ స్థానాల సంఖ్య 165 నుంచి 99కి పడిపోవడం గమనార్హం. ఈ గెలుపు కూడా ప్రధాని నానా ప్రయాసలు పడితే తప్ప సాధ్యం కాలేదు. ఆపైన పంజాబ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ ఉప ఎన్నికల్లో బీజేపీకి వరుస ఓటములు ఎదురయ్యాయి. ఈ పరాభవం నుంచి ఈశాన్య రాష్ట్రాల్లో సాధించిన చిన్న చిన్న విజయాలతో ఉపశమనం పొందుతున్న బీజేపీకి తాజా యూపీ, బీహార్ ఫలితాలు శరాఘాతమనే భావించాలి. ఎందుకంటే దేశంలోనే అత్యధిక పార్లమెంట్ స్థానాలు ఉన్న రాష్ట్రం యూపీ. గత లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో బీజేపీకి ఏకపక్ష విజయాలను అందించి అధికారంలో కూర్చోబెట్టిన రాష్ట్రం యూపీ. అటువంటి రాష్ట్రంలో స్వయంగా ముఖ్యమంత్రి యోగి, ఉప ముఖ్యమంత్రి మౌర్య ఖాళీ చేసిన గోరఖ్‌పూర్, ఫూల్‌పూర్ లోక్‌సభ స్థానాల్లో బీజేపీ ఓటమిపాలైంది. దశాబ్దాలుగా తిరుగులేని విజయాలను సాధిస్తూ వచ్చిన ఈ స్థానాల్లో బీజేపీకి ఎదురైన ఈ ఓటమి మారుతున్న రాజకీయ పరిస్థితులకు సూచిక.




బద్ధ విరోధులైన సమాజ్‌వాదీ, బహుజన సమాజ్‌వాదీ పార్టీలు ఆఖరు నిమిషంలో చేతులు కలపడం ఈ ఎన్నికల్లో అనూహ్య పరిణామం. కేవలం ఈ కారణంగానే బీజేపీ ఓడిపోయిందని చెప్పలేం. ఎందుకంటే గత ఎన్నికల్లో ఈ రెండు పార్టీల ఓట్లతోపాటు, కాంగ్రెస్ పార్టీకి వచ్చిన ఓట్లను కలిపినా బీజేపీకి వచ్చిన ఓట్లకంటే తక్కువే. కనుక ఈ ఫలితం బీజేపీ పట్ల ప్రజా వ్యతిరేకతను స్పష్టం చేస్తున్నదనడంలో సందేహం లేదు. ఇక బీహార్‌లో ఆర్‌జేడీ విజయాన్ని కూడా తేలిగ్గా తీసిపారేయలేం. నితీశ్‌కుమార్ బీజేపీ పంచన చేరాక జరిగిన ఈ ఆరియా లోక్‌సభ ఫలితం కూడా బీజేపీకి చేదు అనుభవాన్నే మిగిల్చింది. అంతేకాదు ఈ ఫలితం మోడీ, నితీశ్‌ల మైత్రి ఎంత అనైతికమో, అపవిత్రమో తేల్చి చెప్పింది. ఏది ఏమైనా యూపీ, బీహార్‌లతోపాటు కాంగ్రెస్ ప్రధాన ప్రత్యర్థిగా ముఖాముఖి తలపడుతున్న పంజాబ్, రాజస్థాన్‌లలో కూడా చతికిలబడటం బీజేపీకి ఎదురుదెబ్బే. బీజేపీ ఏలుబడిలో దేశమంతటా అలుముకున్న అసహనం, మతోన్మాదం, హింసాత్మక ధోరణులతోపాటు ఈ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, ఫలితంగా దుర్భరమవుతున్న ప్రజా జీవితం, పెచ్చరిల్లుతున్న అవినీతి, కుంభకోణాలను ప్రజలు అర్థం చేసుకుంటున్నారనడానికి సూచికలు ఈ ఫలితాలు. బీజేపీ మిత్రపక్షాలకు కూడా ఈ విషయం స్పష్టమతుండటంతో క్రమంగా దూరమవుతున్నాయి.

బీజేపీకి మిత్రపక్షాలు దూరమవుతుండటానికి కేవలం ఆ పార్టీ పట్ల పెరుగుతున్న ప్రజా వ్యతిరేకతే కారణం అని చెప్పలేం. దీనికి మించి ఎవరి కారణాలు వారికున్నాయి. అన్నింటికీ మించి మోడీ-షా ద్వయం నియంతృత్వ ధోరణి వారిని ఆందోళనకు గురిచేస్తున్నది. ఆ తరువాత కేంద్రంలో ప్రభుత్వం తమ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వటం లేదన్నది వాటి ఆక్షేపణ. శివసేన ఇందుకొక తార్కాణం. శివసేన బీజేపీకి అత్యంత సన్నిహితమైన మిత్రపక్షం. కానీ అదే శివసేన నేడు ప్రభుత్వాన్నీ, బీజేపీ నాయకత్వాన్నీ బహిరంగంగా విమర్శిస్తోంది. మరో ప్రధాన మిత్రపక్షం అకాలీదళ్ చాలాకాలంగా వేచిచూసే ధోరణినే అవలంబిస్తూ, అంటీముట్టనట్టుగానే వ్యవహరిస్తున్నది. ఇక తెలుగుదేశం ఏపీకి అన్యాయం జరిగిందంటూ ఇటీవలే మంత్రివర్గం నుంచి వైదొలగి, ఇప్పుడు అవిశ్వాస తీర్మానం కూడా పెట్టింది. నిన్న మొన్నటి వరకు మోడీనీ, కేంద్రాన్నీ పల్లెత్తు మాట అనని టీఆర్ఎస్ ఉన్నట్టుండి వ్యతిరేక గళం అందుకుంది. బీజేడీ నేత నవీన్ పట్నాయక్ సైతం బీజేపీని మునిగిపోతున్న పార్టీగా అభివర్ణిస్తున్నారు. వీటన్నిటికీ కారణాలేమైనా రాజకీయంగా బీజేపీకి ఎదురుగాలినే సూచిస్తున్నాయి.

బీజేపీకి దూరమవుతున్న ఈ రాజకీయ పక్షాలన్నీ కాంగ్రెస్‌తో కలవడానికి సిద్ధంగా లేవు. అందుకే తృతీయ ఫ్రంట్ వాదనలు వినిపిస్తున్నాయి. కేసీఆర్ తృతీయఫ్రంట్ పాటెత్తుకుంటే చంద్రబాబు ఫెడరల్ ఫ్రంట్‌కు ప్రయత్నిస్తున్నట్టుగా కథనాలు వెలువడుతున్నాయి. వీటికి సానుకూలతలు కూడా వ్యక్తమవుతున్నాయి. కానీ బీజేపీకి ప్రత్యామ్నాయం కాంగ్రెస్, కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీ కానట్టే, ఈ రెండింటికీ ప్రత్యామ్నాయం మరో రాజకీయ కూటమి మాత్రమే కాదన్నది ఇక్కడ గుర్తించవలసిన అంశం. పార్టీలు వేరైనా కాంగ్రెస్, బీజేపీల విధానాలు ఒక్కటే. వీటికి నిజమైన ప్రత్యామ్నాయం కావాలి. ప్రజా ప్రయోజనాలకు విఘాతం కలుగుతున్నా పట్టించుకోని నేతలు తమ పార్టీల ప్రయోజనాలకు ప్రమాదం ఏర్పడినప్పుడు మాత్రమే ప్రత్యామ్నాయాల గురించి మాట్లాడటం వలన ప్రయోజనమేముంటుంది..!? ఇప్పుడు కావాల్సింది ఒక నిజమైన ప్రజాపక్షం. ఓ విధానపరమైన ప్రత్యామ్నాయం. అదే ప్రజల ఆకాంక్ష.

అజ్ఞానాంధకారానికి కోటి దీపాలెందుకు?



డాక్టర్ దేవరాజు మహారాజు

"పిల్లలకు చదవడం, రాయడం నేర్పడం కాదు. తాము చదువుతున్న దాన్ని ప్రశ్నించడం నేర్పండి. జాతి భవిత పూర్తిగా దానిపైనే ఆధారపడి ఉంది."


- జార్జిం క్లారిన్, అమెరికన్ విమర్శకుడు.

అజ్ఞానాంధకారం పారద్రోలడానికి దేవుడి పేరిట కోటి దీపాలు అవసరం లేదు. చిన్న జ్ఞాన దీపం చాలు! మనుషుల్లో ఉన్న అజ్ఞానాన్ని, అంధకారాన్ని పారద్రోలే ప్రయత్నాలు జరగాలి. కోటి దీపాలు వెలిగిస్తే భక్తి, ముక్తి తెగవచ్చి పడుతుందనుకోవడం శుద్ధ అబద్ధం! పూజలు చేయడం వల్ల నూనె, నెయ్యి, పసుపు, కుంకుమ, పూలు వృథా అవుతాయి.

దేశాన్ని వైజ్ఞానిక యుగంలోకి నడిపే యువశక్తి సామాన్య జనంలోనే ఉంది. దాన్ని వెలికితీయాలి. పనికిరాని మూఢనమ్మకాల్ని కొత్తకొత్త రూపాలతో జనం మీదికి విసిరి, వారిని ప్రభావితం చేయాలని చూసే అధినాయకులు చాలా మంది ఉంటారు. ఎక్కడికక్కడ వారి కుతంత్రాల్ని ధ్వంసం చేస్తూ, వాస్తవ దృక్కోణంలోంచి విషయాల్ని విశ్లేషించుకుంటూ, యువశక్తి ఒక వెల్లువలా రావాల్సిన అవసరం ఉంది! తప్పదు!!

ఖర్చు వృథా అవుతుంది. సమయం వృథా అవుతుంది తప్ప ఒరిగేదేమీ ఉండదు. ఇలాంటివన్నీ మతాధిపతులకు, స్వామీజీలకు, ప్రవచకులకు, వారి వారి నిర్వాహకులకు తప్ప సామాన్య జనానికి ఏమాత్రం ఉపయోగపడవు. ఇవి నిర్వహించే టెలివిజన్ ఛానళ్లకు ఉపయోగపడతాయేమో గానీ, ప్రేక్షకులకు ఉపయోగపడవు. ప్రజల్లో ఆత్మవిశ్వాసం పెంచాలంటే దేవుణ్ణి అడ్డుపెట్టుకుని దీపాలు వెలిగించడం కాదు. ప్రజల్ని జ్ఞానం వైపు అడుగులు వేయించాలి. అందుకు కావల్సింది ఆధ్యాత్మిక గురువులు మాత్రం కాదు. జ్ఞానులైన భౌతిక శాస్త్రవేత్తలు, రసాయన శాస్త్రవేత్తలు, జీవ శాస్త్రవేత్తలు, ఖగోళ, వాతావరణ, పర్యావరణ శాస్త్రజ్ఞులు కావాలి. ఆయా అంశాల్ని సులభంగా, సరళంగా చెప్పగల ఉపన్యాసకులు, బుద్ధిజీవులూ కావాలి. ముఖ్యంగా రచయితలు కావాలి. మనిషిలో తరతరాల నుండి పేరుకుపోయిన అజ్ఞానాన్ని వెలికితీసేవారు కావాలి. అంతేగాని, కోటి దీపాలు వెలిగించడం వల్ల ఏమవుతుందీ? ప్రజల్లో ఉన్న మూఢ నమ్మకాల్ని మరింతగా పెంచడానికి లాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయి తప్ప, మరెందుకూ ఉపయోగపడవు.

ఇటీవల మరొకాయన కోటి గ్రంథాల వితరణ కార్యక్రమం చేపట్టాడు. నిష్కామ సేవా మహా యజ్ఞం.. ఉచిత గ్రంథ వితరణ.. అని తనకు తానే ప్రకటించుకున్నాడు. తన పరిచయం కూడా తనే ఈ విధంగా ఇచ్చుకున్నాడు. "శివశక్తి శిరిడిసాయి అనుగ్రహ మహాపీఠాధిపతి, శక్తిపాత సిద్ధయోగీశ్వరులు, తత్త్వదర్శి, సిద్ధగురు" అనే ఉపోద్ఘాతంతో తన పేరు ప్రకటించుకున్నాడు. ఈయన సిద్ధాంతమేమిటంటే.. "శివుడే దేవాది దేవుడు. ఆదిదేవుడు. పరమ పురుషుడు" అని! ఈయన 121 అధ్యాయాలతో "కాండలతో, 456 పేజీలతో ఒక మహా గ్రంథం రచించాడట! అది నాలుగు వేదాల్ని, నూట పదహారు ఉపనిషత్తుల్ని, నూటా ఎనిమిది పురాణాల్ని, ఎన్నో ఇతిహాసాలను, స్మృతులను, విభిన్న శాస్త్రాలను, విభిన్న మతాల గ్రంథాలను సునిశితంగా పరిశోధించి రచించిన అసామాన్య గ్రంథం.. అని తనకు తానే ప్రకటించుకున్నాడు. తన గ్రంథం గూర్చి ఆయనే ఇంకా ఇలా రాసుకున్నాడు. "శివుడిని గాక, మరొక దైవాన్ని దేవాదిదేవుడనడం, శివుడిలో శతకోటి అంశయైన దైవాన్ని దేవదేవేరుడనడం ఏ విధంగా భ్రాంతియో, అవివేకమో వివరించిన అసాధారణ గ్రంథం. మోక్షాన్ని ప్రసాదించే విశిష్ట గ్రంథం.. 18 ఏండ్ల శాస్త్ర అధ్యయనంతో, తపస్సుతో, ధ్యానంతో అనుభవ, అనుభూతులతో గ్రహించిన నిగూఢ రహస్య జ్ఞానాన్ని బహిర్గతం చేసిన విలక్షణ మహత్ గ్రంథం... శ్రద్ధతో భక్తితో చదవండి.. తరించండి" తనకు తానే తన పుస్తకం గురించి ఇంతలా ప్రకటించుకున్న పీఠాధిపతి కీర్తి కండూతి ఇక్కడ అవగతమౌతోంది. సమకాలీన సమాజం ఎలా ఉంది అనే ధ్యాస లేకుండా, శివుడికి శిరిడీ సాయికి సంబంధం కలిపిన ఈ 'మేధావి' పాపం కోటి పుస్తకాలు అచ్చేసి పంచిపెట్టుకున్నా జనంలో స్పందన లేదేమిటీ? మత రహిత సమాజం కోసం ఒకవైపు ప్రయత్నాలు జరుగుతూ ఉంటే... హిందూ దేవుళ్లందరిలోకి కేవలం శివుడే దేవాదిదేవుడంటే ఇతర దేవుళ్లు, వారి భక్తులూ ఒప్పుకుంటారా? ఆయన అజ్ఞానాన్ని జనం ఇంకా భక్తితో చదివి తరించాలట? పాపం! అజ్ఞానంలో రాసిన పుస్తకాలు కోటి ప్రతులు పంచిపెట్టుకున్నా ఫలితం ఉండదు. అజ్ఞానాన్ని పారద్రోలే ప్రయత్నాల్ని పక్కనపెట్టి, కోటి దీపోత్సవాలు చేసినా ఫలితం ఉండదు. చేసిన వారికి సంతృప్తిగా ఉంటుందేమో కాని, అది వారి వ్యక్తిగతం. సమాజానికి ఒనగూరేది ఏమీ ఉండదు.



క్లాసులో ఫస్ట్ ర్యాంక్ కోసం ఇద్దరు పిల్లలు వారి వారి మతాలకు అనుగుణంగా వారి వారి దేవుళ్లకు మొక్కుకున్నారట. "నన్ను క్లాసులో ఫస్ట్ మార్కులు తెచ్చుకునే విధంగా అనుగ్రహించు యహోవా" అని క్రిస్టియన్ బాలుడు వేడుకున్నాడు. "నన్నే క్లాసులో ఫస్టుగా నిలబెట్టు స్వామీ" అని మరో హిందూ బాలిక గణేషుణ్ణి ప్రార్థించింది. అంటే గణేషునికి, ఏసుకు యుద్ధం జరగాల్సిందేనా? మొక్కుకున్న వాళ్లు టెన్షన్ లేకుండా హాయిగా ఉంటారు. దేవుళ్లు మాత్రం టెన్షన్ పడి కయ్యానికి కాలు దువ్వుతారన్నమాట! ఇప్పటి కార్పొరేట్ విద్యా విధానం ఏ స్థాయికి పోయిందో చెప్పడానికి ఓ కార్టునిస్ట్ కార్టూన్ గీశాడు. అందులో ఒక డాక్టర్ డెలివరీ కోసం వచ్చిన గర్భిణీతో ఇలా అంటాడు.. "డెలివరీ కాగానే శిశువుకు క్లాస్ స్టార్ట్ చెయ్యాలండి... లేకపోతే స్టాండర్డ్ అందుకోవడం కష్టం. బిడ్డ వెనకబడిపోయే అవకాశం ఉంది. అందుకే మా స్కూల్లో గర్భిణులకు డెలివరీ సదుపాయం కల్పించాం. ఆ అవకాశాన్ని వాడుకోండి!" అంటే బిడ్డ పుట్టక ముందు నుండే ఫీజు వసూలు కార్యక్రమం మొదలౌతుందున్నమాట! శ్రద్ధగా చదువుతూ, విషయ పరిజ్ఞానం సంపాదించడం ముఖ్యమని పిల్లలకు చెప్పాలి. దేవుళ్లకు మొక్కుతూ కూర్చోవడం వల్ల ఫలితాలేమీ ఉండవని పిల్లలకు అర్థం చేయించాలి. జీవితాన్ని జీవించడం, ఎదురయ్యే సమస్యల్ని ఎదుర్కోవడం ముఖ్యం గానీ, ర్యాంకుల గొడవల్లో పడి, మానసిక ఒత్తిళ్లకు గురై ఆత్మహత్యలకు పాల్పడొద్దన్నది వారికి తెలియాలి. ఒప్పేదో తప్పేదో తెలుసుకుంటూ, నీతిమంతంగా గౌరవంగా బతకడానికి మతమేదీ అవసరం లేదన్నది వారికి చిన్న వయస్సులోనే తెలియాలి.

"భగవంతుడున్నాడు. అతడు స్వర్గ నరకాల్ని చూసుకుంటున్నాడు"... అని కొందరు నమ్ముతున్నారు కదా! సరే ఆ విషయం పక్కన పెట్టండి. మరి ఈ భూమి సంగతి ఎవరు చూడాలి? పర్యావరణాన్ని మనిషి కలుషితం చేస్తూ ఉంటే దేవుడొచ్చి శుభ్రం చేస్తాడా? చేయడు కదా? ఏది చేసినా మనిషే చేయాలి. ఈ భూమిని కాపాడుకోవాల్సింది మనిషి మాత్రమేనని పిల్లలకు చెప్పండి. ఇందులో దేవుడి ప్రమేయం, మత ప్రమేయం ఏదీ లేదన్నది గ్రహించుకోండి. ఈ తరానికి అందిన ఈ భూమి, ఈ ప్రకృతి, ఈ గాలి, ఈ నీరు ఇంతే స్వచ్ఛంగా వచ్చే తరాలకు అందించాల్సిన బాధ్యత ఈ తరం వారిమీదే ఉంది. మనిషి తనలోని నీచ ప్రవృత్తిని, అలసత్వాన్ని, అహాన్ని, బాధ్యతా రాహిత్యాన్ని పక్కనపెట్టి, తననూ తన తరాన్ని కాపాడుకుంటూ వచ్చే తరాలకు ప్రశాంతంగా బతికే అవకాశం ఇవ్వాలికదా? వాస్తవాల్ని గ్రహించకుండా బాధ్యతల్ని దేవుళ్లకు, దయ్యాలకు అంటగట్టడం మూర్ఖత్వమవుతుంది. పలాయనత్వమౌతుంది. మానవత్వాన్ని వివేకాన్ని ముందుకు రానివ్వాలి. అదే విషయం పిల్లలకూ బోధిస్తుండాలి.

మన జ్ఞానం దోమంత. వాడి అజ్ఞానం ఏనుగంత కావు, కుంజర యూథంబు దోమ కుత్తుక జొచ్చున్ - చచ్చున్...

మనదేశంలో జరుగుతున్నదేమిటంటే గ్రంథాలయాలు గానీ, టాయిలెట్స్ గానీ ఊరూరా ఉండవు. కాని ప్రతి సందులో నాలుగు మత కేంద్రాలుంటాయి. అవి జనం మెదళ్లలో పాపం, పుణ్యం, పవిత్రత పేర్లతో మతమౌఢ్యం నింపుతుంటాయి. అందుకే ఇక్కడ జీవితాలు అపరిశుభ్రంగా తయారవుతున్నాయి. ఇంక స్వచ్ఛభారత్ ఎక్కడ? మెదళ్లలో మురికి నింపుకున్న వాళ్లంతా స్వచ్ఛభారత్ గురించి మాట్లాడుతున్నారు. ఊరూరా గ్రంథాలయాలుంటే, ఆలోచనా పరిధి పెంచి, జ్ఞాన ప్రమాణాలను పెంచుతాయి. అలాగే, మరుగుదొడ్లుంటే పరిసరాల శుభ్రతను పెంచుతాయి. ఆరోగ్య ప్రమాణాల్ని పెంచుతాయి. మరి గుడి, మసీదు, చర్చ్ ఇతర ప్రార్థనా స్థలాలు ఏం పెంచుతున్నాయో ఎవరికి వారు ఆలోచించుకోవాల్సిందే. వేమనను మహాకవిగా పొగిడే వారంతా ఆయన చెప్పిన విషయాలేమైనా ఆలోచించారా?

"పిండమును జేసి పితురుడని భావించి
కాకులకు వేయు గాడిదల్లారా
పియ్యతిను కాకి పితురుడెట్లాయరా?
విశ్వదాభిరామ వినురవేమ".. సరే దీన్ని అట్లా ఉండనివ్వండి.

హైదరాబాద్‌లో జరిగిన గ్లోబల్ ఎంటర్ ప్రిన్యూర్‌షిప్ సమ్మిట్ (జీఈఎస్) 2017లో మహిళాసాధికారత గురించి మాట్లాడుతూ మోడీజీ ఝాన్సీలక్ష్మీబాయి ప్రసక్తి తెచ్చారు. దేశంలోని మహిళలందరికీ ఝాన్సీ ఆదర్శప్రాయం కావాలని ఆయన ఉద్దేశం. అయితే ఇప్పుడు రాజ్యాలు లేవు. కత్తియుద్ధాలూ లేవు. ఆధునిక స్పృహతో మహిళలకు స్ఫూర్తిదాయకంగా ఉండే పేర్లు చెప్పదలిస్తే కల్పనా చావ్లా, సునీతా విలియమ్స్ పేర్లు చెప్పాల్సింది. లేదా ఈ కాలపు మహిళా శాస్త్రవేత్తల పేర్లు, పారిశ్రామిక వేత్తల పేర్లు చెప్పాల్సింది కదా? అంటే ఆయన తనను తాను అప్‌డేట్ చేసుకోలేదన్న మాట! ఇక్కడి సమ్మిట్‌కు గొప్పవాళ్లంతా వచ్చారు. నిజమే కానీ, భారతీయ మహిళ స్థితిగతుల్ని తెలుసుకున్న వారెవరూ లేరు. ఆడపిల్లల్ని పిండదశలోనే తుంచేయడం, ఒకవేళ పుట్టినా సరైన తిండి, విద్య అందించకపోవడం, కొంచెం ఎదిగితే యాసిడ్ దాడులు, లైంగిక దాడులు, గృహహింస... ఇవన్నీ ఎదుర్కొని మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగగలరని ఎలా అనుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలు వారికెవ్వరికీ తెలిసినట్టు లేదు. సంప్రదాయాల్లో చాదస్తాల్లో, వారిని కట్టిపడేసి, స్వేచ్ఛగా ఎగరాలని ఎలా ఆశిస్తారు? సంస్కృతి పేరుతో గుళ్ళు, గోపురాలు, పూజల చుట్టూ తిరుగుతున్న మహిళ, ఎలా చైతన్యవంతురాలవుతుంది? అని ఆలోచించినవారు లేరుకదా! మోడీజీ తనను తాను అప్‌డేట్ చేసుకోవాల్సి ఉందని ఊరికే అనడం లేదు. అందుకు ఎన్నో ఉదాహరణలివ్వొచ్చు. ఆయనే చెప్పిన మరో విషయం కూడా గమనించండి. 1964లో మరణించిన నెహ్రూజీ 1980లో పుట్టిన బీజేపీని చూసి వణికిపోయారట! ఆయన చరిత్ర పరిజ్ఞానానికి మనం అబ్బురపడాల్సి వస్తోంది కదా? మన పాలకులు ఆ స్థాయిలో ఉంటే ఏం చేస్తాం? సామాన్య ప్రజలు అప్రమత్తమవ్వాలి. వివేకవంతులవ్వాలి. దేశాన్ని వైజ్ఞానిక యుగంలోకి నడిపే యువశక్తి సామాన్య జనంలోనే ఉంది. దాన్ని వెలికితీయాలి. పనికిరాని మూఢనమ్మకాల్ని కొత్తకొత్త రూపాలతో జనం మీదికి విసిరి, వారిని ప్రభావితం చేయాలని చూసే అధినాయకులు చాలా మంది ఉంటారు. ఎక్కడికక్కడ వారి కుతంత్రాల్ని ధ్వంసం చేస్తూ, వాస్తవ దృక్కోణంలోంచి విషయాల్ని విశ్లేషించుకుంటూ, యువశక్తి ఒక వెల్లువలా రావాల్సిన అవసరం ఉంది! తప్పదు!!

సుప్రసిద్ధ సాహితీ వేత్త, బయాలజీ ప్రొఫెసర్
సెల్: 9573706806

పాలకవర్గాలతో గూగుల్ కుమ్మక్కు



నెల్లూరి నర్సింహారావు

మధ్యప్రాచ్యంలోను, ఇతర ప్రాంతాలలోను రాజకీయ హత్యలు చేసేందుకు పనికివచ్చే కృత్రిమ మేథకు సంబంధించిన సాఫ్ట్‌వేర్‌ను అమెరికా మిలిటరీ, గూఢచార వర్గాలకు అందించినట్టు గతవారం గూగుల్ ధృవీకరించింది. గూగుల్‌ను ఉపయోగించే ఈ మిలిటరీ ప్రాజెక్టును మావెన్ అని పిలుస్తున్నారని గిజ్‌మోడొ అనే వెబ్‌సైట్ వెల్లడించింది. చలనంలోవున్న లేక చలనరహితంగావున్న వ్యక్తుల, వస్తువుల ఛాయాచిత్రాలను స్వయంచాలకంగా గూగుల్ సాఫ్ట్‌వేర్‌కు సంబంధించిన కంప్యూటర్ విజన్ రికార్డ్ చేస్తుంది.

కృత్రిమ మేథో ఆయుధపోటీలో అమెరికా క్రియాశీలంగా వున్నదని మెరైన్ కార్ప్స్ కర్నల్ డ్రు కుకోర్ అన్నాడు. ఇంటెలిజెన్ సర్వేలెన్, రికన్నైజన్స్ ఆపరేషన్స్ డైరెక్టొరేట్‌లో అల్గోరిథమ్ వార్‌ఫేర్ క్రాస్ ఫంక్షన్ టీమ్‌కి ఈయన చీఫ్‌గా వ్యవహరిస్తున్నాడు. గూగుల్‌కు మూల కంపెనీ ఆల్ఫాబెట్‌కు ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గావున్న ఎరిక్ స్కిమ్‌డిట్ గూగుల్‌ను కృత్రిమ మేథో కంపెనీగా పేర్కొన్నాడని కర్నల్‌కుకురో అన్నాడు. ప్రపంచవ్యాప్తంగా అమెరికా చేస్తున్న నేరపూరిత కార్యకలాపాలలో గూగుల్ పాలుపంచుకుంటున్నట్టు ఇలా బహిర్గతమైన సమాచారం తెలియజేస్తున్నది. అంతేకాకుండా మెగా ఇంటర్‌నెట్, టెలికమ్యూనికేషన్స్ కంపెనీలకు అమెరికా మిలిటరీ, గూఢచార సంస్థలకు మధ్య బలమైన సంబంధాలున్నట్టు కూడా ఈ సమాచారంతో మనకు తెలుస్తున్నది. నిజానికి గూగుల్ వ్యవస్థాపకుడైన స్కిమిడిట్ అమెరికా రక్షణశాఖ ఇన్నొవేషన్ బోర్డు సలహాదారులలో ఒకడు. డిఫెన్స్ ఇన్నొవేషన్ యూనిట్ ఎక్స్‌పెరిమెంటల్(డిఐయుఎక్స్) అనే ప్రయివేటు, మిలిటరీ భాగస్వామ్య సంస్థను గూగుల్ ప్రధాన కార్యాలయానికి అతిసమీపంలో స్థాపించారు. ఇటువంటి ఏర్పాట్లు అమెరికాలో ప్రజాస్వామిక హక్కులకు ప్రమాదకరంగా పరిణమించనున్నాయి. సామ్రాజ్యవాద యుద్ధం, దేశంలో అణచివేత విధానం అవలంబించటమనేది అమెరికా పాలక వర్గాల విధానం.

గత రెండేండ్లుగా ప్రభుత్వ గూఢచార ఏజన్సీలు గూగుల్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇతర టెక్నాలజీ కంపెనీల సహకారంతో వార్తలను, సెర్చి ఫలితాలను తారుమారు చేసి ఆన్‌లైన్‌లో సమాచారాన్ని సెన్సార్ చేస్తున్నాయి. డెమోక్రాటిక్ పార్టీ ఎన్నికల ప్రచారంలో అమెరికా గూఢచార సంస్థ సిఐఏ దూరి 'ఫేక్ వార్తలు', 'రష్యా జోక్యం'వంటి అభూతకల్పన సృష్టించింది. దేశంలోని ప్రతిపక్షాలను నేరస్థులుగా చూపి అణచేయటమే ధ్యేయంగా ఈ చర్యలను తీసుకోవటం జరుగుతున్నది. గూగుల్ సెర్చి అల్‌గోరిథమ్‌లో సెన్సార్‌షిప్ అంశాన్ని గత ఏప్రిల్‌లో జోడించారు. ఆ తరువాత ఫేస్‌బుక్ వార్తలకు సంబంధించిన సాఫ్ట్‌వేర్‌లో మార్పులుచేసి ప్రత్యామ్నాయ దృక్పథాలకు చెందిన వార్తలను అందించే స్వతంత్ర వార్తా సంస్థలను వెనుకకునెట్టి న్యూయార్క్ టైమ్స్ వంటి అనుకూల వార్తా సంస్థల వార్తలకు ప్రాధాన్యతవచ్చేలా చేశారు. అంతేకాకుండా ప్రస్తుతం అనేక వామపక్ష, యుద్ధ వ్యతిరేక, ప్రగతిశీల వార్తా సంస్థలను అణచేయటానికి అత్యంత అప్రజాస్వామిక విధానాలను రూపొందిస్తున్నారు. తమ ప్రపంచ ఆధిపత్యానికి, చైనా, రష్యాలవంటి దేశాలతో పోటీపడటానికి అడ్డంకి అవుతున్న కార్మికవర్గపోరాటాలను చూసి కార్పొరేట్, ద్రవ్య పెట్టుబడిదారీ వర్గాలు బెదురుతున్నాయి. అమెరికాలో ప్రబలుతున్న సామాజిక అలజడి పెట్టుబడిదారీ రాజ్యానికి సవాలుగా తయారైంది. పశ్చిమ వర్జీనియా రాష్ట్రంలోని ఉపాధ్యాయులు చేసిన సమ్మె చాలా ప్రాధాన్యత కలిగి ఉంది. ప్రభుత్వ అనుకూల సంఘాలను ధిక్కరించి ఉపాధ్యాయులు సమ్మెకు దిగారు. అంతేకాకుండా కార్మిక వర్గానికి చెందిన అనేక ఇతర వర్గాలు అమెరికా వ్యాప్తంగా సమ్మెకు దిగుతున్నాయి.

అమెరికాలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా కార్మికులు పరస్పరం సంభాషించుకోవటానికి, సమాచారం ఇచ్చి పుచ్చుకోవటానికి సోషల్ మీడియా బాగా ఉపయోగపడుతున్నది. ఈ విషయాన్ని కార్పొరేట్ మీడియా గమనిస్తున్నది. పశ్చిమ వర్జీనియా రాష్ట్రంలోని టీచర్లు ఒక ఫేస్‌బుక్ గ్రూపుగా ఏర్పడి సంప్రదాయ పద్ధతులకు భిన్నంగా సమ్మె నడిపిన తీరు ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నదని న్యూయార్క్ టైమ్స్ రాసింది. శ్రామికుల అలజడికి సోషల్ మీడియా ప్రభావం కారణమని ఒక పత్రిక హెచ్చరించింది. స్వేచ్ఛగా ప్రవహిస్తున్న సమాచారం తమ ఆధిపత్యానికి ప్రమాదకరంగా పరిణమిస్తున్నదని గ్రహించిన పాలకవర్గాలు దానిపై నియంత్రణ సాధించాలని ప్రయత్నిస్తున్నాయి. ఈ నియంత్రణకు వ్యతిరేకంగా జరిగే పోరాటం సామ్రాజ్యవాద యుద్ధానికి, అసమానతలకి, దోపిడీకి వ్యతిరేకంగా జరిగేపోరాటాలతో జోడింపబడే తరుణం ఆసన్నమైంది. వాక్ స్వాతంత్ర్యంపైన స్వేచ్ఛా ఇంటర్‌నెట్ పైన జరుగుతున్న దాడికి వ్యతిరేకంగా జరిగే పోరాటం పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటమే. సోషల్ మీడియా పై నియంత్రణకు వ్యతిరేకంగా జరిగే పోరాటం నిస్సందేహంగా యావత్తు ప్రపంచ ప్రజలను కదిలిస్తుంది. ఎందుకంటే అది ప్రపంచ వ్యాప్తంగా అశేష ప్రజల జీవితాలను ప్రభావితం చేస్తుంది గనుక. వర్గపోరాటాలు నిర్దిష్ట సమాజాలలోనే కాకుండా వాస్తవిక ప్రపంచంలో కూడా జరుగుతున్న కాలమిది. ఇది భావిపోరాటాలను ప్రపంచస్థాయి పోరాటాలు గా మారుస్తుందనటంలో ఎటువంటి సందేహం లేదు! ■

ఆరోగ్యబీమా... అంత సులభం కాదు సుమా!



జి. తిరుపతయ్య

కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి అరుణ్ జైట్లీ ప్రవేశ పెట్టిన ఈ సంవత్సరం బడ్జెట్‌లో ఐదు కోట్ల కుటుంబాలకు ప్రతి కుటుంబానికి ఐదు లక్షల ఉచిత ఆరోగ్య బీమా కల్పించే పథకాన్ని ప్రవేశ పెట్టారు. ఈ పథకం కింద కుటుంబానికి ఐదుగురి చొప్పున మొత్తం యాభై కోట్లమందికి ఉచిత ఆరోగ్య బీమా అందిస్తామని నొక్కి మరీ చెప్పారు. నిజానికి ఈ పథకం ఆహ్వానించదగి నదే. దేశ జనాభాలో సగం మందికి ఐదు లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం ఉంటే చాలా మంచిదే. అత్యంత పేదలైన యాభై కోట్ల మందికి ఇది వర్తిస్తే ఇంకా మంచిదే, కానీ అలా జరుగు తుందా? యాభై కోట్ల మంది బీమా(మెడిక్లెయిమ్) ద్వారా ఆరోగ్య సర్వీసులు పొందుతారా? ముమ్మాటికీ సందేహమే! ఎందుకంటే కేవలం రెండు వేల కోట్లు మాత్రమే ఈ పథకానికి కేటాయించడం ద్వారా దీనిపై చిత్తశుద్ధి లేదన్నట్టే కనిపిస్తోంది. బడ్జెట్లో ప్రవేశపెట్టిన పథకాలేవీ సకాలంలో కార్యరూపం దాల్చటం లేదన్నది గత అనుభవం. ఇది కూడా అలాగే ఫైళ్ళకే పరిమిత మౌతుందా అనేది మొదటి సంశయం. అయితే సాధారణ బీమా కంపెనీల్లో నేడు కల్పిస్తున్న ఒక వ్యక్తికి ఒక లక్ష ఆరోగ్య బీమాకు రు.1100 నుండి రు.1400 వరకు వసూలు చేస్తున్నారు. అలాంటప్పుడు కేంద్రం ప్రవేశపెట్టిన పథకానికి కనీసంగా సాలుకు 25వేల కోట్లు అవసరమౌతాయి. ఈ మొత్తాన్ని ఏ రూపాల్లో, ఎవరి నుంచి వసూలు చేస్తారో చెప్పకుండా పథకాన్ని ప్రవేశపెట్టడం ఆరంభ శూరత్వమే. అయితే తెలంగాణ ప్రభుత్వం ఆధీనంలో అమలవుతున్న ఆరోగ్యశ్రీ వంటి పథకాలు కొంతవరకు నిరాఘాటంగా కొనసాగుతున్నందుకు సంతోషించాలి. కానీ ఈ పథకం కింద కొన్ని అత్యంత ప్రమాదకరమైన జబ్బులే కవర్ చేయబడుతున్నవి. కేంద్రం ప్రవేశపెట్టే పథకం అతి ప్రమాదకర జబ్బులకే పరిమితమౌతుందా లేక సాధారణ హాస్పిటలైజేషన్కు కూడా వర్తిస్తుందా? కేంద్ర పథకం అమల్లోకి వచ్చిన తరువాత రాష్ట్ర ప్రభుత్వాల పథకాల సంగతేంటి? వీటిపై వివరణ ఇంకా రావాల్సి వుంది.

బీమా సౌకర్యమున్న వ్యక్తి ఆస్పత్రికి వస్తున్నాడంటే ఆస్పత్రికి పండగే. ఎందుకంటే సాధారణ పేషెం ట్లకంటే వీరిపై ఎక్కువ చార్జ్ చేయొచ్చు. ఇలాంటి తికమకల బీమా సౌకర్యాన్ని భారత పేద రికానికి నేర్పించటం, మోసానికి గురి చేయటంక న్నా ప్రభుత్వాస్పత్రులను నెలకొల్పడమే సముచితం.

ఈ బీమా వెనుక ఒక కుట్ర వున్నది.

స్వాతంత్ర్యానికి పూర్వం ఎక్కువ భాగం క్రిష్టియన్ మిషనరీస్ ప్రవేశపెట్టిన ఆసుపత్రులే అందుబాటులో ఉండేవి. 1950 తరువాత ప్రభుత్వాసుపత్రులను నెలకొల్పి, ఊరూరా మిడ్వైఫ్లను నియమించి శిశు మరణాలను గణనీయంగా తగ్గించారు. ఈ దవాఖానాలు ఎన్ని విమర్శలనెదుర్కొన్నా పెన్సిలిన్ ఇంజక్షన్ , సిబ్జాన్ గోలీలు ఇస్తూ పేదలకు ఇవే దిక్కుగా ఉన్నాయి. ఇప్పుడీ ప్రతిపాదిత పథకం నెపంతో వీటిని మూసేస్తారా? లేక ప్రభుత్వాస్పత్రుల్లోనూ బీమా సౌకర్యం ఉంటేనే వైద్యం అందుతుందా? ఈ ప్రశ్నలకు సమాధానాలు ఎలా ఉన్నా ఆరోగ్య బీమా సౌకర్యం కేవలం ప్రయివేటు ఆసుపత్రుల్లోనే లభ్యమవుతుందన్నది నిజం. ఇప్పటికే పలు రాష్ట్ర ప్రభుత్వాలు ఆరోగ్యశ్రీ లేదా మరో పేరున ప్రయివేటు ఆసుపత్రుల బాట పట్టారు. ఆసుపత్రిలో అడ్మిట్ (24 గంటలు కనీసం ఆసుపత్రిలో ఉంటేనే) అయితేనే బీమా ద్వారా వైద్యం అందుతుంది కానీ వైద్యానికి వచ్చే వారిలో కేవలం అతి తక్కువ శాతం, అవసరముంటేనే ఆసుపత్రిలో అడ్మిట్ అవుతారు. మిగతావారు అవుట్ పేషంట్స్‌లా చూపించుకుని మందులు తీసుకుని వెళుతుంటారు. బీమా సౌకర్యం కల్పించామనే నెపంతో కచ్చితంగా ప్రభుత్వ దవాఖానాలను మూసివేయొచ్చు లేదా సంఖ్యను తగ్గించవచ్చు. అలాంటప్పుడు రోజువారీ చిన్న చిన్న జ్వరాలకు ప్రజలు ప్రయివేటు బాట పట్టాల్సిందేనా? బీమా సౌకర్యం కల్పించాలన్న కోరిక ప్రభుత్వానికి ఎందుకు కలిగింది? ప్రభుత్వం దగ్గర ఏ సమాధానముందో కానీ ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన, తక్షణ వైద్యం అందటం లేదన్నది వాస్తవం. ఇలా ఎందుకు జరుగుతున్నది? ప్రభుత్వం నిధులు కేటాయించి మంచి ఆసుపత్రి భవనాలను నిర్మించి తగిన సంఖ్యలో డాక్టర్లనూ, మందులనూ సరఫరా చేయట్లేదు. ఆశ్చర్యకరమైన అంశమేమంటే కేంద్రప్రభుత్వం ఆరోగ్య కల్పనపై పెడుతున్న ఖర్చులో 88శాతం ప్రయివేటురంగం ద్వారా అందివ్వబడుతున్న వైద్యంపై, 12శాతం మాత్రమే ప్రభుత్వ ఆసుపత్రుల, కార్యక్రమాల ద్వారా ఖర్చు పెడుతున్నది. ఈ లోటును సరిదిద్దుకునేందుకు ప్రయత్నించకుండా అవలీలగా చేతులు దులుపుకుని బీజేపీ నాయకుడు, వ్యాసకర్త బల్బీర్ సింగ్ చెప్పినట్టుగా పెట్టుబడిదారులదే ఈ సమాజమన్నట్టు వారికి అనుకూల నిర్ణయాలు చేయటం తప్ప మరో కోణం ఇందులో లేదు.



ఇక బీమా సౌకర్యం ఉన్నవారి సాదక బాదకాలు కూడా ఓసారి పరిశీలిద్దాం. ఆరోగ్య బీమా ఉన్నవారికి వైద్యం అందించాలంటే ఆసుపత్రులు రెండు విధానాలను పాటిస్తున్నాయి. ఒకటి, వైద్యం అందించి, పేషంటు దగ్గర డబ్బులు తీసుకుంటారు ఆ తరువాత సదరు పేషంటు ఇన్సూరెన్సు కంపెనీ నుండి వైద్యానికైన ఖర్చులను క్లయిమ్ చేసుకోవాలి. ఇలాంటప్పుడు ఇన్సూరెన్స్ కంపెనీ వారు చాలా సందర్భాల్లో అయిన ఖర్చులో కొంత కోత పెట్టి క్లయిమ్ చెల్లిస్తారు. మినహాయించిన మొత్తం రోగియే భరించాలి. రెండు, ఇన్సూరెన్స్ కంపెనీకి ఆస్పత్రికీ మధ్య "థర్డ్ పార్టీ" అంటూ మధ్యవర్తి కంపెనీ ఒకటి రంగంలోకి వచ్చి పేషంటు తరపున వైద్య ఖర్చులను ఆస్పత్రికి చెల్లించి సదరు మొత్తాన్ని ఇన్సూరెన్స్ కంపెనీనుండి వసూ లు చేసుకుంటుంది. ఈ క్రమంలో కొన్ని రకాల సేవలు, మందులు, పరికరాలు క్లయిమ్ పరిధి లోకి రావని పేషంట్ నుండి ఆస్పత్రివారు ముందే వసూలు చేస్తున్నారు. ఈ మొత్తం వ్యవ హారాల్లో ఆస్పత్రి వారు, థర్డ్ పార్టీ వారి లోపా యికారీ ఒప్పందాలకు కచ్చితంగా తావుం టుంది. పేషంటుకున్న గరిష్ట మొత్తాన్ని బట్టి కూడా ఆస్పత్రి ట్రీట్మెంటులో వ్యత్యాసాలుంటాయి. బీమా సౌకర్యమున్న వ్యక్తి ఆస్పత్రికి వస్తున్నాడంటే ఆస్పత్రికి పండగే. ఎందుకంటే సాధారణ పేషెంట్లకంటే వీరిపై ఎక్కువ చార్జ్ చేయొచ్చు. ఇలాంటి తికమకల బీమా సౌకర్యాన్ని భారత పేద రికానికి నేర్పించటం, మోసానికి గురి చేయటంక న్నా ప్రభుత్వాస్పత్రులను నెలకొల్పడమే సముచితం.

అమెరికా వంటి పాశ్చాత్య దేశాల్లో సైతం ఇలాంటి ఆరోగ్య బీమా గురించి తర్జనభర్జనలు జరిగాయి. అమెరికాలో ఒబామా కేర్ అంటూ అప్పటి అధ్యక్షుడు ఒబామా ప్రవేశపెట్టిన దాన్ని వ్యయం ద ష్ట్యా ప్రస్తుత ప్రెసిడెంట్ ట్రంప్ తిరస్కరించారు. అభివ ద్ధి చెందిన దేశాల్లో ఏ చిన్న ఉద్యోగం చేసినా యజమానియే ఆరోగ్య బీమా కల్పించే పద్ధతి అమలులో ఉన్నది. ప్రభుత్వరంగం , కొన్ని ప్రయివేటు మినహా మన దేశంలో ఇంకా వ్యాపించాల్సి వుంది . అమెరికా, క్యూబా వంటి పలు దేశాల్లో 0 నుంచి 16 ఏండ్ల వయస్సు వారి వరకూ, సీనియర్ సిటిజన్లకూ ఉచిత వైద్యం అందిస్తారు. అంటే కీలకమైన సమయాల్లో ప్రభుత్వమే ఆదుకోవాలన్నది సారాంశం. ఇటువంటి బాధ్యత నుండి వైదొలగడమే బీమా కల్పించడం.

సెల్ : 9951300016

స్వర్ణపతకాలకు సై అంటూ


సైనా నెహ్వాల్ (17 మార్చి, 1990)

Women of the day

భారతదేశ కీర్తపతాకాన్ని అంతర్జాతీయ క్రీడారంగంలో ఎగురవేసిన వారెందరో ఉన్నారు. వారిలో ఒకరు సైనా నెహ్వాల్. ఒలింపిక్ క్రీడలలో క్వార్టర్ ఫైనల్‌కు చేరడమే కాకుండా ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్ సాధించిన తొలి భారతీయ క్రీడాకారిణిగా రికార్డు స ష్టించారు. అనేక అంతర్జాతీయ టోర్నమెంట్లలో విజేతగా నిల్చి దేశానికి వన్నె తీసుకువచ్చారు. ప్రస్తుతం ఆల్ ఇంగ్లాండ్ ఓపెన్ సూపర్ 1000 టోర్నమెంట్-2018లో ఆమె పాల్గొంటున్నారు.

హర్యానాలోని హిస్సార్‌లో జన్మించిన సైనా తల్లిదండ్రులిద్దరూ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ సాధించినవారే. చిన్నతనం నుంచే క్రీడలపై ఆసక్తి ఉన్న ఆమెను ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్ స్థాపించిన అకాడమిలో చేర్చారు. ఆయన శిక్షణలో నైపుణ్యాన్ని సాధించిన సైనా పలు అంతర్జాతీయ టోర్నమెంట్లలో విజేతగా నిలిచారు.

2006లో ఫిలిప్పీన్స్ ఓపెన్ బ్యాడ్మింటన్‌ను గెలిచి 4-స్టార్ ఓపెన్‌ను గెలిచిన తొలి భారతీయురాలిగా రికార్డు స ష్టించారు. దాంతో ప్రపంచం ద ష్టిని సైనా వైపు తిరిగింది.

ఈ పోటీల్లో విజేతగా నిలిచారు. అదే సంవత్సరం BWF ప్రపంచ చాంపియన్‌లో రన్నరప్‌గా నిలిచారు. 2007లో ఇండియా నేషనల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో విజయం సాధించి, జాతీయ క్రీడలలో బ్యాడ్మింటన్ స్వర్ణాన్ని గెలుచుకున్నారు.

2008లో ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌ను సాధించి ఈ ఘనత సాధించిన తొలి భారతీయురాలిగా రికార్డు స ష్టించారు. . చైనా మాస్టర్ సూపర్ సీరీస్‌లో సెమీస్ వరకు వెళ్ళగలిగారు. ఇండియన్ నేషనల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిలో విజేతగా నిలిచి, అదే సంవత్సరం కామన్వెల్త్ యూత్ గేమ్స్‌లో స్వర్ణపతకం సాధించారు. ప్రపంచ జూనియర్ చాంపియన్ షిప్‌లో కూడా టైటిల్ సాధించారు. 2008లోనే ఒలింపిక్ క్రీడలలో సైనా నెహ్వాల్ క్వార్టర్ ఫైనల్ చేరుకొని ఇందులోనూ ఈ ఘనత సాధించిన తొలి భారతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారిణిగా రికార్డు సృష్టించారు. ఆ తర్వాత వరుసగా ప్రతి ఏడాది పతకాలు అందుకుంటూ 2015 లో ప్రపంచ నెంబర్ వన్ ర్యాంకు పొందారు. ఈ ఘనత సాధించిన తొలి భారతీయురాలిగామరో రికార్డు సాధించారు. 2015 ఆగస్టులో ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ లో రజతపతకం సాధించి.. ఫైనల్స్ వరకు వెళ్ళిన తొలి భారతీయురాలిగా పేరుతెచ్చుకున్నారు.

సైనా నెహ్వాల్ సాధించిన విజయాలకు గుర్తింపులుగా పలు అవార్డులు లభించాయి. 2009లో అర్జున అవార్డు, 2009-10లో రాజీవ్ గాంధీ ఖేల్ రత్న అవార్డు, 2010లో పద్మశ్రీ పురస్కారం లభించాయి. ✸



తాగితే మనిషే కాదు

శోభ పాపను ఒళ్ళో పడుకోబెట్టుకొని దిగులుగా కూర్చుంది. ఇంకా ఇలా ఎన్ని రోజులు పుట్టింట్లో ఉండాలో అర్థం కావడంలేదు. తన స్నేహితులందరూ తనలాగే పెండ్లి చేసుకొని భర్త, పిల్లలతో సంతోషంగా ఉన్నారు. 'నాకు మాత్రమే ఎందుకిలా జరుగుతున్నది' అనుకుంటూ లోలోపలె కుళ్ళి కుళ్ళి ఏడుస్తున్నది. చుట్టుపక్కల వారు 'మీ ఆయన ఎప్పుడు వస్తాడు' అని అడగినప్పుడల్లా ఏం చెప్పాలో తెలియక దీనంగా ఓ నవ్వు నవ్వి ఊరుకుంటుంది.

ఇలా రోజులు గడుపుతున్న శోభకు ఐద్వా లీగల్‌సెల్ నుంచి ఉత్తరం వచ్చింది. ఆమెకు ఉత్తరం రావడం ఇదే మొదటిసారి. దాన్ని చూసి ఆశ్చర్యపోయింది. సంతకం పెట్టి ఉత్తరం అందుకుని అటూ ఇటూ తిప్పి చూసింది. దానిపైన 'ఐలమ్మ కుటుంబ న్యాయ సలహా కేంద్రం' నుంచి వచ్చినట్టు రాసింది. వెంటనే కవర్ చింపి చదివింది. 'మీ కుటుంబం సమస్యల గురించి మీ భర్త మమ్మల్ని సంప్రదించారు. మీరు వచ్చి పరిష్కరించుకోండి' అని ఏ రోజున రావాలో అందులో రాసి ఉంది. అందులో ఉన్న తేదీకి మరో మూడు రోజులు వుంది. 'అంటే వచ్చే శనివారం అక్కడకు వెళ్ళాలన్నమాట' అనుకుంది మనసులో. శోభకు ఆ లెటర్ చూడగానే ముందు భయం వేసింది. లెటర్‌లో ఉన్న నెంబర్‌కు వెంటనే ఫోన్ చేసింది.



ఐద్వా అదాలత్
సెల్ : 9490098024

అటు నుండి 'హలో'! అంటూ ఓ మహిళ గొంతు... "మేడమ్ నాపేరు శోభ. నాకు లెటర్ వచ్చింది. ఇందులో నెంబర్ చూసి ఫోన్ చేస్తున్నా. నన్ను శనివారం రమ్మన్నారు. మీ దగ్గరకు మా ఆయన వచ్చాడా? నా గురించి ఏం చెప్పాడు? ఆయన నన్ను తాగి విపరీతంగా కొడతాడు. పుట్టింటికి వచ్చేస్తే ఆయన మారతాడని ఇలా చేశా. మాకు ఒక పాప కూడా ఉంది. నాకు ఆయనతో కలసి బతకాలనే ఉంది. కానీ ఆయన మారాలి. అప్పుడే నేను ఆయనతో కలిసి ఉండగలను" అంటూ కంగారుగా మాట్లాడేస్తున్నది.

"చూడమ్మా... మేము మిమ్మల్ని కలపడానికే ఇక్కడికి రమ్మన్నాం. నువ్వు శనివారం రోజు ఇక్కడికి రా. కూర్చొని మాట్లాడకుందా" అని చెప్పి ఫోన్ పెట్టేయబోయింది. వెంటనే "మేడమ్, మా ఆయన నా గురించి మీకు ఏం చెప్పాడో, ఆయన మాటలు నమ్మకండి. అన్నీ అబద్దాలే చెబుతాడు..." అంటూ ఇంకా ఏదో మాట్లాడబోయింది.

"మేము ఆయన మాటలు వినేవాళ్ళమే అయితే నిన్ను రమ్మనమని లెటర్ పంపేవాళ్ళమే కాదు. నువ్వు చెప్పింది కూడా విన్న తర్వాతే మేం ఓ నిర్ణయానికి వస్తాం. కాబట్టి నువ్వేం భయపడకూ" అంటూ అంటూ ధైర్యం చెప్పింది ఆ గొంతు.

ఆ మాటలకు కాస్త స్థిమిత పడ్డ శోభ శనివారం రోజు లీగల్‌సెల్‌కు వెళ్ళింది. "మేడమ్ ఆయనకు తాగుడు అలవాటుంది. ఇంట్లో ఒక్కపైసా ఇవ్వడు. రోజూ తాగి వస్తాడు. విపరీతంగా కొడతాడు. తిడతాడు. అనుమానిస్తాడు. కొడుకు పట్టించుకోడని తెలిసి మా మామనే అప్పుడప్పుడు ఇంట్లోకి సరుకులు ఇచ్చి ఇస్తాడు. చివరకు తన తండ్రితో కూడా నాకు సంబంధం అంటగట్టాడు. ఎవ్వరితో మాట్లాడనీయడు. ఏదైనా పని చేసుకుందామంటే బయటకు పోనీయడు. కారణం లేకుండా ప్రతి విషయానికి కొడుతూనే ఉంటాడు. కొట్టడమే కాదు. ఈ మధ్య నేను ఇంట్లో లేనప్పుడు వేరే అమ్మాయిలను తెచ్చుకుంటున్నాడు. ఈ విషయాలన్నీ మా మామకు ఫోన్ చేసి చెబుతుంటా. మామ కూడా ఆయన్నే తిడుతుంటారు. అందుకే నా దగ్గర ఫోన్ కూడా లేకుండా చేశాడు. పాప పుట్టిన తర్వాత మూడు సార్లు అబార్షన్ అయింది. దాంతో నా ఆరోగ్యం పూర్తిగా పాడయ్యింది. ఇక పిల్లలు వద్దని డాక్టర్ చెప్పారు. అయినా కూడా అబ్బాయి కావాలని ఇబ్బంది పెడతాడు. ఓసారి పోలీస్‌స్టేషన్‌లో కేసు కూడా పెట్టా. ఇప్పటికీ ఆకేసు నడుస్తూనే ఉంది. అయినా ఆయనలో మార్పు రాలేదు. ఇంకా ఎన్ని రోజులని ఈ కష్టాలు భరించాలి. ఇక నా వల్ల కాలేదు. అందుకే పుట్టింటికి వెళ్ళాను. ఆయనలో మార్పు వచ్చేవరకు మా పుట్టింట్లోనే ఉంటాను' అని చెప్పింది.

> "చూడమ్మా... మేము మిమ్మల్ని కలపటానికే ఇక్కడికి రమ్మన్నాం. నువ్వు శనివారం రోజు ఇక్కడికిరా. కూర్చొని మాట్లాడకుందాం" అని చెప్పి ఫోన్ పెట్టేయబోయింది. వెంటనే "మేడమ్, మా ఆయన నా గురించి మీకు ఏం చెప్పాడో, ఆయన మాటలు నమ్మకండి. అన్నీ అబద్దాలే చెబుతాడు..." అంటూ ఇంకా ఏదో మాట్లాడబోయింది.

శోభ చెప్పిన విషయాలన్నీ విన్న తర్వాత బాధ్యులు ఆమె భర్త కార్తీక్‌ను కూర్చోబెట్టి "నీ భార్య రావడం లేదని మా దగ్గరకు వచ్చి కన్నీళ్ళు పెట్టుకుంటే ఆమెపై నీకు ఎంత ప్రేమో అనుకున్నాం. కానీ నువ్వు తాగి ప్రతి విషయానికి నీ భార్యను కొడుతున్నావు. ఇది మంచి పద్దతి కాదు. పైగా మాతో అన్ని అబద్దాలు చెప్పావు. నీ ప్రవర్తన సరిగా లేకపోతే తను మాత్రం ఏం చేస్తుంది. నీ బాధ భరించలేకే పుట్టింటికి వెళ్ళింది. నువ్వు మారతానంటేనే తను నీతో వస్తానంటుంది" అన్నారు.

> "ముందు నీలో మార్పు వచ్చిన తర్వాతే కేసు వెనక్కు తీసుకునేది. ఈ విషయాలన్నీ నువ్వు రిజిస్టర్‌లో రాసి సంతకం చేయాలి. అలా చేస్తేనే శోభ నీతో వస్తుంది. మేము ఆమెతో కూడా మాట్లాడతాం" అన్నారు. ఇక చేసేది లేక ఒప్పుకున్నాడు.

దానికి అతను "నేను అప్పుడప్పుడు తాగుతాను. కానీ కొట్టను. రమ్మని చెప్పండి" అన్నాడు. "అయితే మీరిద్దరే మాట్లాడుకొని ఓ నిర్ణయానికి రండి" అని ఇద్దరినీ బయటకు పంపారు. పదిహేను నిమిషాల తర్వాత శోభ లోపలికి వచ్చి "ఆయన తాగుడు మానడంటా. అప్పుడప్పుడు తాగుతాడంటా. ఆయన తాగితే మనిషి కాదు. ఇలా అయితే అతనితో నేను ఉండలేను" అని కచ్చితంగా చెప్పేసింది.

తర్వాత కార్తిక్‌ను పిలిచి తర్వాతి వారం అతని అన్నయ్యను, తండ్రిని పిలుచుకు రమ్మని చెప్పారు. చెప్పిన ప్రకారమే తండ్రిని, అన్నయ్యను వెంటబెట్టుకొని వచ్చాడు. తండ్రి మాట్లాడుతూ 'ఆడపిల్లకు అన్యాయం చేయడం మాకు ఇష్టం లేదు. నా కొడుకు బాగా తాగుతాడు. కొడతాడు. నా కోడలు చెప్పినవి నిజాలే. వాడు తాగుడు మానకపోతే ఆ అమ్మాయి వాడితో బతకడం కష్టమే' అన్నాడు. ఇదంతా వింటున్న కార్తిక్ "మగవాళ్ళన్న తర్వాత తాగకుండా ఎలా ఉంటారు?" అని ప్రశ్నించాడు.

> కార్తిక్‌ను పిలిచి తర్వాతి వారం అతని అన్నయ్యను, తండ్రిని పిలుచుకు రమ్మని చెప్పారు. చెప్పిన ప్రకారమే తండ్రిని, అన్నయ్యను వెంటబెట్టుకొని వచ్చాడు. తండ్రి మాట్లాడుతూ 'ఆడపిల్లకు అన్యాయం చేయడం మాకు ఇష్టం లేదు. నా కొడుకు బాగా తాగుతాడు. కొడతాడు. నా కోడలు చెప్పినవి నిజాలే. వాడు తాగుడు మానకపోతే ఆ అమ్మాయి వాడితో బతకడం కష్టమే' అన్నాడు.

"ఇలాంటి ఆలోచనల వల్లే నీ సంసారంలో ఇన్ని గొడవలు. తాగుడు వల్ల నీ ఆరోగ్యం కూడా పాడైపోతుంది. మగాడంటే తాగాలి, భార్యను కొట్టాలి అలా చేసిన వాడే మగాడు అని అనుకుంటున్నావు. కానీ, ఇవన్నీ చేతగాని వారు చేసేపనులు. నీకు ఓ కూతురు ఉంది. తను పెరిగి పెద్దదై తన భర్త కూడా ఇలాగే ఆలోచిస్తే ఏం చేస్తావు. ముందు ఓ మనిషిగా ఆలోచించు. నీ భార్యను గౌరవించి, ఓ మనిషిగా చూడు. ఆమెకూ ఓ మనసు ఉంటుంది. భర్త, పాపతో సంతోషంగా ఉండాలని కోరుకుంటుంది. నువ్వు మంచిగా చూసుకుంటే తను ఊరికే పుట్టింటికి ఎందుకు వెళుతుంది. ఇప్పటికే ఆమెకు మూడు సార్లు అబార్షన్ జరిగింది. అయినా కూడా నువ్వు అబ్బాయి కావాలంటున్నావు. ఇది నీ భార్యకు, పుట్టబోయే బిడ్డకు కూడా మంచిది కాదు. ఇక నుంచి తనను పిల్లల కోసం ఇబ్బంది పెట్టకూడదు. ఈ విషయాలన్నీ ఆలోచించుకొని వచ్చేవారం ఇద్దరూ రండి. అప్పుడు ఏం చేయాలో నిర్ణయించుకుందాం" అని చెప్పి పంపించారు.

మళ్ళీ వారం ఇద్దరూ వచ్చి... "నేను తాగుడు మానేస్తాను. శోభను రమ్మని చెప్పండి. అలాగే నాపై పెట్టిన కేసును వెనక్కు తీసుకోమనండి" అన్నాడు కార్తిక్. దానికి లీగల్ సెల్ సభ్యులు "ముందు నీలో మార్పు వచ్చిన తర్వాతే కేసు వెనక్కు తీసుకునేది. ఈ విషయాలన్నీ నువ్వు రిజిస్టర్‌లో రాసి సంతకం చేయాలి. అలా చేస్తేనే శోభ నీతో వస్తుంది. మేము ఆమెతో కూడా మాట్లాడతాం" అన్నారు. ఇక చేసేది లేక ఒప్పుకున్నాడు.

చివరిగా ఇద్దరితో మాట్లాడుతూ "ఇకపై మీ ఇద్దరి మధ్య ఏ సమస్య వచ్చినా ఇక్కడికే రండి. కూర్చొని మాట్లాడుకుందాం. నిదానంగా పరిష్కరించుకోవచ్చు" అని ఇద్దరికీ సర్దిచెప్పారు.

బాధ్యులు చెప్పిన వాటన్నింటిని అంగీకరిస్తూ ఇద్దరూ రిజిస్టర్‌లో సంతకం చేసి వెళ్ళిపోయారు. తర్వాత రెండు వారాలపాటు ఇద్దరూ కలిసి లీగల్‌సెల్‌కు వచ్చారు. మూడోవారం శోభ ఫోన్ చేసి ఇప్పటి వరకు భర్త వల్ల తనకు ఎలాంటి సమస్య రాలేదని, ఒక వేళ ఏమైనా ఇబ్బంది వస్తే లీగల్‌సెల్‌కు వస్తానని సంతోషంగా చెప్పి ఫోన్ పెట్టేసింది.

సలీమ

ఆహార నియమాలు...



గర్భం ధరించిన తర్వాత మహిళలు ఫిట్‌నెస్‌ను కాపాడుకునేందుకు ఆహార అలవాట్లలో కొంత మార్పు తప్పని సరి! ప్రెగ్నెన్సీ సమయంలో డైట్‌తో పాటు యాక్టివ్‌నెస్ కూడా ఉండాలి. దీంతో పెరిగిన బరువును ప్రసవం తర్వాత తగ్గించుకోవడం సులభం అవుతుంది.

- ఆహారంలో కార్బోహైడ్రేట్స్, ప్రోటీన్లు, ఫ్యాట్స్, విటమిన్, మినరల్స్ నిండుగా ఉండేలా చూసుకోవాలి. ప్లేటులో సగం భాగం పండ్లు, సగం కూరగాయలు పెట్టుకొని తినండి. ఎక్కువ వేయించిన పదార్థాలకు, చక్కెర, ఉప్పు వంటి పదార్థాలకు దూరంగా ఉండాలి.
- ఫ్యాట్స్ అన్నీ చెడ్డవి కావు. కొన్ని మంచివి కూడా ఉంటాయి. ఉదాహరణకు 'శమోనో, పాలీ శాచ్యురేటెడ్ ఫ్యాట్స్'. ఎక్కువ శాతం ద్రవరూప ఫ్యాట్స్‌లో ఆయిల్ ఉంటుంది. ఇది చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది. గది ఉష్ణోగ్రతలో పేరుకుపోయే శాచ్యురేటెడ్ ఫ్యాట్స్‌ను తొలగించుకోవాలి.
- భోజనాన్ని చిన్న చిన్న మీల్స్ రూపంలో తీసుకోవాలి. అంటే రెండు, మూడు గంటలకోసారి తీసుకోవాలి. ఉప్పు తగిన మోతాదులో తీసుకోవాలి. ఎక్కువగా తీసుకుంటే అధిక రక్తపోటు వచ్చే అవకాశం ఉంటుంది.
- మంచి నీళ్ళు బాగా తాగాలి. రోజుకు 10-12 గ్లాసులు తీసుకోవాలి. ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. ద్రవ పదార్థాల వల్ల డెలివరీ సమయంలో ఎలాంటి ఇబ్బంది ఉండదు.
- శరీరంతో పాటు మానసిక ఆరోగ్యంపై కూడా శ్రద్ధ పెట్టాలి. దీని కోసం ఇరుగుపొరుగువారితో, కుటుంబసభ్యులతో కలిసిమెలిసి ఉండాలి.
- చక్కటి వ్యాయామం తప్పని సరి! ప్రెగ్నెన్సీ సమయం నుంచి డెలివరీ తర్వాత కూడా వ్యాయామం చేయాలి. కాకపోతే డాక్టర్ సలహా మేరకు వ్యాయామం చేస్తే మంచిది. ✸


ఇట్లచేద్దాం

పప్పు, పాలు.. ఏదైనా ఉడికించేటప్పుడు పొంగకుండా ఉండాలంటే... చెక్క గరిటను వండే పాత్రపై అడ్డంగా పెట్టాలి.

పచ్చిపాలతో...

క్లెన్సింగ్: చర్మం సున్నితంగా ఉంటే ఏ రకమైన క్లెన్సింగ్ ప్రొడక్ట్ అయినా సరే చర్మానికి చిరాకు పెట్టిస్తుంది. కానీ పాలతో తయారుచేసిన క్లెన్సర్స్ ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా చక్కటి అందాన్ని అందిస్తుంది. పచ్చి పాలు చర్మాన్ని మెరిపించడంలో ఎంతగానో సహాయపడతాయి. పాలను చర్మ సంరక్షణ కోసం ఉపయోగించడం మంచిది. సగం కప్పు పాలతో ముఖాన్ని శుభ్రం చేసుకుంటే చర్మం తాజాగా, కాంతివంతంగా తయారవుతుంది.

ఎక్స్‌ఫ్లోయేటింగ్: పాలలో ఉండే ల్యాక్టిక్ యాసిడ్ వల్ల ముఖం పై కనిపించే ముడుతలు మాయం అవుతాయి. పాలను ఎక్స్‌ఫ్లోయేట్ ఏజెంట్ గా ఉపయోగించుకోవచ్చు. ఒక బౌల్‌లో పచ్చిపాలను తీసుకొని కాటన్ బాల్ ను ముంచి ముఖం మీద అప్లై చేస్తూ మసాజ్ చేయాలి. ఇలా పది నిమిషాలు ఉంచిన తర్వాత చల్లటి నీటితో కడుక్కోవాలి.



మసాజ్: ముఖం , శరీరాన్ని పచ్చిపాలను ఉపయోగించి మసాజ్ చేసుకోవాలి. ఒక కప్పు పాలను బకెట్ నీటిలో మిక్స్ చేసి ఆ నీటితో స్నానం చేయాలి. దాంతో చర్మం మృదువుగా, కాంతివంతంగా మారుతుంది.

మొటిమలు: ముఖంలో ఉండే మొటిమలు, మచ్చలను తొలగించడంలో పాలు బాగా పని చేస్తాయి. రాత్రి పడుకునే ముందు ముఖానికి పచ్చిపాలను అప్లై చేసుకోవాలి. మర్నాడు పొద్దున శుభ్రంగా ముఖం కడుక్కుంటే ముడతలు, మొటిమలు దూరం అవుతాయి.

మాస్క్: ఒక చెంచా పెరుగులో రెండు చెంచాల పచ్చిపాలను కలిపి ముఖానికి అప్లై చేయాలి. పది నిముషాల తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. ✸

ఎప్పటి వరకు వాడొచ్చు?

కొన్ని ఏండ్ల తరబడి వాడుతున్న వస్తువుల్లో ఏదో ఒకటి ప్రతీ ఇంట్లో ఉండటం సహజం. రెగ్యులర్ గా వాడేవే అయినా, వాటిని ఎలా వాడాలని, ఎన్ని రోజులు వాడొచ్చు అని తెలుసుకోకుండా, ఏమీ ఆలోచించకుండా వాడేస్తూనే ఉంటాం. స్టీల్ గిన్నెలు, ఇత్తడి సామాన్లు కాకుండా సాధారణంగా అన్ని ఇళ్ళల్లో లభించే కొన్ని వస్తువులకి ఎక్స్ పైరీ డేట్ అనేది ఉంటుంది. ఈ విషయాన్ని పట్టించుకోకుండా ప్రతి ఒక్కరూ ఆ వస్తువులని తెగ వాడేస్తుంటారు. ఇప్పుడు మీరు ఊహించని కొన్ని వస్తువులకు ఎక్స్ పైరీ డేట్ ఎప్పటి వరకు ఉంటుందో తెలుకుందాం

పిల్లో: సరైన తలగడ లేకపోతే మంచి నిద్రను కోల్పోతారు. కొన్నిసార్లు మెడ నొప్పులు కూడా వస్తాయి, కాబట్టి తలగడని ప్రతి రెండు సంవత్సరాలకు ఓసారి మార్చాలి.

పాదరక్షలు: ఇంట్లో లేదా ఇంటి వద్ద ధరించే చెప్పులకు అధిక శాతంలో బ్యాక్టీరియా ఉంటుంది. కాబట్టి, వీటిని రెగ్యులర్‌గా వాష్ చేసినా సరే ప్రతి ఆరు నెలలకి వీటిని మార్చాలి.

టవల్స్: తడిగా ఉన్న టవల్స్ మీద బ్యాక్టీరియా త్వరగా చేరుతుంది. కాబట్టి టవల్స్ ను వీలైనంత త్వరగా ఆరబెట్టాలి. అలాగే ఒక టవల్‌ని సంవత్సరం కన్నా ఎక్కువ వాడకూడదు.

టూత్ బ్రెష్‌లు: మనం రోజూ వాడే టూత్ బ్రెష్‌లు కనీసం మూడు నెలకొకసారి మార్చాలని హెచ్చరిస్తున్నారు వైద్య నిపుణులు .

లోదుస్తులు: లోదుస్తులు సంవత్సరానికొకసారైనా మార్చాల్సిందే..

జాగింగ్ షూస్: రెగ్యులర్ గా వాడే జాగింగ్ షూస్‌ని ఒక సంవత్సరం కన్నా ఎక్కువ వాడకూడదు. వాటిలో ఉన్న కుషనింగ్ తగ్గిపోతుంది. కాబట్టి జాయింట్ పెయిన్స్ వస్తాయి.

హ్యాండ్ సానిటైజర్: బాటిల్ ను ఒకసారి తెరిచిన తర్వాత మూడు నెలలకన్నా ఎక్కువ పనిచేయదు. దాని పవర్ తగ్గిపోతుంది.

ఫెర్ఫ్యూమ్ బాటిల్స్: ఫెర్ఫ్యూమ్ బాటిల్స్ ఓపెన్ చేసిన తర్వాత కేవలం ఒకటి లేదా రెండు సంవత్సరాలు మాత్రమే పనిచేస్తాయి.

దువ్వెనలు: దువ్వెనను వారానికొకసారి కనీసం 15రోజులకొకసారి శుభ్రం చేసుకోవాలి. అలాగే దువ్వెనని ఒక సంవత్సరం కన్నా ఎక్కువ రోజులు వాడకూడదు.

బాడీ స్పాంజ్ లేదా షవర్ పఫ్: బాడీ స్పాంజ్ లేదా షవర్ పఫ్ రోజూ వేడి నీటిలో వేసి శుభ్రం చేసుకోవాలి. అలాగే వీటిని ఆరునెలలకన్నా ఎక్కువ రోజులు వాడకూడదు. ✸





పారితోషికం కాదు.. వేతనం చెల్లించాలి

- కేంద్రానికి సంబంధం లేకుండా రాష్ట్రమే రూ.6 వేలు చెల్లించాలి: ఆశాల ధర్నాలో జయలక్ష్మి డిమాండ్


హైదరాబాద్‌లో

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించినట్టు ఆశాలకు వేతనం చెల్లించాలని తెలంగాణ వాలంటరీ అండ్ కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.జయలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్రంతో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే నెలకు రూ.6 వేల వేతనం చెల్లించాలన్నారు. పారితోషికం చెల్లిస్తూ ప్రభుత్వం మోసం చేస్తున్నదని మండిపడ్డారు. వేతనం ఇస్తామని, అంగన్‌వాడీల స్థాయికి తెస్తామని, ఏఎన్ఎంలుగా ప్రమోషన్‌తో పాటు ఇంకా అనేక హామీలను కేసీఆర్ ఇచ్చారని..నెలలు గడుస్తున్నా నేటికీ అమలు కావడంలేదని అన్నారు. హామీలకు భిన్నంగా కేవలం పారితోషికాలనే పెంచుతూ ప్రభుత్వం జీఓ జారీ చేసిందన్నారు. జీఓను సవరించాలని అనేక సార్లు ప్రభుత్వానికి విన్నవించినా.. పారితోషికాల పద్ధతిలోనే ఆశాలకు డబ్బులు చెల్లిస్తామని ఇంకో కొత్త సర్క్యులర్‌ను ప్రభుత్వం తీసుకువచ్చిందని మండిపడ్డారు. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. ఆశాల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కోఠిలోని డీఎంహెచ్ఎస్ క్యాంపస్‌లో యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ ఎత్తున ధర్నా నిర్వహించింది. రాష్ట్రం నలుమూలల నుండి పెద్దఎత్తున ఆశాలు తరలిరావడంతో భారీగా పోలీసులు మోహరించారు. ధర్నానుద్దేశించి జయలక్ష్మి మాట్లాడుతూ ఆశాలకు నష్టం కలిగిస్తున్న జీఓ నెం.167ను ప్రభుత్వం సవరించాలని సూచించారు. శ్రామిక మహిళ రాష్ట్ర కన్వీనర్ ఎస్ రమ మాట్లాడుతూ ఏఎన్ఎంల నియామకాల్లో ఆశాలకు ప్రాధాన్యం కల్పించి, సంబంధిత ఉత్తర్వులను వెంటనే జారీ చేయాలని డిమాండ్ చేశారు. పారితోషికంలేని ఏ ఇతర పనులు ఆశాలతో చేయించుకోరాదని సూచించారు. అధికారులు, రాజకీయ నాయకుల వేదింపులు అరికట్టాలన్నారు. ఆశాలు చేసే కేసులన్నింటికీ పారితోషికాలు చెల్లించి, కేసులు తగ్గించి పారితోషికాలు చెల్లిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. సీఐటీయూ ప్రయివేటు రోడ్డు ట్రాన్స్‌పోర్టు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మాట్లాడుతూ ఆశాలకు కనీస వేతనం రూ.18 వేలు చెలించాలన్నారు. పెండింగ్, గౌరవ వేతనం చెల్లించాలన్నారు. ఉద్యోగ భద్రత, పింఛన్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా 12 మందితో కూడిన యూనియన్ ప్రతినిధి బృందం ఆశాల రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ జనార్దన్, మెటర్నల్ హెల్త్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ ప్రవీణతో చర్చలు జరిపారు. సమస్యల పరిష్కారానికి అధికారులు సానుకూలంగా స్పందించారు. విషయాన్ని కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వాకాటి కరుణ దృష్టికి దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీనిచ్చారు. చర్చల్లో సీఐటీయూ నాయకులు కవిత, స్వాతి, యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంవీ అప్పారాలు, సావిత్రి, శోభ, వాణి, పూర్ణ, సునీత, విజయలక్ష్మి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన రైతుల భూములు తీసుకోవద్దు

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి
- జేసీతో కలిసి పంట పొలాల పరిశీలన



నవతెలంగాణ-అడవిదేవులపల్లి

నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండలంలో పట్టాలున్న గిరిజన రైతుల భూములను తీసుకోవద్దని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఉల్సాయిపాలెం, పలుగుతండా, తాటిచెట్టుతండా గ్రామ పంచాయతీ పరిధిలోనున్న సర్వే నెం.145లో 364 ఎకరాలకు గిరిజనులకు పట్టాలిచ్చారని చెప్పారు. శుక్రవారం ఆయా గ్రామాల్లో ఆయన జేసీ నారాయణరెడ్డితో కలిసి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ.. 50 ఏండ్లుగా సాగు చేసుకుంటున్న గిరిజన రైతులకు గత ప్రభుత్వం పట్టాలిచ్చిందని తెలిపారు. 1976 నుంచి సాగు చేసుకుంటున్న భూమిని ప్రస్తుతం ఫారెస్టు అధికారులు వచ్చి ఫారెస్టు భూమిగా పరిగణించి లాక్కున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదే సర్వేలో ఫారెస్టు భూములను కబ్జా చేసుకుంటున్న వారిపై ఎలాంటి చర్యలూ తీసుకోకుండా పట్టాలున్న రైతుల నుంచి గుంజుకోవడం తగదన్నారు. రైతులకు భూమిని తిరిగిచ్చి, సర్వే చేయించి రైతు పెట్టుబడి కింద ఎకరాకు రూ.నాలుగు వేల చొప్పున వర్తింపజేయాలని జేసీకి వినతిపత్రం అందజేశారు. అనంతరం మండలంలోని బాల్నేపల్లి గ్రామంలో మూడ్రోజుల కిందట మృతిచెందిన కల్లు గీత కార్మికుడు మిట్టపల్లి శ్రీనివాస్(35) కుటుంబాన్ని జూలకంటి పరామర్శించారు. ప్రభుత్వం మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. అనంతరం బాల్నేపల్లి ఎస్సీ కాలనీలో పర్యటించారు. టెయిల్‌పాండ్ ముంపు గ్రామమైన చిట్యాల, నడిగడ్డ గ్రామాల్లో పూర్తిస్థాయి సర్వే చేసి నిజమైన అర్హులకు పరిహారం, పునరావాసం కల్పించాలని ప్రభుత్వాన్ని జూలకంటి కోరారు. ఆయన వెంట రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, గిరిజన సంఘం నాయకులు పాపానాయక్, శంకర్, ప్రకాశ్‌నాయక్, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి సైదులు తదితరులు ఉన్నారు.



వ్యవసాయ బడ్జెట్‌ను సవరించాలి

- ఈ రంగానికి ప్రత్యేకంగా రూ 13500 కోట్లు కేటాయించాల్సిందే...
- నేడు ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు :రైతు సంఘం రౌండ్‌టేబుల్‌లో వక్తలు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయానికి కేటాయించిన రూ 12734 కోట్లను సవరించి, ఈ రంగానికి ప్రత్యేకంగా రూ 13500 కోట్లు కేటాయించాలని రౌండ్‌టేబుల్‌లో వక్తలు డిమాండ్ చేశారు. ఇదే అంశంపై నేడు ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు సమర్పించాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత బడ్జెట్‌ను సవరించాలని జిల్లాస్థాయిలో ఆందోళనలు చేయాలని కోరారు. శుక్రవారం ఎస్వీకేలో 'వ్యవసాయ రంగం-బడ్జెట్' అనే అంశంపై తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి జంగారెడ్డి అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏఐకేఎస్ జాతీయ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి ప్రభుత్వం బడ్జెట్ తక్కువగా కేటాయించిందన్నారు. పంటల సంరక్షణ, దళితులకు మూడెకరాల భూమి, విత్తన సబ్సిడీ, వడ్డీలేని రుణం వంటి అంశాలకు బడ్జెట్ కేటాయించలేదన్నారు. ప్రకృతి వైపరీత్యాలకు నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు నిధులు కేటాయించలేదన్నారు. విత్తనకంపెనీల ఒత్తిడిమేరకు బడ్జెట్‌లో సబ్సిడీ ఇచ్చి పత్తి విత్తనాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. కేంద్రం ఎరువుల సబ్సిడీ ఎత్తివేసిందని, లెవీ సేకరణను రద్దు చేసి రైతులకు అన్యాయం చేస్తోందన్నారు. పండించిన అన్ని పంటలకు మద్దతు ధర నిర్ణయించాలన్నారు. రైతు పెట్టుబడి, యంత్రాలకు మినహా బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి మిగిలేదేముందని ప్రశ్నించారు. పంటలకు సరైన ధరను కల్పిస్తే రైతు నాలుగువేల గురించి ఆలోచించే అవకాశం ఉండదన్నారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కౌలు రైతులు సేద్యం చేసే పరిస్థితి లేదన్నారు. పంట పెట్టుబడి కౌలురైతులకు వర్తించకపోవడం బాధాకరమన్నారు. రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి టి సాగర్ మాట్లాడుతూ ఎకరాకు నాలుగువేల పెట్టుబడి పథకం కౌలురైతులు, పోడుభూములు, కాంధీశీకుల భూములు సాగు చేస్తున్న రైతులు, అసైన్డ్‌భూములు సాగు రైతులకు ఈ పథకం వర్తిస్తుందా? లేదా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలన్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు ఇచ్చే పరిహారంపై బడ్జెట్‌లో ప్రస్తావించలేదన్నారు. మార్కెట్ ధరల స్థిరీకరణకు నిధి కేటాయించలేదన్నారు. బడ్జెట్ సవరణ చేయకపోతే మహారాష్ట్ర తరహాలో ఉద్యమం చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అఖిలభారత రైతు,కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంగన్న మాట్లాడుతూ బడ్జెట్‌పై మీడియాలో వస్తున్న దానికి, బడ్జెట్ అంకెలకు చాలా వైరుధ్యం ఉందన్నారు. బడ్జెట్ కేటాయింపులు చూపించి ఆ నిధులు ఖర్చు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ప్రాజెక్టుల రీడిజైన్ పేరుతో పెండింగ్ ప్రాజెక్టులను వదిలేసిందన్నారు. రైతుల ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్ లేదని, వెంటనే వ్యవసాయానికి సరిపడ బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. రైతుసంఘం ఉపాధ్యక్షులు అరిబండి ప్రసాదరావు మాట్లాడుతూ ఎలాంటి చట్టం లేకుండానే రైతు సమన్వయ సమితులకు నిధులు కేటాయించడమేమిటని ప్రశ్నించారు. టీఆర్ఎస్ ప్రభుత్వానికి రైతు విధానమే లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం ఉపాధ్యక్షులు బొంతల చంద్రారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి ప్రసాద్, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు, రైతు సంఘం నేత సంజీవరెడ్డి తదితరులు మాట్లాడారు.



తునికాకు కేన్యణలై ఆంక్షలు ఎత్తివేయాలి

- ప్రభుత్వమే ధర నిర్ణయించాలి : రౌండ్‌టేబుల్‌లో వక్తలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తునికాకు సేకరణపై ఆంక్షలు ఎత్తివేయాలని పలువురు వక్తలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు మాట్లాడుతూ తునికాకు సేకరణకు ప్రభుత్వం సుముఖంగా లేకపోవడానికి నిరసనగా 22న అన్ని జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలు ఇస్తామని, ఈ నెలాఖరు వరకు ఫారెస్టు ఆఫీసు మండల కార్యాలయాల ముందు ధర్నాలు నిర్వహిస్తామన్నారు. ఈ విషయంపై ఇప్పటికే సీఎంకు బహిరంగ లేఖ రాశామని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో ఆకుసేకరించే బాధ్యత ప్రభుత్వానిదే అని అన్నారు. సుమారు 15 లక్షల మంది కూలీలు తునికాకుపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. 460కిపైగా కేంద్రాలు, 3వేలకుపైగా కల్లాలున్నాయని చెప్పారు. ప్రభుత్వం వెంటనే టెండర్లను ఆహ్వానించాలని డిమాండ్ చేశారు. రాయల్టీ ధరలు భారంగా ఉండడం వల్ల టెండర్లు నత్తనకన సాగుతున్నాయని చెప్పారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి టి. సాగర్ మాట్లాడుతూ తునికాకు సేకరణ మీద 10 లక్షల మందికిపైగా ప్రత్యక్షంగాను, 5 లక్షల మంది పరోక్షంగానూ ఉపాధి పొందుతున్నారని చెప్పారు. ఉమ్మడి జిల్లాలైన ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో కార్మికులకు చేతి నిండా పని లభిస్తుందన్నారు. కానీ ప్రస్తుత పరిస్థితులను పరిగణలోకి తీసుకోకుండా టెండర్లను అధిక రేట్లకు అహ్వానించిందన్నారు. తునికాకు సేకరణ చేపట్టాలని డిమాండ్ చేసే కార్యక్రమంలో ప్రత్యక్షంగా పాల్గొంటామని చెప్పారు. ఈ సమావేశంలో తెలంగాణ మహిళా కూలీల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ పద్మ, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు ఆర్. ఆంజనేయులు ప్రసంగించారు.

అబద్ధాలకు, మోసాలకు కేరాఫ్ కేసీఆర్

- మాదిగలకు నమ్మకద్రోహం చేసిన సీఎం
- మిలియన్ మార్చ్‌లో విధ్వంసాలు చేసిన ఘనత కేసీఆర్‌దే
- వర్గీకరణ కోసం 20 నుంచి రాష్ట్రంలో రాస్తారోకోలు
- 21 నుంచి ఢిల్లీ కేంద్రంగా ధర్నాలు, దీక్షలు : కృష్ణమాదిగ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అబద్ధాలకు, మోసాలు, బెదిరింపులకు ముఖ్యమంత్రి కేసీఆర్ కేరాఫ్‌గా మారారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణమాదిగ మండిపడ్డారు. అబద్ధాలు చెప్పడానికి, ప్రశ్నించిన వారిని బెదిరించడానికి అసెంబ్లీని అడ్డాగా చేసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం సాధ్యం కాదని తేల్చి చెప్పినా.. ప్రత్యేక హోదా కోసం ఏపీ ఎంపీలు, రిజర్వేషన్ల కోటా పెంపు కోసం తెలంగాణ ఎంపీలు నిరసన తెలియజేస్తున్నారని కానీ ఎస్సీ వర్గీకరణ కోసం పట్టించుకోకపోవడం దారుణమని మండిపడ్డారు. ఇరు రాష్ట్రాల ఎంపీలు వర్గీకరణపై గొంతువిప్పాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20 నుంచి దీక్షలు, ధర్నాలు, రాస్తారోకోలు చేస్తామన్నారు. అలాగే ఈ నెల 21 నుంచి ఢిల్లీలోనూ ధర్నాలు, దీక్షలు చేస్తామని ప్రకటించారు. హైదరాబాద్‌లోని ఎమ్మార్పీఎస్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం మందకృష్ణ విలేకరులతో మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌పై నిప్పులు చెరిగారు. ఆయన మాటల్లోనే.. 'నన్ను, ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని అణచివేయడమే కాదు..భవిష్యత్తులోనూ అణచివేస్తామని అసెంబ్లీలో ప్రకటించడం సీఎం అహంకారానికి, బెదిరింపులకు నిదర్శనం. ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా కాంగ్రెస్‌తో కుమ్మక్కై, అలజడి సృష్టించడానికి ప్రయత్నించామని స్వయంగా ముఖ్యమంత్రే అబద్ధాలు చెబుతున్నాడు. 24 ఏండ్ల ఉద్యమ ప్రయాణంలో ఎమ్మార్పీఎస్ ఏనాడు సంఘ విద్రోహ చర్యలకుగానీ, శాంతిభద్రతలకు గానీ విఘాతం కలిగించలేదు. అయితే, 13 ఏండ్ల ఉద్యమ కాలంలోనే అనేక విధ్వంసాలు చేసిన చరిత్ర కేసీఆర్‌కు ఉంది. తెలంగాణ కోసం జరిగిన మిలియన్ మార్చ్‌లో పట్టపగలే పోలీసు, మీడియా వాహనాలు తగులబెట్టారు. విగ్రహాలను కూల్చివేశారు. బ్యాంకులపై దాడి చేసి లూటీ చేశారు. ఈ ఘటనల్లో కేసీఆర్‌పై నాన్‌బెయిల్ కేసులు నమోదయ్యాయి. ఎమ్మార్పీఎస్ నిర్వహించిన మిలియన్ మార్చ్‌లో అలాంటి విధ్వంసాలు జరిగాయా? అని ప్రశ్నించారు. కేసీఆర్ వ్యాఖ్యలు దొంగే దొంగ అన్నట్టుగా ఉన్నాయని విమర్శించారు. దళితులు నాయకులుగా ప్రశ్నించడాన్ని కేసీఆర్ సహించలేకపోతున్నాడని అన్నారు. కేసీఆర్ పాలనలో చట్టాలు దళితులకో విధంగా, దొరలకో రకంగా అమలు జరుగుతున్నాయని అన్నారు. దేశంలో దీక్షలు చేసిన నాయకులను జైలులో పెట్టిన చరిత్ర ఎక్కడా లేదని, శాంతియుతంగా దీక్షకు చేస్తుంటే జైలులో ఇరవై రోజులు ఎందుకు పెట్టించాడో కేసీఆర్ అసెంబ్లీలో ఎందుకు ప్రసావించలేదో చెప్పాలని మందకృష్ణ డిమాండ్ చేశారు. ప్రజా క్షేత్రంలో దళితుడే ముఖ్యమంత్రి అని, భారతి మాదిగ శవం సాక్షిగా అసెంబ్లీలో రెండు రోజుల్లోనే అన్ని రాజకీయ పార్టీల శాసనసభపక్ష నేతల సంతకాలతో ప్రధానమంత్రికి లేఖ రాస్తానని, దళితులకు మూడెకరాల భూమి, మాదిగలకు దండోర భవనం, డప్పుకు చెప్పుకు రూ.2 వేల పింఛన్.. ఇలా అన్ని అబద్ధాలు చెబుతూ మాదిగలను సీఎం మోసం చేస్తున్నాడని విమర్శించారు. కేసీఆర్ లాంటి మోసగాళ్లు మాదిగలకు అవసరం లేదని చెప్పారు. ఇప్పటికైనా కేసీఆర్ స్పందించి వర్గీకరణకు సంబందించి కేంద్రంపై ఒత్తిడి తేవాలని సూచించారు.

బీసీ వ్యతిరేక బడ్జెట్

- 52 శాతం జనాభాకు 3.39 శాతం నిధులా?
- సబ్‌ప్లాన్ సాధనకు ఐక్య ఉద్యమం: బీసీ సబ్‌ప్లాన్ సాధన కమిటీ చైర్మెన్ మురలీమనోహర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2018-19 బడ్జెట్ బీసీ వ్యతిరేకమైందని బీసీ సబ్‌ప్లాన్ సాధన కమిటీ చైర్మెన్ ప్రొఫెసర్ మురలీమనోహర్ విమర్శించారు. బీసీలు 52 శాతం జనాభా ఉంటే ఈ బడ్జెట్‌లో 3.39 శాతం నిధులే కేటాయించిందని చెప్పారు. బీసీ సబ్‌ప్లాన్ సాధనకు ఐక్య ఉద్యమం నిర్మిస్తామని అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీఆర్ఎస్ ప్రభుత్వం ఐదో సారి బడ్జెట్ ప్రవేశపెట్టిందని చెప్పారు. 1956 నుంచి 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలకులు ఎలా మోసం చేశారో, 2014 నుంచి ఇప్పటి వరకు తెలంగాణ పాలకులు అదే మోసం చేశారని విమర్శించారు. తెలంగాణలో ప్రాంతాల మధ్య, కులాల మధ్య అసమానతలు పెరిగాయని అన్నారు. పట్టణాలు, గ్రామాలకు మధ్య, కార్పొరేట్ శక్తులు, బలహీనవర్గాలకు మధ్య అగాధం పెరుగుతోందని చెప్పారు. చేతివృత్తులు నిర్లక్ష్యానికి గురవుతున్నాయని అన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించే విధానాలకు వ్యతిరేకంగా తెలంగాణలో మరో ఉద్యమం చేపట్టాల్సిన అవసరముందన్నారు. టీఆర్ఎస్ పాలకులు బంగారు తెలంగాణ కాకుండా అప్పుల తెలంగాణగా మార్చారని చెప్పారు. ఒక్కొక్కరిపై రూ.50 వేల అప్పు ఉందన్నారు. మానవ వనరులను పెంచాలని, ఉత్పత్తి పెంచాలని, ఉపాధి అవకాశాలు కల్పించాలని, అప్పుడే అభివృద్ధి చెందుతామని చెప్పారు. వృత్తులను ఆధునీకరించాలని, మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రభుత్వం కులాల మధ్య వైషమ్యాలు పెంచుతోందని అన్నారు. రెడ్డి హాస్టల్‌కు రూ.20 కోట్లు, బీసీ ఫెడరేషన్లు, కార్పొరేషన్లకు తక్కువ నిధులు కేటాయించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. అర్చకులకు వేతనాలు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని, బ్రాహ్మణ కార్పొరేషన్‌కు రూ.100 కోట్లు కేటాయించడాన్ని వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. బీసీ సబ్‌ప్లాన్ సాధన కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లె గోపాల్ మాట్లాడుతూ గత బడ్జెట్‌లో బీసీలకు రూ.5,070 కోట్లు కేటాయించిందని, 2018-19 బడ్జెట్‌లో రూ.5,920 (3.39 శాతం) కోట్లు మాత్రమే కేటాయించిందని చెప్పారు. ఎంబీసీ కార్పొరేషన్‌కు గతేడాది ఉన్న బడ్జెట్ రూ.వెయ్యి కోట్లను తిరిగి కేటాయించారని అన్నారు. ఎంబీసీలు ఎవరనేది ఇంకా తేల్చకుండా ఆ కులాలకు ఎలా న్యాయం జరుగుతుందని ప్రశ్నించారు. వృత్తులకు నిధులు కేటాయిస్తున్నా ఖర్చు చేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సబ్‌ప్లాన్ సాధన కమిటీ రాష్ట్ర సహాయ కార్యదర్శి కూరపాటి రమేష్, రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గుమ్మడిరాజు నాగరాజు, గొర్రెలు మేకల పెంపకం దార్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె నాగరాజు, ఎంబీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించడంలో కేసీఆర్ విఫలం

- 24గంటల కరెంట్‌తో అడుగంటుతున్న భూగర్భ జలాలు: టీజేఏసీ చైర్మెన్ కోదండరామ్, స్వరాజ్ అభియాన్ జాతీయ అధ్యక్షులు యోగేంద్ర యాదవ్

నవతెలంగాణ-సూర్యాపేట

పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో సీఎం కేసీఆర్ పూర్తిగా విఫలమయ్యారని టీజేఏసీ చైర్మెన్ కోదండరామ్, స్వరాజ్ అభియాన్ జాతీయాధ్యక్షులు యోగేంద్రయాదవ్ విమర్శించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను మార్కెట్‌కు తీసుకొస్తే రైతులకు మద్దతు ధర ఇవ్వకుండా దళారులు, వ్యాపారులు, అధికారులు మోసగిస్తున్నారన్నారు. గిట్టుబాటధర లేక, పెట్టుబడుల కోసం చేసిన అప్పులు తీరక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టించుకోవాల్సిన ప్రభుత్వం మొద్దనిద్రపోతోందన్నారు. దేశంలో అత్యధిక మంది రైతులు ఆత్మహత్యలు చేసుకునేది తెలంగాణలోనే అన్నారు. 24గంటల కరెంట్‌తో భూగర్భ జలాలు అడుగంటి పొలాలు ఎండిపోతున్నాయని తెలిపారు. మెజార్టీ ప్రాంతాల్లో 24గంటల విద్యుత్ వద్దని రైతులు మొత్తుకుంటున్నా ప్రభుత్వం పెడచెవిన పెడుతోందన్నారు. బడ్జెట్‌ను పరిశీలిస్తే అంకెల గారడి తప్ప జవాబుదారీ తనం లేదని విమర్శించారు. ఎకరాకు నాలుగువేల పథకం కౌలురైతులకు ఎందుకు వర్తింపజేయడం లేదని ప్రశ్నించారు. తెలంగాణను అభివృద్ధి చేయలేని కేసీఆర్ దేశాన్ని ఉద్ధరిస్తానంటూ ఫ్రంట్ ఏర్పాటు చేస్తాననడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రానున్న కాలంలో ప్రజలు కేసీఆర్‌కు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో జేఏసీ జిల్లా కన్వీనర్ కుంట్ల ధర్మార్జున్, ప్రభాకర్‌రెడ్డి, నవతెలంగాణ విద్యార్థి సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బారి అశోక్‌కుమార్, మండారి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

20న నిర్మాణ కార్మికుల చలో హైదరాబాద్

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

భవన నిర్మాణ సంక్షేమ బోర్డు నిధులను కార్మికుల సంక్షేమం కోసమే ఖర్చు చేయాలని కోరుతూ ఈనెల 20న చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వంగూరి రాములు, ఆర్ కోటంరాజు ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర చట్టం ప్రకారం 60 ఏండ్లు దాటిన కార్మికులకు పింఛన్, కార్మికుల పిల్లల చదువులకు స్కాలర్‌షిప్‌లు, అడ్డాలో మౌలిక వసతులు కల్పించాలని ఉందని చెప్పారు. కానీ తెలంగాణ ప్రభుత్వం అవేవీ కల్పించడం లేదని విమర్శించారు. కార్మికులకు డబుల్‌బెడ్‌రూము ఇండ్లు, పనిముట్ల కొనుగోలుకు ఆర్థిక సహాయం చేయాలనీ, ప్రస్తుతం ఇస్తున్న స్కీములకు నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం 20న కార్మిక శాఖ కమిషనరేట్ ఎదుట ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు.

విద్యార్థిని పట్ల ఇన్విజిలేటర్ అసభ్య ప్రవర్తన

నవతెలంగాణ-మెదక్ అర్బన్

విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయుడు విచక్షణ మరిచాడు. పరీక్ష రాస్తున్న విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ ఘటన మెదక్ జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగింది. విద్యార్థిని కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని వెంకట్రావ్ నగర్‌కాలనీకి చెందిన విద్యార్థిని ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదివింది. బాలికల ఉన్నత పాఠశాలలో వార్షిక పరీక్షలు రాస్తుండగా ఇన్విజిలేటర్ రామకృష్ణ విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. విద్యార్థిని భుజంపై చేయివేసి వేధించడంతో విద్యార్థిని పరీక్ష ముగిశాక పాఠశాల కరస్పాండెంట్ దృష్టికి తీసుకెళ్లింది. అతను తల్లిదండ్రులను పిలిపించాడు. తల్లిదండ్రులు డీఈఓ విజయలక్ష్మికి ఫిర్యాదు చేశారు. ఆమె విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ చిన్మయిని, నోడల్ ఆఫీసర్ మధు మోహన్‌ను విచారణకు ఆదేశించారు. దాంతో వారు పాఠశాలకు చేరుకొని జరిగిన ఘటనపై ఆరా తీశారు. సదరు విద్యార్థిని పూర్తి వివరాలను అధికారులకు తెలిపింది. ఈ విషయంపై పట్టణ సీఐ భాస్కర్‌ను వివరణ కోరగా, ఘటనపై విచారణ జరుపుతున్నామని, ఫిర్యాదు అందలేదని అన్నారు. ఇన్విజిలేటర్ రామకృష్ణ మెదక్ పట్టణంలోని ఫతేనగర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఎస్‌జీటి టీచర్.

మే తొలివారంలో దోస్త్ నోటిఫికేషన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) ప్రవేశాల నోటిఫికేషన్ మే తొలివారంలో విడుదల కానుంది. ఈ దిశగా ఉన్నత విద్యామండలి అధికారులు సమాలోచన చేస్తున్నారు. మే రెండో వారం నుంచి దోస్త్ ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరించనున్నట్టు తెలిసింది. జూన్ తొలివారంలో దోస్త్ తొలివిడత సీట్లు కేటాయించే అవకాశముంది. దోస్త్ ప్రవేశాలకు సంబంధించిన నోటిఫికేషన్ రూపకల్పన, విద్యార్థులకు సరళంగా ఉండేలా విధివిధానాల తయారీ వంటి అంశాలపై ఈనెల 19న ఉన్నత విద్యామండలిలో విశ్వవిద్యాలయాల వీసీలతో సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి ఉన్నత మండలి చైర్మెన్ తుమ్మల పాపిరెడ్డి, వైస్ చైర్మెన్లు ఆర్ లింబాద్రి, వి వెంకటరమణ, విద్యాశాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య, కాలేజీయేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ నవీన్ మిట్టల్‌తోపాటు విశ్వవిద్యాలయాల వీసీలు హాజరుకానున్నారు.

పరిశుభ్రత అంటే ఇదేనా..?

- అధికారులపై జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రాములు ఆగ్రహం
- వికారాబాద్ జిల్లాలో గురుకుల పాఠశాల సందర్శన
- హాస్టల్ విద్యార్థుల వసతులపై ఆరా




నవతెలంగాణ-వికారాబాద్‌రూరల్

'పరిశుభ్రత అంటే ఇదేనా?.600మంది విద్యార్థులు ఉండే గురుకులంలో వసతులు ఇలాగే ఉంటాయా' అని జాతీయ ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యులు కె రాములు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల కొత్తగడిని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టలంతా తిరిగి పరిశీలించారు. విద్యార్థులు రోజూ వదిలివేసిన ఆహార పదార్థాలు అంతా ఒక చోట చేరి, సెప్టిక్‌ట్యాంక్ నిండి దుర్వాసన వస్తుండటాన్ని, గురుకుల ప్రాంగణంలో మురుగునీరు ప్రవహించడాన్ని గమనించి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పటికప్పుడు మున్సిపల్ ట్యాంకర్‌ను తెప్పించి మురుగునీరును, సెప్టింక్ ట్యాంకు నుంచి ఖాళీ చేయించారు. విద్యార్థులకు అందుతున్న సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, బోధన, ప్రభుత్వం సరఫరా చేసే బట్టలు, దుప్పట్లు నోట్‌పుస్తకాలు సబ్బుల బిల్లు, విద్యార్థులు ప్రతి సంవత్సరం సాధించే ర్యాంకులపై అధికారుల నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాంఘీక సంక్షేమశాఖ ద్వారా కోట్లాది రూపాయలు విడుదల చేస్తున్నాయన్నారు. ఒక్కో విద్యార్థిపై ఏడాదికి సుమారు రూ.2లక్షలు ఖర్చు చేస్తున్నందున నాణ్యతలో రాజీపడకుండా విద్యార్థులకు వసతులు కల్పించాలన్నారు. గురుకుల పాఠశాల నుంచి ఐఏఎస్, ఐపీఎస్‌తో పాటు ఇతర పోటీ పరీక్షల్లో ర్యాంకులు సాధించాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. గురుకులాలపై నిర్లక్ష్య ధోరణితో ఉన్న అధికారులను ఉపేక్షించేది లేదని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సెక్రటరీకి ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. పదో తరగతి, ఇంటర్ పరీక్షల ఏర్పాట్లపై అధికారులను ఆరా తీశారు. ప్రస్తుతం ఇంటర్ పరీక్షలు పూర్తయ్యాయని, ఎస్సెస్సీ విద్యార్థులు పరీక్షలు రాస్తున్న సందర్భంగా పూర్తి వసతులు కల్పించామని వికారాబాద్ జాయింట్ కలెక్టర్ సంధ్యా రాణి తెలియజేశారు. అనంతరం విద్యార్థులను ఉత్తేజ పరుస్తూ వారికి భోజనాలను రాములు వడ్డించారు. వారితో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. దీంతో విద్యార్థులంతా కొద్దిసేపు జాతీయ కమిషన్ సభ్యులు రాములుతో అనేక అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో సాంఘీక సంక్షేమశాఖ డీడీ సంధ్య, ఆర్‌డీఓ విశ్వనాథం అధికారులు పాల్గొన్నారు.



ఇం'ధనం' ఏదీ?

- డిస్కంల రెవెన్యూలోటుకు..
బడ్జెట్ కేటాయింపులకు మధ్య భారీ వ్యత్యాసం



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో 24 గంటల విద్యుత్‌ను అమలు చేస్తున్నామని చెప్తున్న ప్రభుత్వం ఆ మేరకు 2018-19 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. విద్యుత్ సంస్థల రెవెన్యూలోటుకు సర్కారు కేటాయింపులకు మధ్య భారీ ఆర్థిక అంతరం కనిపిస్తోంది. 2018-19 ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ పంపిణీ సంస్థలు రూ.9,600 కోట్లు రెవెన్యూలోటు ఉంటుందని పేర్కొంటూ తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీఎస్ఈఆర్సీ)కి సమర్పించిన ఏఆర్ఆర్‌లలో పేర్కొన్నాయి. కానీ ప్రభుత్వం వచ్చే ఆర్థిక సంవత్సరానికి గానూ మొత్తం విద్యుత్‌రంగానికి కేటాయించిన నిధులు రూ.5,650 కోట్లు మాత్రమే. దీనిలో విద్యుత్ పంపిణీ సంస్థలకు (డిస్కంలు) సబ్సిడీగా కేటాయించిన మొత్తం రూ.4,984.30 కోట్లు. మిగిలిన రూ.665.70 కోట్లు టీఎస్‌జెన్‌కో, ట్రాన్స్‌కోల్లోని ఎంప్లాయీస్ బాండ్స్‌తో పాటు ఇతరత్రా చెల్లించాల్సిన సొమ్ము మాత్రమే. 2016-17లో రాష్ట్రప్రభుత్వం విద్యుత్ సబ్సిడీగా పంపిణీ సంస్థలకు రూ.4,584 కోట్లు, 2017-18లో 4,777 కోట్లు కేటాయించింది. అప్పటికి 24 గంటల విద్యుత్ సరఫరా అందుబాటులో లేదు.

కానీ 2018-19లో వ్యవసాయానికి 24గంటల విద్యుత్ సరఫరా ఉన్నప్పటికీ 2017-18తో పోల్చితే అదనంగా కేటాయించిన నిధులు కేవలం రూ.207.30 కోట్లు మాత్రమే. దీంతో ప్రభుత్వం అధికారికంగా చెప్తున్నట్టు 23 లక్షల పంపుసెట్లు మనుగడలో ఉండబోవని చెప్పకనే చెప్పినట్టు అయ్యింది. 2016-17లో డిస్కంల రెవెన్యూలోటు రూ.6,474.53 కోట్లు కాగా, 2017-18లో 6,824.52 కోట్లు ఉంది. తాజాగా 2018-19 రెవెన్యూలోటు రూ.9,600 కోట్లు. ఈ లెక్కన ఈ మూండేండ్లలో విద్యుత్ పంపిణీ సంస్థల ఆదాయ లోటు మొత్తంగా రూ.22,899.05 కోట్లు. ప్రభుత్వం ఇచ్చిన సబ్సిడీ రాయితీ నిధులు రూ.14,345.30 కోట్లు. మరి మిగిలిన రూ.8,553.75 కోట్ల రెవెన్యూలోటు సంగతి ఏంటనే దానిపై స్పష్టత లేదు.

గడచిన రెండేండ్లలో డిస్కంలు అధిక ధరలకు ప్రయివేటు విద్యుత్ సంస్థల నుంచి భారీగా కొనుగోళ్లు జరిపాయి. నేరుగా ప్రయివేటు కొనుగోళ్ల చెల్లింపుల పేరుతో కాకుండా ఈక్విటీ రూపంలో ప్రభుత్వం 2016-17లో రూ.2,262 కోట్లు, 2017-18లో రూ.2,498 కోట్లు డిస్కంలకు అదనంగా చెల్లించింది. కేంద్రప్రభుత్వం ప్రకటించిన ఉదయ్ స్కీంలో విద్యుత్ పంపిణీ సంస్థలు చేరినందున రూ.8,900 కోట్ల రుణాలను రాష్ట్రప్రభుత్వం బదలాయించుకుంది. అయినప్పటికీ 2016-17 నుంచి 2018-19 మధ్యకాలంలో(మూడేండ్లలో) డిస్కంల రెవెన్యూలోటు అక్షరాలా రూ.8,553.75 కోట్లకు చేరబోవడం గమనార్హం. మరి ఈ సొమ్మును ఎవరు భర్తీ చేయాలనేదానిపై ప్రభుత్వం ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. ఇక రాష్ట్రంలో కొత్తగా నిర్మిస్తున్న థర్మల్ విద్యుత్ కేంద్రాలకు రాష్ట్రప్రభుత్వం ఒక్క పైసా కూడా కేటాయించలేదు. దాదాపు రూ.96వేల కోట్ల రుణాలతో టీఎస్‌జెన్‌కో, ట్రాన్స్‌కో వీటిని చేపడుతోంది. అసలు ఈ రుణాల ప్రస్తావనే బడ్జెట్‌లో లేకపోవడం గమనార్హం.

హోంశాఖకు రూ.5790 కోట్లు

- గతేడాది కంటే దాదాపు
  వేయి కోట్లు పెంపు
- ఆధునీకీకరణకు ప్రత్యేక ప్రాధాన్యత
- కేటాయింపుల పట్ల డీజీపీ సంతృప్తి


(ఫైల్)

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

2018-19 ఆర్థిక సంవత్సరానికి గాను రాష్ట్ర హోంశాఖకు ప్రత్యేకించి పోలీసు విభాగానికి ఈ మారు గతానికంటే ఎక్కువగా బడ్జెట్‌లో నిధులను ప్రభుత్వం కేటాయించింది. ఈ ఆర్థిక సంవత్సరానికి గాను రూ.5790 కోట్ల రూపాయలను ప్రభుత్వం కేటాయించింది. ఇందులో డీజీపీ హెడ్‌క్వార్టర్స్‌కు రూ.604.86 కోట్లను కేటాయించింది. కాగా గత బడ్జెట్‌లో డీజీపీ కార్యాలయానికి రూ.331.14 కోట్లు కేటాయింపులు జరిగాయి. కాగా హైదరాబాద్ పోలీసు కమిషనరేట్‌కు రూ.574.21 కోట్ల రూపాయలను కేటాయించిన సర్కారు ఇందులోనుంచే రెండువందల కోట్లను కమాండ్ కంట్రోల్‌కు కేటాయించారు. సైబరాబాద్ కమిషనరేట్‌కు రూ.42.97 కోట్లు, రాచకొండ కమిషనరేట్‌కు 42.87 కోట్లను కేటాయించారు. అయితే గత బడ్జెట్‌లో రాచకొండ, సైబరాబాద్ పోలీసు కమిషనరేట్లకు చెరో రూ.4.97కోట్లను మాత్రమే కేటాయించిన సర్కారు, ఈ మారు ఈ రెండు కమిషనరేట్లకు భారీగా నిధులను కేటాయించింది. కీలకమైన నిఘా విభాగానికి రూ.36.67 కోట్లను కేటాయించిన సర్కారు, పోలీసు సంక్షేమానికి కూడా పెద్ద పీట వేస్తు రూ.30.48 కోట్లను నిర్ణయించింది. యాటీ నక్సలైట్ ఆపరేషన్ విభాగం గ్రేహౌండ్స్‌కు రూ.10.83 కోట్లు, యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ అక్టోపస్‌కు రూ.15.05 కోట్లు, జిల్లా పోలీసు అధికారులకు రూ.24.16 కోట్లను కేటాయించింది. అయితే జైళ్ల శాఖ మాత్రం రూ.21.26కోట్లను , అగ్నిమాపక శాఖకు రూ.14.68 కోట్లను మాత్రమే కేటాయింపులు చేసింది. ఈ రెండు శాఖలకు గతేడాది జరిపిన కేటాయింపులకు ఒక్క రూపాయిని కూడా పెంచకుండా ఈ ఏడాది అదే బడ్జెట్‌ను సర్కారు నిర్ణయించింది. ఇక కమ్యూనిటీ పోలీసింగ్‌కు రూ.37.25కోట్లు, రేషన్ ఆహార ఖర్చులకు రూ.31.75 కోట్లు, పోలీసు ఆధునీకీకరణకు రూ.86.64 కోట్లను కేటాయించింది. అలాగే నూతన పోలీసుస్టేషన్లు, పోలీసు భవనాలు నిర్మాణానికి రూ.50కోట్లు, సీసీ టీవీ కెమెరాల ఏర్పాటుకు రూ.10 కోట్లు, క్రైమ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టం(సీసీటీఎన్ఎస్) ప్రాజెక్టు కోసం రూ.25 కోట్లను కేటాయించింది.

వరంగల్ కమిషనరేట్ నూతన భవన నిర్మాణానికి రూ.20 కోట్లు కేటాయించిన సర్కారు రాచకొండ కమిషనరేట్ నూతన భవన నిర్మాణానికి సంబంధిత పోలీసు ఉన్నతాధికారులు ఆశించిన విధంగా ఎలాంటి కేటాయింపులు జరప లేదు. ఇండియన్ రిజర్వు బెటాలియన్ ఏర్పాటు కోసం రూ.20 కోట్లు, ట్రాఫిక్ నిర్వాహణకు రూ. 10 కోట్లు, ఆర్‌బీవీఆర్ పోలీసు అకాడమికి రూ.16 కోట్లను కేటాయించింది. కాగా గత ఆర్థిక సంవత్సరంలో హోంశాఖకు రూ.4828 కోట్లను కేటాయించిన ప్రభుత్వం ఈ ఏడాది దానికి అదనంగా 962 కోట్లను పెంచింది. కాగా ఫైర్‌సర్వీసులు, జైళ్ల శాఖ ఉన్నతాధికారులకు మాత్రం తమ విభాగాలకు జరిగిన కేటాయింపులు సంతృప్తి నివ్వలేదని తెలిసింది. జైళ్ల శాఖ దాదాపు వంద కోట్ల రూపాయల బడ్జెట్‌ను ఆశిస్తు పంపిన ప్రతిపాదనలకు సర్కారు నుంచి సరైన స్పందన లభించలేదని తెలిసింది. ఇదిలా ఉంటే పోలీసు శాఖకు జరిపిన కేటాయింపులు సంతృప్తినిచ్చాయని రాష్ట్ర డీజీపీ ఎం.మహేందర్‌రెడ్డి నవ తెలంగాణతో మాట్లాడుతూ అన్నారు. ముఖ్యమంత్రి ఆశించిన తీరులో రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడుతూ, నేరాలను అదుపు చేయడమేగాక సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా ఉపయోగించుకోవడం ద్వారా దేశంలోనే ఉత్తమ పోలీసు శాఖగా పేరు తెచ్చుకున్నామని డీజీపీ తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరానికి దాదాపు వేయి కోట్ల రూపాయలు అదనంగా కేటాయింపులు జరుపడం వలన మరింతగా సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చుకోవడమే గాక కొత్త జిల్లాల్లో పోలీసు భవనాల నిర్మాణాలు, సీసీ కెమెరాల అభివృద్ధి, కమాండ్ కంట్రోల్ నిర్మాణపు పనులు కూడా వేగవంతం చేస్తామని ఆయన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

వైద్యఆరోగ్యానికి రూ.3,522.71 కోట్లు

- గతేడాది కంటే ప్రగతిపద్దు
  రూ.856.08 కోట్లు అధికం
- కేటాయింపులతోనే సరిపెడతారా?
- గత బడ్జెట్‌లో 45 శాతం మాత్రమే ఖర్చు
- ఐదేండ్లలో ప్రగతిపద్దు కేవలం
  రూ.1,241 కోట్లు అధికం


(ఫైల్)

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

2018-19 ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్‌లో వైద్యఆరోగ్యశాఖకు మెరుగైనా కేటాయింపులు జరిగాయి. ప్రగతి పద్దులో గతేడాది కంటే రూ.856.08 కోట్లు అధికంగా కేటాయించారు. ఐదేండ్లలో ఈ మొత్తం కేవలం రూ.1,241 కోట్లు మాత్రమే ఎక్కువ కావడం విశేషం. 2014-15లో ప్రగతిపద్దు (ప్రణాళిక వ్యయం) రూ.2,282 కోట్లు. కాగా, ఈ సారి కేటాయింపులను ఎంతమేరకు ఖర్చు చేస్తారనేది చర్చనీయాంశంగా మారింది. క్రితం బడ్జెట్‌లో 45 శాతం నిధులనే ఖర్చు చేయడం ఇందుక్కారణం. ఇలా ఉండగా, హైదరాబాద్ చుట్టూ నాలుగు కొత్త ఆస్పత్రులు ఏర్పాటు చేస్తామని రెండేండ్ల క్రితం సీఎం కేసీఆర్ ప్రకటించారు. కేటాయింపుల్లో వాటి ఊసే లేకపోవడం గమనార్హం. ఇక ఉస్మానియా ఆస్పత్రి ఖాళీ స్థలంలో ట్విన్‌టవర్స్ నిర్మాణం, 20-25 వేల జనాభాకు ఒక పీహెచ్‌సీ, ప్రతి నియోజకవర్గంలో ఏరియా ఆస్పత్రి, సూపర్ స్పెషాలిటీగా జిల్లా ఆస్పత్రులు, ఉస్మానియా, గాంధీ, నీలోఫర్ ఆస్పత్రుల స్థాయి 2వేల పడకలకు పెంపు వంటి అంశాలపై ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్ ప్రస్తావించనేలేదు. గతేడాది మాదిరే కాస్త తక్కువైనా కేసీఆర్ కిట్లు, ప్రసూతి శిశు ఆరోగ్యానికి ప్రాధాన్యం కల్పించారు. ఈ రెండింటికి కలిపి రూ.556.65 కోట్లు చూపించారు. గతేడాది రూ.659.21 కోట్లు కేటాయించారు.

ఐదేండ్లలో కేటాయింపులు (కోట్లలో)			
సంవత్సరం	ప్రగతిపద్దు	నిర్వహణపద్దు	మొత్తం
2014-15	2,282	1,780	4,062
2015-16	2,459	2,473	4,932
2016-17	2,463	3,504	5,967
2017-18	2,666	3,310	5,976
2018-19	3,523	3,852	7,375

గత ఆర్థిక సంవత్సరంలో ప్రగతి పద్దు రూ.2,666.08 కోట్లు ఉంటే ఈ సారి రూ.3,522.71 కోట్లు కేటాయించారు. గతం కంటే 856.08 కోట్లు అధికం. 2017-18లో నిర్వహణపద్దు కింద రూ.3,310.09 కోట్లు, ప్రగతిపద్దు రూ.2,666.08 కోట్లతో మొత్తం రూ.5976.17 కోట్లు కేటాయించారు. 2018-19లో ప్రగతిపద్దు రూ.3522.21 కోట్లు, నిర్వహణ పద్దు రూ.3852.49 కోట్లతో మొత్తం రూ.7375.20 కోట్లుగా చూపించారు. గత బడ్జెట్ కంటే రూ.1,399.03 కోట్లు అధికం.

2017-18లో వైద్యవిద్య విభాగానికి రూ.505.18 కోట్లు కేటాయించగా ఈ సారి రూ.1472.18 కోట్లు కేటాయించారు. గతం కంటే రూ.967 కోట్లు ఎక్కువ. ఆరోగ్య, కుటుంబ సంక్షేమానికి గత బడ్జెట్‌లో రూ.1,489.28 చూపిస్తే..2018-19లో రూ. 1,239.54 కోట్లు కేటాయించారు. అలాగే, పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్‌కు క్రితం 355.93 కేటాయిస్తే..ఈ సారి 571.83 చూపించారు. ఇక 104, 108 కొత్త వాహనాల కొనుగోలుకు రూ.70 కోట్లు కేటాయించారు. ఉద్యోగులు, పింఛన్‌దారులు, జర్నలిస్టుల ఆరోగ్య పథకానికి ప్రస్తుత బడ్జెట్‌లో ప్రస్తావనే లేదు. ఎంఎన్‌జే ఆస్పత్రికి రూ.15 కోట్లు, టీవీవీపీ ఆస్పత్రుల ఆధునీకరణకు రూ.40 కోట్లు, పారా మెడికల్ సిబ్బంది శిక్షణకు రూ.6 కోట్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధునీకరణకు రూ.50.46 కోట్లు, ఉచితంగా మృతదేహాలు తరలించే వాహనాలకు రూ.10 కోట్లు, కాళోజీ వర్సిటీ విశ్వవిద్యాలయం భవనాల నిర్మాణానికి రూ.72 కోట్లు, మెడికల్ అండ్ అరోమెటిక్ ప్లాంట్స్ బోర్డుకు రూ.80 లక్షలు, నిమ్స్ ఆస్పత్రికి రూ.50.70 కోట్లు, అమ్మఒడి (102) పథకానికి రూ.398.79 కోట్లు, నర్సింగ్ కళాశాలలకు రూ.12.50 కోట్లు, యోగాధ్యాయన పరిషత్‌కు రూ.12 కోట్లు, రంగాపూర్ నిమ్స్‌కు రూ.8 కోట్లు, ఐపీఎంకు రూ.1.20 కోట్లు కేటాయించారు. నిధుల కేటాయింపుపై హర్షం వ్యక్త చేస్తూ టీజీజీడీఏ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ పి.శ్రీనివాస్, డాక్టర్ రవిశంకర్ సీఎం కేసీఆర్, మంత్రి లక్ష్మారెడ్డికి ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

ప్రగతిపద్దు వివరాలు (రూ.కోట్లలో)

విభాగం	2014-15	2015-16	2016 -17	2017-18	2018-19
వైద్యవిద్య	904.18	798.95	784.87	505.18	1472.18
కమిషనర్, కుటుంబ సంక్షేమం	970.89	1,218.19	1,137.69	1,489.28	1,239.54
ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమం	148.96	120.20	150.82	355.93	571.83
వైద్యవిధాన పరిషత్	74.00	100.00	128.98	70.15	69.35
ఆయుష్	12.35	16.03	28.80	32.61	45.60
డ్రగ్స్ కంట్రోల్ డైరెక్టరేట్	0.6	0.6	7.01	43.84	10.43

విద్యారంగంపై వివక్ష!

- ఏటా తగ్గుతున్న నిధుల కేటాయింపు
- 2014-15లో 10.88 శాతం,
  ఈసారి 7.61 శాతమే
- పాఠశాల విద్యాశాఖకు రూ.10,830కోట్లు
- ఎస్ఎస్ఏకు తగ్గిన నిధులు
- బడ్జెట్‌లో కనిపించని కేజీ టు పీజీ పథకం





నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

విద్యారంగంపై టీఆర్ఎస్ ప్రభుత్వం చిన్నచూపు చూస్తున్నది. బడ్జెట్ కేటాయింపులు ఏటా తగ్గడమే ఇందుకు నిదర్శనం. 2014-15 ఆర్థిక సంవత్సరంలో టీఆర్ఎస్ ప్రభుత్వం తొలి బడ్జెట్‌లో విద్యారంగానికి పరవాలేదు అన్నట్టుగా కేటాయించింది. 2014-15లో మొత్తం రూ.1,00,637 బడ్జెట్‌లో రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి రూ.10,956.34 (10.88 శాతం) కోట్లు కేటాయించింది. ఆ తర్వాత ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లలో విద్యారంగానికి నిధులు తగ్గుతూ వస్తున్నాయి. 2015-16లో రూ.1,15,689 కోట్ల బడ్జెట్‌లో విద్యారంగానికి రూ.11,216 (9.69 శాతం) కోట్లను కేటాయించింది. ఆ తర్వాత 2016-17లో మొత్తం రూ.1,30,415 కోట్ల బడ్జెట్‌లో విద్యారంగానికి రూ.10,738 (8.23 శాతం) కోట్లు ప్రతిపాదించింది. ఇక 2017-18లో మొత్తం రూ.1,49,646 కోట్ల బడ్జెట్‌లో విద్యారంగానికి రూ.12,705 (8.49 శాతం) నిధులు కేటాయించింది. ఇక ప్రస్తుతం ప్రవేశపెట్టిన 2018-19 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 1,74,453 కోట్లలో విద్యకు రూ.13,278 (7.61 శాతం) నిధులను కేటాయించింది. గత బడ్జెట్ కన్నా ప్రస్తుత బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు 0.88 శాతం నిధులు తగ్గాయి.

పాఠశాల విద్యకు అరకొర నిధులే

పాఠశాల విద్యారంగానికి 2018-19 బడ్జెట్‌లో అరకొర నిధులనే ప్రభుత్వం కేటాయించింది. పాఠశాల విద్యకు రూ.10,830 కోట్లు ప్రతిపాదించింది. అంటే మొత్తం బడ్జెట్‌లో 6.21 శాతం నిధులనే ప్రతిపాదించింది. దీనిలో నిర్వహణ పద్దు 8,685.79కోట్లు కాగా, ప్రగతి పద్దుకింద రూ.2,144.50 కోట్లు ఉన్నాయి. అయితే గతేడాది కంటే కొంచెం పెరిగినట్టు కనిపించినా, మొత్తం బడ్జెట్‌తో పోలిస్తే మాత్రం కాస్త తగ్గాయి. ప్రగతి పద్దులో గతేడాది కంటే రూ.104 కోట్లు పెరిగాయి. అయితే సర్వశిక్షా అభియాన్‌కు మాత్రం 2017-18లో రూ.1175కోట్లు కేటాయిస్తే, ఈ సంవత్సరం రూ.1058.78 కోట్లకు కుదించారు. గతేడాది కంటే రూ.117కోట్లు తగ్గించారు. ఈ సారి బడ్జెట్‌లో పాఠ్యపుస్తకాల ముద్రణాలయానికి రూ.22.64కోట్లు, గురుకుల సొసైటీకి రూ.47.72 కోట్లు, వయోజన విద్యకు రూ.11.35కోట్లు, పాఠశాలల కంప్యూటరీకరణకు రూ.పది కోట్లు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌కు రూ.4.79కోట్లు ప్రతిపాదించారు. పాఠశాల డైరెక్టరేట్‌కు రూ.15కోట్లు, కేజీబీవీ పాఠశాలల ప్రహారీగోడల నిర్మాణానికి రూ.పదికోట్లు, మోడల్ స్కూల్ భవనాల నిర్మాణానికి రూ.10కోట్లు, పరీక్షల విభాగానికి రూ.15.73కోట్లు, ప్రతిపాదించారు. అయితే నాలుగేండ్లు చెబుతున్న కేజీ టు పీజీ ఉచిత విద్య గురించి ప్రభుత్వం నిధులు కేటాయించలేదు. పాఠశాల విద్యాశాఖకు మొత్తం బడ్జెట్‌లో కేవలం 6.2శాతం నిధులే ప్రతిపాదించారు.

ఉన్నత, సాంకేతిక విద్యకు చాలీచాలని నిధులు

ఉన్నత, సాంకేతిక విద్యారంగానికి చాలీచాలని నిధులు కేటాయించింది. ఉన్నత విద్యకు నిర్వహణ, ప్రగతి పద్దు కలిపి రూ.2,025.56 కోట్లు ప్రతిపాదించింది. ఇక సాంకేతిక విద్యకు రూ.422.31 కోట్లు కేటాయించింది.

సాంకేతిక విద్యారంగానికి ప్రగతి పద్దు కింద రూ.617 కోట్లు కావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. కానీ సాంకేతిక విద్యకు ప్రగతి పద్దు కింద రూ.కేవలం రూ.60.85 కోట్లు కేటాయించడం గమనార్హం. విద్యారంగం అభివృద్ధి పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి పట్టింపులేదని విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు విమర్శిస్తున్నాయి.

విద్యారంగానికి 2018-19 బడ్జెట్ కేటాయింపు వివరాలు (కోట్లలో...)

విద్యారంగం	నిర్వహణ పద్దు	ప్రగతి పద్దు	మొత్తం
పాఠశాల	8,685.79	2,144.50	10,830.29
ఉన్నత	1,663.63	361.93	2,025.56
సాంకేతిక	361.46	60.85	422.31
మొత్తం	10,710.88	2,567.28	13,278.16

నవచిత్రం



దీపికా పదుకొనె

అవన్నీ వదంతులే..



ప్రభాస్

'మిర్చి' తర్వాత ప్రభాస్ నటిస్తున్న కమర్షియల్ చిత్రం 'సాహో'. 'రన్ రాజా రన్' ఫేమ్ సుజిత్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమిది. శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ చిత్రానికి సంబంధించి ప్రభాస్‌కు, దర్శకుడు సుజిత్‌కు మధ్య విబేధాలు తలెత్తాయని ఇటీవల సోషల్ మీడియాలో పలు వార్తలు వెలువడ్డాయి. దీనిపై సుజిత్‌ను ఓ అభిమాని ట్విట్టర్‌లో ప్రశ్నించగా అందుకు సుజిత్ స్పందించారు. 'మా మధ్య ఎలాంటి విబేధాలు లేవు. చాలా ఉత్సాహంగా చిత్ర షూటింగ్ జరుగుతోంది. మధ్యలో వచ్చే ఇలాంటి వార్తలు మాకు వినోదాన్ని కలిగిస్తాయి' అని చెప్పారు. ప్రభాస్ ఆరోగ్యంపై అడిగిన ప్రశ్నకు సమాధానంగా, 'ప్రభాస్ ఫిట్‌గా, సంతోషంగా ఉన్నారు. బాధపడాల్సిన అవసరం లేదు. వదంతులను నమ్మొద్దు' అని ట్వీట్ చేశారు. ఈ చిత్రంలో ప్రభాస్ సరసన బాలీవుడ్ నటి శ్రద్ధా కపూర్ కథానాయికగా నటిస్తోంది. యువి క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్‌లు తెలుగు, తమిళం, హిందీలో ఈచిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రభాస్ ఈ సినిమా తర్వాత రాధాకృష్ణ దర్శకత్వంలో ఓ చిత్రం చేయనున్నారు. ఇందులో పూజా హెగ్డే కథానాయికగా ఎంపికైనట్టు తెలుస్తోంది. అలాగే ప్రభాస్ బాలీవుడ్ ఎంట్రీ కోసం ఓ సినిమాలో నటించేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు.

సవ్యసాచి నయా లుక్..

'ప్రేమమ్' తర్వాత చందు మొండేటి దర్శకత్వంలో నాగచైతన్య హీరోగా నటిస్తున్న నూతన చిత్రం 'సవ్యసాచి'. నిధి అగర్వాల్ కథానాయికగా మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై వై.నవీన్, వై.రవిశంకర్, మోహన్(సీవీఎం) సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు మాట్లాడుతూ, 'తన రెండు చేతులను సమర్థవంతంగా వినియోగించగల అర్జునుడిని 'సవ్యసాచి' అంటారు. టైటిల్‌కి తగ్గట్టుగానే సినిమా, నాగచైతన్య పాత్ర తీరుతెన్నులు ఉంటాయి. చైతూ మాస్ అప్పీల్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ప్రస్తుతం చిత్ర షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. మన దేశంలో చిత్రీకరణ పూర్తి అయ్యాక, అమెరికా వెళ్ళనున్నాం. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి జూన్ 14న సినిమాను విడుదల చేయనున్నాం. ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో మాధవన్, భూమికలు ప్రత్యేక పాత్రలు పోషిస్తుండటం ఓ విశేషమైతే, 'బాహుబలి' తర్వాత కీరవాణి సంగీతంతోపాటు బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్న చిత్రమిదే కావడం మరో విశేషం' అని చెప్పారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: యువరాజ్, ఆర్ట్: రామకృష్ణ, ఎడిటర్: కోటిగిరి వెంకటేశ్వరరావు.



నాగచైతన్య

నేనింకా మొదలెట్టలేదు..



కళ్యాణ్‌రామ్, కాజల్

కళ్యాణ్ రామ్ నటిస్తున్న తాజా చిత్రం 'ఎమ్మెల్యే'. కాజల్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి ఉపేంద్ర మాధవ్ దర్శకత్వం వహిస్తున్నారు. బ్లూ ప్లానెట్ ఎంటర్‌టైన్‌మెంట్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకాలపై భరత్ రెడ్డి, కిరణ్‌రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. శుక్రవారం చిత్ర ట్రైలర్ విడుదలైంది. 'ఎంఎల్‌ఏగా గెలవాలంటే సినిమా డైలాగ్‌లు చెప్పడం, చిందులు వేయడం కాదు' అని కళ్యాణ్ రామ్‌ను ఉద్దేశించి విలన్ అనడం దానికి కౌంటర్‌గా 'నేనింకా రాజకీయం చేయడం మొదలు పెట్టలేదు. మొదలు పెడితే మీరు చేయడానికి ఏమీ మిగలదు' అని కళ్యాణ్‌రామ్ చెప్పే డైలాగ్, 'మా ఊళ్ళో నన్నందరూ మంచి లక్షణాలున్న అబ్బాయి అంటారు. దాన్నే షార్ట్ ఫామ్‌లో ఎంఎల్‌ఏ'తోపాటు 'మాట్లాడితే జనం జనం అంటున్నారు. మీ వెనుక ఒక్కరు కూడా లేరు' అనే ప్రశ్నకు సమాధానం 'వంద కూడా ఒక అంకెతో మొదలవుతుంది. నా జనం నా బ్యాక్ ఉండరు, నా బ్యాలెట్ బాక్సుల్లో ఉంటారు. చెట్టు ఎంతున్నా వేర్లు ఉండాల్సిందే భూమిలోనే, నదులెన్ని పరవళ్లు తొక్కినా కలవాల్సిందే సముద్రంలోనే వాడు నదైతే, నేను సముద్రం, వాడు చెట్టయితే నేను భూమి' అంటూ ఆవేశంగా చెప్పే శక్తివంతమైన డైలాగులు ట్రైలర్‌లో ఆకట్టుకుంటున్నాయి. ఈ చిత్రం ఈ నెల 23న విడుదల కానుంది.

అందుకే వాయిదా పడింది..

వరుసగా రెండు పీరియాడికల్ చిత్రాలు 'బాజీరావు మస్తానీ', 'పద్మావత్', ఒక హాలీవుడ్ యాక్షన్ చిత్రం 'త్రిబులెక్స్: రిటర్న్ ఆఫ్ గ్జెండర్ కేజ్'తో దీపికా పదుకొనె బాగా రెస్ట్ లెస్ అయిపోయిందట. దీంతో ప్రస్తుతం పూర్తి విశ్రాంతి తీసుకుంటోంది. అయితే విశ్రాంతి తీసుకోవడానికి అలసిపోవడంతోపాటు అనారోగ్య సమస్యలు కూడా ఓ కారణమట. 'పద్మావత్' చిత్ర షూటింగ్ సమయంలో తీవ్రమైన నడుంనొప్పి, మెడనొప్పితో బాధపడిన దీపికను కొన్ని రోజుల పాటు రెస్ట్ తీసుకోవాలని వైద్యులు సూచించారు. దీంతోపాటు విటమిన్ డి3 లోపంతోనూ దీపికా బాధపడుతోందట. దీని కోసమై మెడిసిన్ తీసుకుంటున్నట్టు తెలుస్తోంది. దీపిక ఆరోగ్య సమస్యల కారణంగా విశాల్ భరద్వాజ్ దర్శకత్వంలో నటించాల్సిన ఓ సినిమా షూటింగ్‌ను కూడా వాయిదా వేశారట. ఇదిలా ఉంటే, మరో మూడు నెలల్లో రణ్‌వీర్ సింగ్, దీపికల వివాహం జరగబోతున్నట్టు సోషల్ మీడియా కోడై కూస్తోంది. ఈ నేపథ్యంలో దీపికా అనారోగ్యం ఆమె అభిమానులను ఆందోళనకు గురిచేస్తోంది.

సమాజంలో మార్పు తీసుకొస్తాయి..



నసీరుద్దీన్ షా

'డాక్యుమెంటరీ చిత్రాలు సమాజంలో మార్పును తీసుకురాగలవు' అని అంటున్నారు బాలీవుడ్ సీనియర్ నటుడు నసీరుద్దీన్ షా. రాజ్‌కుమార్ హిరానీ, నందితా దాస్, రాహుల్ డోలాఖియాతో కలిసి ఇండియన్ డాక్యుమెంటరీ ఫౌండేషన్ కార్యక్రమంలో నసీరుద్దీన్ షా పాల్గొన్నారు. సమాజంలోని మార్పుకు డాక్యుమెంటరీల పాత్రపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ, 'కొద్ది కాలంగా పూణే ఫిల్మ్ ఇనిస్టిట్యూట్‌లో కొన్ని మంచి డాక్యుమెంటరీలు చూడటం ప్రారంభించాను. అందులో చాలా వరకు సమాజంలోని సమస్యలను, సామాజిక అంశాలను ప్రతిబింబిస్తున్నాయి. వాటిని చూస్తే డాక్యుమెంటరీలతో సమాజంలో మార్పు తీసుకురావచ్చనే విషయం అర్థమైంది. థియేటర్‌లో సినిమాలను చూసే ప్రేక్షకులకు డాక్యుమెంటరీలు రీచ్ కావడం కష్టమనుకున్నాను. బోర్ కొడతాయనుకున్నా. కానీ ఓ అంతర్జాతీయ ఫెస్టివల్‌లో డాక్యుమెంటరీలను చూసినప్పుడు నా ఆలోచన తప్పని అర్థమైంది. ఆయా డాక్యుమెంటరీలు ప్రతి ఒక్కరికీ అర్థమయ్యేలా ఉన్నాయి' అని చెప్పారు.

యదార్థ కథలకు ఫిక్షన్ జోడిస్తే అద్భుతం..



రాజ్‌కుమార్ హిరానీ

'యదార్థ కథలకు కల్పిత అంశాలను జోడించినప్పుడు ఆ సినిమా మరింత ఆసక్తికరంగా మారుతుంది' అని అంటున్నారు బాలీవుడ్ దర్శక, నిర్మాత రాజ్ కుమార్ హిరానీ. భిన్న చిత్రాల రూపకల్పనతో బాలీవుడ్‌లోనే కాదు యావత్ భారతీయ ప్రేక్షకులతో శభాష్ అనిపించుకున్న బాలీవుడ్ అగ్ర దర్శకుల్లో హిరానీ ఒకరు. ప్రస్తుతం మున్నాభాయ్ సంజయ్ దత్ జీవితం ఆధారంగా 'సంజు' అనే బయోపిక్‌ను రూపొందిస్తున్నారు. ఇటీవల ఇండియన్ డాక్యుమెంటరీ ఫౌండేషన్ నిర్వహించిన కార్యక్రమంలో 'ఫిల్మ్స్ ఫర్ ఛేంజ్' అంశంపై హిరానీ మాట్లాడుతూ, 'కొన్ని కథలను ఫిక్షనల్‌గా చెబితే, అవి ఆద్యంతం ఆసక్తికరంగా ఉంటాయి. మరికొన్ని కథలను డాక్యుమెంటరీ రూపంలో తీస్తే అమితాసక్తిని రేకెత్తిస్తాయి. అయితే సంజయ్ దత్ బయోపిక్‌ను డాక్యుమెంటరీగా తీయాలనే ఆలోచనే రాలేదు. ఎందుకంటే అది సినిమాగా, ఫిక్షన్ అంశాలతో చెబితేనే ఆడియెన్స్‌కు బాగా కనెక్ట్ అవుతుందనిపించింది. 'పీకే' సినిమాను మొదట దేవుడు, మతం గురించి ప్రధానంగా తీయాలనుకున్నాను. కానీ సినిమా తీసే క్రమంలో చాలా తక్కువ మాత్రమే వాటి గురించి చెప్పగలిగాను. నేననుకున్నది రివర్స్‌గా జరిగింది. దేవుడు, మతం గురించి కల్పితం చేసి చాలా చెప్పొచ్చు, కానీ ఆ సినిమాకు అంత వరకు సరిపోతుందనిపించింది. ఫిక్షన్ చిత్రంలో షుగర్ కోట్ వేస్తూ మనం చెప్పాలనుకున్న విషయాన్ని వినోదాత్మకంగా చెప్పొచ్చు. 'సంజు' చిత్రం ఎంగేజ్ చేసే ఫిక్షనల్ ఫిల్మ్. ఇందులో ఒక నటుడిలా మరో నటుడు నటిస్తాడు. అది ప్రేక్షకులను బాగా ఎంగేజ్ చేస్తుంది' అని చెప్పారు. ఈ సినిమాలో సంజయ్ దత్ పాత్రలో రణ్‌బీర్ కపూర్ నటిస్తుండగా, అనుష్కశర్మ, సోనమ్ కపూర్, దియా మీర్జా, టబు, మనీషా కోయిరాలా ఇతర ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. జూన్ 29న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.



లావణ్య త్రిపాఠి

కాశ్మీరీ గూఢచారి..



'రాజీ' చిత్రంలో అలియా భట్

బాలీవుడ్‌లో భిన్న పాత్రలు పోషించే కథానాయికల్లో అలియా భట్ ఒకరు. గ్లామర్ పాత్రలే కాదు, డీగ్లామర్ పాత్రలు సైతం చేస్తూ ప్రేక్షకుల్ని మెప్పిస్తోంది. తాజాగా నటిస్తున్న 'రాజీ' చిత్రంలో మరోసారి మరోసారి డీగ్లామర్‌గా కనిపించనుంది. మేఘ్నా గుల్జార్ దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. 1971యుద్ధం ప్రధానంగా ఇండియా-పాకిస్థాన్‌లో చోటు చేసుకున్న సంఘటనల ఇతివృత్తంగా రూపొందుతున్న ఈ చిత్రం ఒక అద్భుతమైన భారతీయ యువతి కథను తెలియజేస్తుంది. ఈ యుద్ధ సమయంలో కాశ్మీర్‌కు చెందిన గూఢచారి అమ్మాయి, పాకిస్థాన్‌కు చెందిన వ్యక్తిని పెళ్ళి చేసుకుంటుంది. సాధారణ అమ్మాయిగా బార్డర్‌లో తిరుగుతూ అక్కడి సమాచారాన్ని అందిస్తూ, అసాధారణ పరిస్థితుల్లో తనని తాను తెలుసుకునేందుకు ఓ అమ్మాయి పడిన సంఘర్షణ ప్రధానంగా ఈ చిత్రం రూపొందుతోంది. బార్డర్‌లో తిరిగే క్రమంలో అలియా డీ గ్లామర్‌గా కనిపించనుందట. గురువారం అలియా పుట్టిన రోజును పురస్కరించుకుని ఈ చిత్రంలోని తన పాత్ర లుక్‌ను విడుదల చేశారు. ఇందులో బుర్కా ధరించి సాధారణ మహిళగా అలియా డీ గ్లామర్‌గా కనిపిస్తోంది. విక్కీ కౌశల్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రాన్ని మే 11న విడుదల చేయనున్నారు. 'నటీనటులకు కొన్ని పాత్రలు చాలా అరుదుగా వస్తుంటాయి. అలాంటి అరుదైన పాత్ర నాకు 'రాజీ' చిత్రం నుంచి లభించింది. ఇటువంటి పాత్రను గతంలో ఎన్నడూ పోషించలేదు. నా నటనలోని మరో కోణాన్ని ప్రేక్షకులకు పరిచయం చేసే పాత్ర ఇది' అని అలియా తెలిపింది.

తొలిసారి రవితేజకి జోడీగా..!

'అందాల రాక్షసి'తో ప్రేక్షకుల్ని మెస్మరైజ్ చేసిన లావణ్య త్రిపాఠి ఆ మ్యాజిక్‌ను రిపీట్ చేయటంలో గతేడాది నుంచి తడబడుతోంది. లావణ్య నటించిన 'మిస్టర్', 'రాధా', 'యుద్ధం శరణం', 'ఉన్నది ఒకటే జిందగీ', 'ఇంటెలిజెంట్' వంటి బ్యాక్ టు బ్యాక్ ఐదు చిత్రాలు ప్రేక్షకుల్ని ఆకట్టుకోలేక డిజాస్టర్స్‌గా నిలిచాయి. అలాగే వీటిల్లో లావణ్య పోషించిన పాత్రలు సైతం ప్రేక్షకులకు కనెక్ట్ కాలేదు. వరుస పరాజయాలతో ఉన్నప్పటికీ లావణ్యకు అవకాశాలు రావడం విశేషం. ఇందులో భాగంగా తాజాగా రవితేజ సరసన నటించే లక్కీఛాన్స్‌ను లావణ్య అందుకున్నట్టు తెలుస్తోంది. రవితేజ ప్రస్తుతం కళ్యాణ్ కృష్ణ దర్శకత్వంలో ఓ సినిమాలో, శ్రీనువైట్ల దర్శకత్వంలో 'అమర్ అక్బర్ ఆంటోని'లో నటిస్తున్నారు. తర్వాత సంతోష్ శ్రీనివాస్ దర్శకత్వంలో ఓ సినిమా చేసేందుకు ప్లాన్ చేసుకుంటున్నారట. ఇందులో కథానాయికగా లావణ్యని ఎంపిక చేశారట. రవితేజ సరసన లావణ్య తొలిసారి నటిస్తున్న చిత్రమిది. రవితేజ దీంతో పాటు వి.ఐ.ఆనంద్ దర్శకత్వంలో ఓ సినిమా చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట.



జాక్వెలిన్ ఫెర్నాండేజ్

మాధురీకి అంకితం..

"ఏక్ దో తీన్..' పాటలో మాధురీ దీక్షిత్ నర్తించినట్టుగా మరెవ్వరూ చేయలేరు. ఆమెకు ఆమే సాటి' అని అంటోంది జాక్వెలిన్ ఫెర్నాండేజ్. 1988లో విడుదలైన 'తేజాబ్' చిత్రంలోని మాధురీ నటించిన 'ఏక్ దో తీన్' సాంగ్ ఎంతగా పాపులర్ అయ్యిందో మనందరికీ తెలిసిందే. అప్పట్లో కుర్రకారును ఓ ఊపుఊపిన ఈ పాటను తాజాగా 'బాఘి 2' చిత్రం కోసం రీమిక్స్ చేస్తున్నారు. ఈ పాటలో జాక్వెలిన్ నటించింది. ఈ సందర్భంగా ఈ పాట గురించి జాక్వెలిన్ మాట్లాడుతూ, 'ఈ పాటలో మాధురీ మేడమ్‌లా మరెవ్వరూ చేయలేరు. దాన్ని ఎవరూ టచ్ చేయలేరు. అంతేకాదు ఆమెతో నాకు పోటీ లేదు. కానీ నా వంతుగా ది బెస్ట్ చేశాను. మాధురీ మేడమ్ మీద ప్రేమతో ఈ పాటను ఆమెకే అంకితమిస్తున్నా. ఈ పాటను ఆమె ఎప్పుడెప్పుడు వీక్షిస్తారనే ఆతృతతో ఎదురు చూస్తున్నా' అని తెలిపింది. తాజాగా ఈ చిత్రంలోని 'ఏక్ దో తీన్' పాట కోసం మల్టీకలర్ కాస్ట్యూమ్ ధరించి అచ్చు మాధురీ దీక్షిత్‌ను తలపించే ఫోజ్ ఇచ్చిన జాక్వెలిన్ ఫొటోను మాధురీ దీక్షిత్ శుక్రవారం రిలీజ్ చేశారు. 2016లో వచ్చిన 'బాఘి' చిత్రానికి సీక్వెల్‌గా రూపొందుతున్న 'బాఘి 2' చిత్రానికి అహ్మద్ ఖాన్ దర్శకత్వం వహిస్తున్నారు. టైగర్ షరాఫ్, దిశా పటానీ జంటగా నటిస్తున్న ఈ చిత్రాన్ని ఈ నెల 30న విడుదల చేయనున్నారు. జాక్వెలిన్ ప్రస్తుతం 'డ్రైవ్', 'రేస్ 3' చిత్రాల్లో నటిస్తోంది.

ప్రతిభను ప్రోత్సహించే లక్ష్యంతో..

'మూడు నిమిషాల్లో 236 దేశాలను గుర్తించి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుల్లో స్థానం సొంతం చేసుకున్న చిన్నారి చిరుతేజ్ సింగ్ జీవితం ఆధారంగా లఘు చిత్రం రూపొందించడం చాలా సంతోషంగా ఉంది' అని దర్శకుడు డా.ఆనంద్ కుమార్ అన్నారు. చిరుతేజ్ సింగ్, మనాలి రాథోడ్, సౌమ్య వేణుగోపాల్, రాజశేఖర్, ఎన్.ఎస్.నాయక్ ప్రధాన పాత్రధారులుగా బంజారా మూవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై ఎన్.ఎస్.నాయక్ నిర్మించిన లఘు చిత్రం 'చిరు తేజ్ సింగ్'. ఈ షార్ట్ ఫిల్మ్‌ను పలువురు సినీ ప్రముఖులకు ప్రత్యేకంగా ప్రదర్శించారు. వారి ప్రశంసలందుకున్న సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో దర్శకుడు మాట్లాడుతూ, 'మహబూబాబాద్‌కు చెందిన చిరుతేజ్ సింగ్ 4వ తరగతి చదువుతోంది. ఈ వయసులోనే చదువులో అసాధారణమైన ప్రతిభను కనబరిచి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుతోపాటు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డుల్లోకి ఎక్కింది. ఈ చిన్నారి ప్రతిభను అందరికీ తెలియాలని, నేటితరం పిల్లలకు ఆదర్శంగా నిలవాలనే ఉద్దేశంతో కొన్ని కల్పిత సన్నివేశాలను మేళవించి ఈ లఘు చిత్రాన్ని రూపొందించాం. తల్లీకూతుళ్ళ మధ్య ప్రేమ, టీచర్, స్టూడెంట్ మధ్య ఉన్న ఆసక్తికరమైన అంశాలను మనసుకు హత్తుకునేలా తెరకెక్కించాం. ఇటీవల సమంతగారు అభినందనలు తెలిపారు. తాజాగా రాజ్ కందుకూరి, వీరశంకర్ తదితరులు సినిమా చూసి ప్రశంసించారు. ఇలాంటి పిల్లలను ప్రోత్సహించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. అలాగే చిరుతేజ్ సింగ్‌ను బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రకటించాలి' అని అన్నారు. 'నాపై షార్ట్ ఫిల్మ్ తీయడం చాలా ఆనందంగా ఉంది' అని చిరుతేజ్ సింగ్ తెలిపారు. నిర్మాత ఎన్.ఎస్.నాయక్ చెబుతూ, 'ఈ బాలిక గురించి తెలిసి, ఆమె ప్రతిభ పదిమందికి తెలియాలని ఈ లఘు చిత్రాన్ని నిర్మించాను' అని చెప్పారు.



మనాలి రాథోడ్, ఆనంద్‌కుమార్, చిరుతేజ్ సింగ్, నాయక్, సౌమ్య వేణుగోపాల్



సల్మాన్ ఖాన్

లిరిక్ రైటర్..!

బాలీవుడ్ యాక్షన్ థ్రిల్లర్ 'రేస్' సిరీస్‌లో భాగంగా ప్రస్తుతం 'రేస్ 3' రూపొందుతున్న విషయం విదితమే. సల్మాన్‌ఖాన్ హీరోగా, జాక్వెలిన్ ఫెర్నాండేజ్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని దర్శకుడు రెమో డిసౌజా తెరకెక్కిస్తున్నారు. ఈ యాక్షన్ థ్రిల్లర్ చిత్ర టైటిల్ లోగో, మోషన్ పోస్టర్‌ను గురువారం తన అభిమానులతో సల్మాన్ ట్విట్టర్ ద్వారా పంచుకున్నారు. 'మరో 3 నెలల్లో ' అంటూ ట్వీట్ చేశారు. 'రేస్' ఫ్రాంచైజీలో సల్మాన్ తొలిసారిగా నటిస్తున్నారు. గత రెండు చిత్రాల్లో సైఫ్ అలీఖాన్ నటించారు. ఇదిలా ఉంటే, ఈ చిత్రం కోసం ఓ రొమాంటిక్ సాంగ్‌ను రాస్తూ లిరిసిస్ట్‌గా సల్మాన్ ప్రేక్షకులకు పరిచయం కాబోతున్నారు. ఈ పాటను యుఏఈలో చిత్రీకరించేందుకు దర్శకుడు ప్లాన్ చేస్తున్నారు. అనిల్ కపూర్, బాబీ డియోల్, డైజీ షా తదితరులు ఇతర ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రాన్ని రంజాన్ కానుకగా జూన్ 15న విడుదల చేసేందుకు చిత్ర బృందం ప్లాన్ చేస్తోంది.

టీఆర్ఎస్,కాంగ్రెస్‌తో పొత్తు లేదు..

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వచ్చే ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ టీఆర్ఎస్‌తో తమ పార్టీకి పొత్తులుండబోవని సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం స్పష్టం చేశారు. ఇదే సమయంలో అఖిల భారత స్థాయిలో కాంగ్రెస్, బీజేపీలకు ప్రత్యామ్నాయంగా వామపక్ష, ప్రజాతంత్ర, సామాజిక శక్తులను ఏకం చేయాలన్నది తమ విధానమని తెలిపారు. అందువల్ల రాష్ట్రంలో ఇటు టీఆర్ఎస్‌తోగాని, అటు కాంగ్రెస్‌తోగానీ పొత్తులుండబోవని చెప్పారు. ప్రాంతీయ పార్టీల విషయానికొస్తే.. ఆయా పార్టీల నేతలందరూ రాష్ట్రాల్లో తమ ప్రయోజనాలు, అవసరాలు, లాభాల గురించే బేరీజు వేసుకుంటారు తప్పితే.. ఒక విశాల దృక్పథంతో ఆలోచించటం లేదని అన్నారు. రాష్ట్రంలో 28 పార్టీలతో ఏర్పడ్డ బీఎల్ఎఫ్‌కు అన్ని చోట్లా ఆదరణ లభిస్తున్నదని తెలిపారు. జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌తో త్వరలో బీఎల్ఎఫ్ చర్చలు జరిపే అవకాశముందని చెప్పారు.

శుక్రవారం హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి నర్సింహారావు, బి.వెంకట్‌తో కలిసి తమ్మినేని విలేకరులతో మాట్లాడారు. టీఆర్ఎస్ సర్కారు ప్రవేశపెట్టిన ఐదో బడ్జెట్.. ప్రజల ఆశల్ని తీర్చే విధంగా లేదని అన్నారు. రూ.లక్షా 49 వేల కోట్లతో గత బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ప్రభుత్వం.. సంక్షేమ పథకాల్లో భారీ కోతలు విధించిందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు గతంలో రూ.6 వేల కోట్లు కేటాయించి.. అందులో రూ.3 వేల కోట్లనే ఖర్చు చేశారని తెలిపారు. మళ్లీ ఇప్పుడు రూ.7 వేల కోట్లను ప్రతిపాదించారని గుర్తుచేశారు. ఎంబీసీలకు గత బడ్జెట్‌లో వెయ్యి కోట్లు కేటాయించి.. ఒక్క పైసా ఖర్చు చేయలేదని వివరించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకూ బడ్జెట్ కేటాయింపులు, ఖర్చుపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగుందంటూ ప్రభుత్వాధినేతలు చెబుతున్నారు.. కానీ ప్రజల ఆర్థిక పరిస్థితి మాత్రం నానాటికీ దిగజారుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు.

ఈనెల 19న హైదరాబాద్‌లోని గోల్కొండ క్రాస్‌రోడ్స్‌లో బీఎల్ఎఫ్ రాష్ట్ర కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నామని తమ్మినేని తెలిపారు. ఈ కార్యక్రమానికి గుజరాత్ ఎమ్మెల్యే, ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు జిగ్నేష్ మేవాని ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని చెప్పారు. ఆ కార్యక్రమంలో గద్దర్, కంచ ఐలయ్యలాంటి మేధావులు కూడా హాజరవుతారని చెప్పారు. అదేరోజు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మహాజన పాదయాత్ర ముగింపు వార్షికోత్సవాన్ని నిర్వహిస్తామని తెలిపారు. వీటిని జయప్రదం చేయాలని ప్రజానీకానికి పిలుపునిచ్చారు.

విద్యార్థులు హిజాబ్ ధరించి

కళాశాలకు వెళ్లొచ్చు



బొంబాయి హైకోర్టు

ముంబయి: హిజాబ్ ధరించి కాలేజీ వెళ్లేందుకు అనుమతించాలని ఓ వైద్యవిద్యార్థిని దాఖలు చేసిన పిటిషన్‌కు బొంబాయి హైకోర్టు సానుకూలంగా తీర్పునిచ్చింది. మత సాంప్రదాయ దుస్తులు.. హిజాబ్, గౌన్ ధరించిన విద్యార్థులను క్లాసులకు అనుమతించాలని యూనివర్సిటీ, కాలేజీలను హైకోర్టు ఆదేశించింది. విద్యార్థి, కాలేజీ యాజమాన్యం తరపున వాదనలు విన్న తర్వాత న్యాయమూర్తులు ఆర్ఎం సావంత్, సారంగ్ కొత్వాల్‌లతో కూడిన డివిజన్ బెంచ్ ఈ మేరకు తీర్పునిచ్చింది. ముస్లిం మహిళలు ధరించే హిజాబ్‌తో క్లాసులకు హాజరయ్యేందుకు యూనివర్సిటీ, కాలేజీ అనుమతించేలా మార్గదర్శకాలివ్వాలని లేదా తన చదువు కొనసాగేందుకు గాను ఈ విధానాన్ని అనుమతించే కళాశాలకు తనను బదిలీ చేయాలని థానెలోని సాయి హోమియోపతి మెడికల్ కాలేజీ విద్యార్థిని బొంబాయి హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. విద్యాసంస్థల్లో ఇలాంటి నిబంధనలు విధించకుండా ఆదేశాలివ్వాలని ఆ పిటిషన్‌లో కోరారు. విద్యార్థి తరపు న్యాయవాది మిహిర్ దేశాయ్ వాదిస్తూ..కాలేజీలో హిజాబ్ ధరించడాన్ని యాజమాన్యం తిరస్కరించడంతో విద్యార్థి తరగతులకు హాజరుకాలేకపోయిందని అన్నారు. తగిన హాజరుశాతం లేదని గత పరీక్షల్లో అనుమతించలేదని తెలిపారు. అయితే ముఖాన్ని కవర్ చేయకుండా ధరించి తన చదువును కొనసాగించుకోవచ్చని, అవసరమైనప్పుడు బుర్ఖాపై అప్రాన్ ధరించాలని కాలేజీ యాజమాన్యం సూచించింది. కాలేజీలో హిజాబ్ ధరించరాదనే నిబంధన లేదని తెలిపింది.

రైతులకు రుణమాఫీ!

మొదటిపేజీ తరువాయి

స్టేడియంలో ప్లీనరీ సమావేశాలు ప్రారంభమవుతాయి. రాహుల్‌గాంధీ ప్రారంభోపన్యాసం చేస్తారు. ఎన్డీయే సర్కారు వైఫల్యాలు, కాంగ్రెస్ భవిష్యత్తుపై ఈ ప్లీనరీలో చర్చిస్తారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ రాజకీయ ముసాయిదా తీర్మానం ప్రవేశపెడతారు. 18వ తేదీ రాహుల్‌గాంధీ ముగింపు ప్రసంగం చేస్తారు. నేడు వ్యవసాయం, రాజకీయ అంశాలపై ప్రధానంగా చర్చిస్తారని కాంగ్రెస్ నేతలు తెలిపారు.

మోడీ పరేషాన్

మొదటిపేజీ తరువాయి

నుంచి సమాజ్‌వాది పార్టీ అభ్యర్థి ప్రతాప్ యాదవ్ విజయం సాధించగా, మోడీ రాజీనామా చేసిన వడోదర స్థానం నుంచి బీజేపీకి అభ్యర్థి రంజన్ బెన్ భారీ విజయాన్ని సాధించగలిగారు. కందమాల్‌లో బిజు జనతాదళ్ అభ్యర్థి ప్రత్యూష రాజేశ్వరి సింగ్ బీజేపీ అభ్యర్థిపై ఘన విజయం సాధించారు. తెలంగాణాలోని మెదక్ నియోజకవర్గంలో జరిగిన ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థి గెలుపొందారు.

2015 - వరంగల్, బాంగన్, కష్ణగంజ్, రాట్లం

2015లో తెలంగాణలోని వరంగల్, పశ్చిమ బెంగాల్‌లోని బాంగన్, కృష్ణగంజ్ లోక్‌సభ స్థానాలకు ఉప ఎన్నికలు జరిగాయి. కడియం శ్రీహరిని టీఆర్ఎస్ ప్రభుత్వం డిప్యూటీ సీఎంగా నిర్ణయించిన తరువాత వరంగల్ లోక్‌సభ స్థానంలో ఖాళీ ఏర్పడింది. బంగాన్, కష్ణగంజ్‌లో ఎంపీల అకస్మిక మరణంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. వరంగల్ ఉప ఎన్నికలో టీఆర్ఎస్ అభ్యర్థి పసునూరి దయాకర్ ఘన విజయం సాధించారు. పశ్చిమబెంగాల్‌లోని బంగాన్, కష్ణగంజ్ స్థానాల్లో టీఎంసీ అభ్యర్థులు మమతా ఠాకూర్, సత్యజిత్ బిశ్వాస్ గెలుపొందారు. రాట్లం నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి కాంతీలాల్ భురియా చేతిలో బీజేపీ ఓటమిపాలయ్యారు.

2016 - తుమ్లుక్, కూచ్‌బెహర్, షహ్‌దోల్, లఖింపూర్

2016లో నాలుగు లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. పశ్చిమబెంగాల్‌లోని కూచ్‌బెహర్, మధ్యప్రదేశ్‌లోని శాదోల్ స్థానాల్లో ఆయా సభ్యుల మరణానంతరం ఖాళీ ఏర్పడ్డాయి. ఈ రెండు స్థానాల్లో తృణమూల్ కాంగ్రెస్, బీజేపీ తమ తమ స్థానాలను నిలబెట్టుకున్నాయి. వీటితోపాటు తుమ్లుక్‌లో కూడా తృణమూల్ కాంగ్రెస్ ఘన విజయం సాధించింది. అసోంలోని లఖింపూర్ నియోజకవర్గంలో శర్వానంద్ సోనోవాల్ ముఖ్యమంత్రిగా నియమించడంతో ఖాళీ ఏర్పడగా...బీజేపీ ఈ సీటును కాపాడుకుంది.

2017 - గురుదాస్‌పూర్, శ్రీనగర్, అమృత్‌సర్, మల్లప్పురం

2017 సంవత్సరంలో లోక్‌సభ ఉప ఎన్నికలు బీజేపీకి సవాలుగా నిలిచాయి. సినీ నటుడు వినోద్ ఖన్నా మరణంతో పంజాబ్‌లోని గురుదాసూపూర్ సీటు ఖాళీ అయింది. ఈ స్థానంలో బీజేపీ అభ్యర్థిని కాంగ్రెస్ అభ్యర్థి సునీల్ జఖార్ దాదాపు రెండు లక్షల ఓట్ల తేడాతో ఓడించారు. అలాగే 2017 మార్చిలో పంజాబ్‌లోని అమృత్‌సర్ నియోజకవర్గంలో జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ తన స్థానాన్ని కోల్పోయింది. బీజేపీ అభ్యర్థి రాజిందర్ సింగ్ చిన్నాను కాంగ్రెస్ అభ్యర్థి గురుజీత్ సింగ్ అహూజా ఓడించారు. శ్రీనగర్ నియోజకవర్గం పీడీపీ ఖాతాలో ఉన్నది. బీజేపీతో సంకీర్ణ ప్రభుత్వమైన మెహబూబా ముఫ్తీ పార్టీకి చెందిన ఆ పార్టీ ఎంపీ రాజీనామాతో ఖాళీ అయిన స్థానానికి ఎన్నిక జరిగింది. అక్కడ నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్ ఉమ్మడి అభ్యర్థి ఫరూఖ్ అబ్దుల్లా విజయం సాధించారు. కేరళలోని మల్లప్పురంలో ముస్లిం లీగ్ అభ్యర్థి గెలుపొందారు.

2018 -అజ్మీర్, అల్వార్, ఉల్బేరియా, అరారియా, గోరఖ్‌పూర్, ఫూల్‌పూర్

2018లో బీజేపీ పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. దేశంలో ఆరు లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరిగాయి..అవి కూడా బీజేపీ పాలిత రాష్ట్రాలు కావటం విశేషం. మొదటి దశలో అజ్మీర్, అల్వార్, ఉల్బేరియా రెండో దశలో అరారియా, గోరఖ్‌పూర్, ఫూల్‌పూర్ ఎన్నికలు జరిగాయి. మొదటి దశలో రాజస్థాన్, అజ్మీర్, అల్వార్‌లో బీజేపీ ఎంపీలు సన్వర్‌లాల్ జాట్, మహంత్ చంద్ నాద్‌ల మరణంతో ఖాళీలు ఏర్పడ్డాయి.

రెండు స్థానాల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులు రఘు శర్మ, డాక్టర్ కరణ్ సింగ్ యాదవ్ చేతిలో బీజేపీ అభ్యర్థులు ఓడిపోయారు. ఉల్బేరియా నియోజకవర్గంలో తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థి గెలుపొందారు. తుదిదశలో యోగి రాజ్‌లోని ఉత్తరప్రదేశ్‌లోని ఫూల్‌పూర్, గోరఖ్‌పూర్ నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు జరిగాయి. ఈ రెండు స్థానాల్లోనూ బీజేపీ చిత్తుచిత్తుగా ఓడిపోయిన విషయం తెలిసిందే. ఎన్డీయే సంకీర్ణంలో బీహార్‌లో ఉన్న జేడీయూ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్‌కు చుక్కెదురైంది. బీహార్ అరారియా లోక్‌సభ నియోజకవర్గంలో ఆర్జేడీ అభ్యర్థి చేతిలో బీజేపీ ఓటమి పాలైంది. దేశంలో 2014 నాటి మోడీ వేవ్ క్రమంగా బలహీనపడుతున్నదని ఈ నాలుగేండ్లలో జరిగిన మధ్యంతర ఎన్నికల ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. ఎన్నో హామీలవర్షంతో తడిసిముద్దయిన ఓటర్లు..మోడీదీ గత పాలకుల దారేనన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతున్నది.

అవిశ్వాసం

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

మోడీ సర్కారుకు వ్యతిరేకంగా టీడీపీతో పాటు వైసీపీ పోటాపోటీగా అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెట్టాయి. ఈ తీర్మానాలకు టీఆర్ఎస్, అన్నాడీఎంకే మినహా ప్రధాన ప్రతిపక్ష పార్టీలన్నీ మద్దతు తెలిపాయి. లోక్‌సభలో ఈ తీర్మానాలపై స్పీకర్ సుమిత్రా మహాజన్ ప్రకటన చేసే సమయంలోనే కాంగ్రెస్, సీపీఐ(ఎం), ఎస్పీ, టీఎంసీ తదితర పార్టీల ఎంపీలు తమ స్థానాల్లో నిల్చొని మద్దతు తెలిపారు. అయితే సభ 'క్రమంలో' లేదని, ఈ సమయంలో అవిశ్వాస తీర్మానాలను ప్రవేశపెట్టలేనని స్పీకర్ ప్రకటించారు. అనంతరం సభను సోమవారానికి వాయిదా వేశారు. 'విపక్షాల నిరసనలపై ప్రజలు సహనం కోల్పోతున్నారు' అంటూ రాజ్యసభలో చైర్మెన్ వెంకయ్యనాయుడు చేసిన వ్యాఖ్యలు కొద్దిపాటి వాగ్వాదానికి దారి తీశాయి. గతంలో విపక్షాల ఆందోళనలతో నెలల తరబడి సభ వాయిదా పడటం చూడలేదా? అని కాంగ్రెస్ ప్రశ్నించింది. దీంతో కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం సభ మధ్యాహ్నం 2.30 గంటలకు ఆపై సోమవారానికి వాయిదా పడింది. ఆంధ్రప్రదేశ్‌కు హోదా హామీని విస్మరించినందుకు నిరసనగా కేంద్రంపై తమకు విశ్వాసం లేదంటూ ఏపీకి చెందిన అధికార, ప్రతిపక్ష పార్టీలు టీడీపీ, వైసీపీలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాలు శుక్రవారం సభ ముందుకు వచ్చాయి. వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, టీడీపీ ఎంపీ తోట నరసింహం అందజేసిన నోటీసులు తమకు అందాయని స్పీకర్ సుమిత్రా మహాజన్ సభలో ప్రకటించారు. 'నోటీసులు సభ ముందుకు తీసుకురావడం నా బాధ్యత. సభ క్రమంలో ఉండేంత వరకూ... ఆయా ఎంపీలు తమ స్థానాల్లో నిల్చున్నారో లేదో 50 మందిని లెక్కించడం సాధ్యపడదు. లెక్కించిన తరువాతే ఈ తీర్మానాలను ప్రవేశపెట్టేందుకు అనుమతివ్వాలో తిరస్కరించాలో నిర్ధారించే వీలుంటుంది' అని అన్నారు. ఈ సమయంలో రిజర్వేషన్ కోటాపై టీఆర్ఎస్ ఎంపీలు, కావేరీ నదీ నిర్వహణ బోర్డు కోసం అన్నాడీఎంకే ఎంపీలు వెల్‌లో ప్లకార్డులతో నినాదాలు చేశారు. 'సభ క్రమంలో లేనందున.. తీర్మానాలను సభ ముందు ప్రవేశపెట్టలేను' అని ప్రకటించిన స్పీకర్.. అనంతరం సభను 19వ తేదీ సోమవారానికి వాయిదా వేశారు.

అంతకముందు ఉదయం సభ ప్రారంభమవగానే యూపీ, బీహార్‌లో జరిగిన లోక్‌సభ ఉప ఎన్నికల్లో గెలుపొందిన ఎంపీలు ప్రమాణం చేశారు. అనంతరం ప్రశ్నోత్తరాలను ప్రారంభిస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు. దీంతో టీడీపీ, వైసీపీ, టీఆర్ఎస్, అన్నాడీఎంకే ఎంపీలు తమ డిమాండ్లపై వెల్‌లోకి దూసుకొచ్చారు. పెద్దఎత్తున నినదాలు చేశారు. ప్రశ్నోత్తరాలను అడ్డుకున్నారు. దీంతో సభను స్పీకర్ మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు.

అవిశ్వాసానికి మద్దతిస్తాం : సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి

ఏపీకి ప్రత్యేక హోదా హామీని విస్మరించిన బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి మద్దతు తెలియజేస్తామని సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి తెలిపారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. 'బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీసుకొచ్చిన అవిశ్వాస తీర్మానానికి సీపీఐ(ఎం) మద్దతిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా వాగ్దానంపై బీజేపీ విశ్వాస ఘాతుకానికి పాల్పడటం క్షమార్హంకాదు. అన్ని రంగాల్లో వైఫల్యంపై, పార్లమెంట్ జవాబుదారీతనం నుంచి తప్పించుకోవడంపై బీజేపీని ఎండగట్టాల్సిన అవసరముంది' అని పేర్కొన్నారు.

బీజేపీకి గట్టి ఎదురుదెబ్బ...
టీడీపీ దారిలో మరికొన్ని పార్టీలు?

కేంద్రంలోని మోడీ సర్కారుకు గట్టి ఎదురుదెబ్బ తగిలినట్టయింది. ఎన్డీయే కూటమి నుంచి మిత్రపక్షమైన టీడీపీ తెగదెంపులు చేసుకున్నది. ఏపీకి ప్రత్యేక హోదాను ఇవ్వనందుకు నిరసనగా బీజేపీ సర్కారుపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టింది. మొదట వైసీపీ ప్రవేశపెట్టిన అవిశ్వాసానికి మద్దతు ఇవ్వనుందని ఊహాగానాలు వినిపించాయి. అయితే వైసీపీ అవిశ్వాసం ఓ డ్రామా అని పేర్కొన్న ఆ పార్టీ లోక్‌సభాపక్ష నేత తోట నరసింహం.. తామే స్వయంగా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడుతున్నామని శుక్రవారం ఉదయం మీడియాకు తెలిపారు. ఎన్డీయే మిత్రపక్షంలో శివసేన(18) పార్టీల తరువాత అతిపెద్ద రెండో పార్టీ టీడీపీ. మొత్తం 16 మంది లోక్‌సభ సభ్యుల సంఖ్యాబలం ఉన్నది. కాగా టీడీపీ బాటలోనే మరికొన్ని పార్టీలున్నట్టు తెలుస్తోంది. బీజేపీపై శివసేన సైతం ఆగ్రహంగా ఉన్నది. మోడీ నేతృత్వంలోని సర్కారు కీలకమైన అంశాలపై మిత్రపక్షాలతో సంప్రదింపులు చేయడం లేదని ఆ పార్టీ ఎంపీ చంద్రకాంత్ తెలిపారు. 'బీజేపీ మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి ఎప్పుడూ మిత్రపక్షాలను తన వెన్నంటే నిలుపుకునేవారు' అని అన్నారు. ఆ పార్టీ పత్రిక సామ్నాలోనూ మోడీ వైఖరిని తీవ్రపదజాలంతో ఎండగట్టారు. నాలుగేండ్ల క్రితం ఎన్డీయేను అధికారంలోకి తీసుకొచ్చిన మోడీ హవా నీరుగారిపోయిందని ఎడిటోరియల్‌లో పేర్కొన్నది. నేడు ప్రజలు అన్ని విషయాలు స్పష్టంగా చూస్తున్నారని చంద్రకాంత్ తెలిపారు. మరోవైపు టీడీపీ అవిశ్వాస తీర్మానానికి తృణమూల్ కాంగ్రెస్ మద్దతు తెలిపింది. ఎన్డీయే నుంచి టీడీపీ తెగదెంపులు చేసుకోవడాన్ని ఆ పార్టీ అధినేత్రి మమతాబెనర్జీ స్వాగతించారు. ఈ మేరకు ఆమె ట్వీట్ చేశారు. బీజేడీ సైతం మద్దతు తెలిపింది. మద్దతుపై కాంగ్రెస్ అధికారికంగా ప్రకటించినప్పటికీ.. లోక్‌సభలో ఉదయం అవిశ్వాస తీర్మానం వచ్చినప్పుడు కాంగ్రెస్‌తో పాటు యూపీఏ మిత్రపక్షాల ఎంపీలు నిల్చుని మద్దతు తెలిపారు. టీడీపీ అవిశ్వాసానికి మద్దతిచ్చే అంశంపై అన్నాడీఎంకే ఇంకా నిర్ణయించలేదు. అవిశ్వాసంపై పార్టీ హైకమాండ్ నిర్ణయం తీసుకోనున్నదని ఆ పార్టీ ఎంపీ తంబిదొరై తెలిపారు. కావేరీ నదీ నిర్వహణ బోర్డు ఏర్పాటు చేయకపోవడంపై తమిళ ఎంపీలు తీవ్ర ఆగ్రహంగా ఉన్న విషయం తెలిసిందే. కాగా అకాలీదళ్ బీజేపీకి మద్దతు ప్రకటించింది. 'బీజేపీకి అకాలీదళ్ పురాతన భాగస్వామి. ఇలాంటి క్లిష్టసమయాలను కలిసికట్టుగా ఎదుర్కొన్నాం' అని ఫుడ్‌ప్రాసెసింగ్ మంత్రి హర్‌సిమ్రత్‌కౌర్ అన్నారు.

టీఆర్ఎస్‌ది అదే దారి..

కేంద్రప్రభుత్వంపై టీడీపీ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం పార్లమెంటులో చర్చకు వస్తే..మోడీ సర్కారుకు వ్యతిరేకంగా ఓటేయనున్నట్టు టీఆర్ఎస్ వెల్లడించింది. ఎన్డీయే ప్రభుత్వతీరును వ్యతిరేకిస్తున్న తెలంగాణ ప్రభుత్వం కూడా అవిశ్వాసతీర్మానానికి మద్దతు తెలపాలని నిర్ణయించింది.

రాజ్యసభలో చైర్మెన్‌కు, కాంగ్రెస్ ఎంపీకి వాగ్వాదం...

విపక్షాల ఆందోళనపై రాజ్యసభ చైర్మెన్‌కు కాంగ్రెస్ ఎంపీ సత్యవ్రత్ చతుర్వేదికి స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. ఉదయం సభ ప్రారంభమైన తరువాత చైర్మెన్ వెంకయ్యనాయుడు ఆందోళన చేపడుతున్న ఎంపీలనుద్దేశించి ప్రసంగం చేశారు. సభను అడ్డుకునే బదులు అంశాలపై చర్చ చేపట్టాలని సూచించారు. ప్రతిరోజూ పార్లమెంట్ పనిచేయకపోవడాన్ని చూసి ప్రజలు అసహనానికి గురౌతున్నారని చెప్పారు. 'సభలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ.. అంశాలను పరిష్కరించలేరు. డిస్కస్, డిబేట్, డిసైడ్' అని ఎంపీలకు సూచించారు. వెంకయ్యనాయుడు ప్రసంగం ముగించగానే.. కాంగ్రెస్ ఎంపీ సత్యవ్రత్ చతుర్వేది లేచి మాటా్లడారు. 'సభ జరగాలన్న మీ అభిప్రాయాలను ఎవరూ నిరాకరించడం లేదు. కానీ మీకు నేనొక్కటి అడగదల్చుకున్నాను. మీ సుదీర్ఘ రాజకీయ అనుభవంలో సభను అడ్డుకోవడం చూడటం ఇదే మొదటిసారా? గతంలో మీరు చూడలేదా? ఈ సభను గతంలో నెలల తరబడి స్తంభింపచేశారు' అని చెప్పారు. దీంతో సభను చైర్మెన్ మధ్యాహ్నం 2.30 నిమిషాలకు వాయిదా వేశారు. అనంతరం ప్రయివేటు సభ్యుల చర్చలోనూ విపక్ష పార్టీలు ఆందోళన చేపట్టాయి. ఫలితంగా సభ సోమవారానికి వాయిదా పడింది.

నూతన సభ్యుల ప్రమాణం..

యూపీ, బీహార్ లోక్‌సభ ఉప ఎన్నికల్లో గెలుపొందిన ఆర్జేడీ, ఎస్పీ నూతన సభ్యులు శుక్రవారం ఎంపీలుగా ప్రమాణం చేశారు. ఉదయం సభ ప్రారంభమవగానే బిహార్‌లోని అరరియా స్థానం నుంచి గెలుపొందిన సర్ఫరాజ్ అలాం, యూపీలోని పుల్పూర్ నుంచి గెలిచిన నాగేంద్రప్రతాప్ సింగ్ పటేల్, గోరఖ్‌పూర్ నుంచి గెలుపొందిన ప్రవీణ్‌కుమార్ నిషాద్‌లు ప్రమాణం చేశారు. నూతన సభ్యులకు విపక్ష పార్టీల ఎంపీలు బల్లలుజరుస్తూ ఘన స్వాగతం పలికారు.

తహసీల్దార్ కార్యాలయంపై బస్తీవాసుల దాడి

10 మందికి తీవ్రగాయాలు

నేడు కలెక్టరేట్ ఎదుట రెవెన్యూ ఎంప్లాయీస్ జేఏసీ ధర్నా

నవతెలంగాణ - సిటీబ్యూరో

హైదరాబాద్ ఆసిఫ్‌నగర్ మండల తహసీల్దార్ కార్యాలయంపై స్థానిక మాంగ్ గరోడి బస్తీవాసులు శుక్రవారం మధ్యాహ్నం దాడి చేశారు. సిబ్బందిని తీవ్రంగా కొట్టారు. దీనికి నిరసనగా సిబ్బంది ధర్నా చేశారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కుల ధ్రువీకరణ పత్రం విషయంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డితో బస్తీవాసులు వాదనకు దిగారు. తహసీల్దార్‌ను దూషిస్తుంటే అక్కడే ఉన్న కార్యాలయ సిబ్బంది అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీంతో మాంగ్ గరోడి బస్తీవాసులు సిబ్బందిని విపరీతంగా కొట్టారు. ఇదే సమయంలో పరిసర ప్రాంతాల నుంచి సుమారు 40 మంది కార్యాలయంలోకి ప్రవేశించి సిబ్బంది అందరిపైనా దాడి చేశారు. సిబ్బంది నాగార్జునరెడ్డి, శ్రీకాంత్, అనురుదీ, మహేష్, పార్థసారథి, పూర్ణశ్రీ, రేఖ, భవాని, సాయికాంత్, స్వాతికకు గాయాలయ్యాయి. వీరు హుమాయున్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాడి చేసిన వారిపై సీఆర్‌పీసీ 354, 355, 506, సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. ఆసిఫ్‌నగర్ తహసీల్దార్ కార్యాలయానికి ఆర్డీవో చంద్రకళ, తెలంగాణ తహసీల్దార్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సైదులు, రాష్ట్ర కోశాధికారి రాములు, నాయకురాలు సుజాత, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్, తెలంగాణ వీఆర్వో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు గోల్కొండ సతీష్‌కుమార్, పలువురు తహసీల్దార్లు, వీఆర్వో, రెవెన్యూ సిబ్బంది పెద్దఎత్తున తరలివచ్చారు. అనంతరం హుమాయున్ పోలీస్‌స్టేషన్‌కూ వెళ్లారు. దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టారు. తహసీల్దార్ కార్యాలయంపై దాడి చేయడం, సిబ్బందిని గాయపర్చడం కుల ధ్రువీకరణ పత్రం విషయం లాగా లేదని, కుట్రపూరితంగా చేశారని తహసీల్దార్ల సంఘం జిల్లా అధ్యక్షులు సైదులు అన్నారు.


నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా...

తహసీల్దార్ కార్యాలయంపై దాడి చేసి, సిబ్బందిని విపరీతంగా గాయపర్చినందుకు నిరసనగా నేడు పెన్‌డౌన్, అనంతరం కలెక్టరేట్ ఎదురుగా ధర్నా చేపడతామని జిల్లా రెవెన్యూ ఎంప్లాయీస్ జేఏసీ ప్రకటన విడుదల చేసింది. ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్ వద్ద ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి రెవెన్యూ ఉద్యోగులు తప్పనిసరిగా హాజరుకావాలని వివిధ సంఘాలకు చెందిన జేఏసీ నాయకులు గోల్కొండ సతీష్‌కుమార్, రాములు, విష్ణుసాగర్, వేణుగోపాల్, కె.రామకృష్ణ, ఎండీ యూనస్ సంయుక్తంగా విడుదల చేసిన ప్రకటనలో కోరారు.

నజరానా...

మొదటిపేజీ తరువాయి

14,798 చదరపు గజాల ఈ స్థలాన్ని 1975లో జీవో ఎంఎస్ నంబర్ 1095 తేదీ 13.8.1975 ద్వారా మహవీర్ హాస్పిటల్ కోసం 30 సంవత్సరాలు లీజుకు ఇవ్వటానికి రెవిన్యూ శాఖ అనుమతించింది. ఎకరానికి సంవత్సరానికి కేవలం 12 రూపాయలకే ఈ లీజ్ ఇవ్వటం విశేషం. ఈ లీజ్ 1977 నుంచి అమల్లోకి వచ్చింది. 2007లో లీజ్ గడువు ముగిసింది. గడువు ముగిసిన వెంటనే ప్రభుత్వం దీనిని పొడిగించ లేదు. అత్యంత విలువైన ఈ స్థలాన్ని ప్రభుత్వ వైద్యశాలలకు కానీ, కార్యాలయాలకు కానీ వినియోగించాలనే ప్రతిపాదన కూడా వచ్చింది. దారూసలం ట్రస్ట్ ఆధ్వర్యంలోని డెక్కన్ మెడికల్ కాలేజీ, ఒవైసీ హాస్పటల్‌కు అనుబంధంగా ఈ స్థలంలో మరో వైద్యశాల ప్రారంభించటానికి తమకు లీజ్‌కు ఇవ్వాల్సిందిగా ఈ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీగా ఉన్న అక్బరుద్దీన్ ఒవైసీ అప్పటి ప్రభుత్వాన్ని కోరారు. దారూసలం ట్రస్ట్ ప్రారంబించిన దక్కన్ మెడికల్ కళాశాలకు అనుబంధంగా కంచన్‌బాగ్‌లో ఉన్న ఒవైసీ హాస్పిటల్, శాలిబండలోని ప్రిన్సెస్ ఈస్రా హాస్పిటల్ ద్వారా 1984 నుంచి పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నామని అక్బరుద్దీన్ ఒవైసీ ప్రభుత్వానికి తెలిపారు. 1,150 పడకల సామర్థ్యంతో నిర్వహిస్తున్న ఈ వైద్యశాలల ద్వారా చార్మినార్, బహదూర్‌పుర, చాంద్రాయణగుట్ట, యాకత్‌పుర, మలక్‌పేట నియోజకవర్గాల పరిధిలోని ప్రజలకు వైద్య సేవలు అందుతున్నాయని తన వితని పత్రంలో వివరించారు. మాసబ్ ట్యాంక్‌లోని స్థలం కూడా తమకు కేటాయిస్తే ఇక్కడ ప్రారంభించే వైద్యశాల ద్వారా నాంపల్లి, గోషామహల్, అంబర్‌పేట, ముషీరాబాద్, సికింద్రాబాద్, సనత్‌నగర్, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల ప్రజలకు కూడా వైద్య సేవలు



అందిస్తామని పేర్కొన్నారు.

మాసబ్ ట్యాంక్‌లోని స్థలం కావాలని ఒవైసీ కోరిన సమయంలోనే మహవీర్ ఆస్పత్రిపై కూడా ఆరోపణలు వచ్చాయి. ఈ ఆస్పత్రిలో ఉచిత వైద్యసేవలు అందించటం లేదని, వాణిజ్యపరంగా నిర్వహిస్తున్నారని, కొన్ని ముఖ్యమైన సేవలను అవుట్ సోర్సింగ్‌కు ఇచ్చారని పలువురు ప్రభుత్వ దృష్టికి తెచ్చారు. ఈ ఆరోపణలను మహవీర్ ట్రస్ట్ ఖండించినప్పటికీ స్థలం లీజ్‌ను పొడిగించటంలో ప్రభుత్వం జాప్యం చేసింది. దక్కన్ మెడికల్ కాలేజీ అనుబంధ వైద్యశాల కోసం ఈ స్థలాన్ని కేటాయించటానికి 2013లో ప్రతిపాదనలను కూడా అప్పటి ప్రభుత్వం సిద్ధం చేసింది. రాజకీయ కారణాలతో అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి ఈ ప్రతిపాదనను మంత్రివర్గ సమావేశంలో పెట్టకుండా దాటవేశారు. అటు మహవీర్‌కు కానీ దారూసలంకు కానీ స్థలం లీజ్‌కి ఇవ్వకపోవటంతో 2014 వరకూ సస్పెన్స్ కొనసాగింది.

షరతులతో మహవీర్‌కు లీజ్ కొనసాగింపు

రాష్ట్ర విభజన సందర్భంగా గవర్నర్ పాలన విధించిన తర్వాత రాష్ట్ర గవర్నర్ ఆదేశాలతో మహవీర్ హాస్పిటల్ లీజ్ గడువును 2014లో పొడిగించారు. ఈ మేరకు హైదరాబాద్ కలెక్టర్‌కు అధికారాలిస్తూ 2014 మే 23 న జీఓ ఎంఎస్ నంబర్ 230 ని రెవిన్యూ శాఖ జారీ చేసింది. మరో 30 సంవత్సరాలు లీజ్ పొడిగిస్తున్నట్టు ఆ జీఓలో పేర్కొన్నారు. మొదటి లీజ్ గడువు ముగిసిన 2007 సంవత్సరం నుంచీ కొత్త లీజ్ అమల్లోకి వస్తుందని ప్రభుత్వం తెలిపింది. ఎకరానికి ఎంత అద్దె చెల్లించాలో నిర్ణయించాల్సిందిగా హైదరాబాద్ కలెక్టర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. అయితే భూమి యాజమాన్య హక్కులు ప్రభుత్వం వద్దే ఉంటాయని, ప్రభుత్వానికి ఎప్పుడు అవసరమైతే అప్పుడు లీజ్ రద్దు చేస్తామని జీఓలో కొన్ని షరతులు విధించారు. తమ వైద్యశాల కోసం మహవీర్ స్థలం కావాలని కోరిన ఫైల్ పెండింగ్‌లో ఉన్నదని అక్బరుద్దీన్ ఒవైసీ రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి ఇటీవల తీసుకువెళ్లినట్టు తెలిసింది. దీనితో ఈ స్థలం లీజ్ ప్రతిపాదన మళ్ళీ తెరపైకి వచ్చింది.

నీలోఫర్ లేదా
ఎంఎన్‌జేకు ఇవ్వాలని మొదట ప్రతిపాదన

మహవీర్ వైద్యశాలకు కేటాయించిన మాసబ్‌ట్యాంక్‌లోని స్థలానికి సంబంధించిన లీజ్ రద్దు చేస్తే ఆ స్థలాన్ని నీలోఫర్‌కు కానీ ఎంఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్‌కు కానీ కేటాయించాలని వైద్య ఆరోగ్య శాఖ కూడా ప్రభుత్వాన్ని కోరింది. 500 పడకల సామర్థ్యం కలిగిన నీలోఫర్ వైద్యశాలను 1,000 నుంచి 1200 పడకలకు, 250 పడకల సామర్థ్యం కలిగిన ఎంఎన్‌జే హాస్పిటల్‌ను 800 నుంచి 1000 పడకలకు పెంచాలనే ప్రతిపాదన ఉన్నది. ఈ రెండు వైద్యశాలల్లో ఒకదానికి మాసబ్ ట్యాంక్‌లోని స్థలం కేటాయించాలనే ప్రతిపాదనను ప్రస్తుతానికి ప్రభుత్వం పక్కన పెట్టింది.

అవిశ్వాసతీర్మానాల చరిత్ర..

మొదటిపేజీ తరువాయి

- లాల్‌బహదూర్ శాస్త్రి,పి.వి.నరసింహారావుపై కూడా చేరో మూడు సార్లు అవిశ్వాస తీర్మానాలు
- అవిశ్వాసతీర్మానాల ప్రవేశంపెట్టడంలో సీపీఐ(ఎం)దే పై చేయి
- ఇందిరాగాంధీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సీపీఐ(ఎం) ఎంపీ జ్యోతి మౌర్య బసు 4 అవిశ్వాసతీర్మానాలు

అకాల వర్షంతో తడిసిన వేరుశెనగ

అధికారుల నిర్లక్ష్యమేనని రైతుల ఆందోళన

నవతెలంగాణ-కల్వకుర్తి

నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం మధ్యాహ్నం తరువాత కురిసిన అకాల వర్షానికి వేరుశెనగ పంట తడిసింది. వివిధ గ్రామాలకు చెందిన రైతులు వేరుశనగను అమ్మడానికి మార్కెట్‌కు రాగా అధికారులు వేలం నిర్వహించకపోవడంతో వర్షానికి పంట మొత్తం తడిసి ముద్దైంది. వ్యవసాయ మార్కెట్ అధికారులు రైతులు అడిగిన కవర్లు ఇవ్వక పోవడం వల్ల వేరుశెనగ పంట తడిసిపోయిందని రైతులు ఆందోళనకు దిగారు. అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తడిసిన వేరుశనగకు మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. న్యాయం చేస్తామని వ్యవసాయ శాఖ అధికారులు హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.

మీ అయ్య జాగిరా...

- మాజీ ఎమ్మెల్యేలమని ఆర్డర్ ఏది?
- తెలంగాణ భవన్ అధికారితో సంపత్ దురుసు ప్రవర్తన



నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

'మౌఖిక ఆదేశాలిస్తే ఎమ్మెల్యేలు మాజీ ఎమ్మెల్యేలైతరా.. మీ అయ్య జాగీరు అనుకుంటుండ్రు' అని తెలంగాణ భవన్ అధికారులపై ఇటీవల శాసనసభలో అనర్హత వేటుకు గురైన ఎమ్మెల్యే సంపత్‌కుమార్ దురుసు వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్లీనరీ సమావేశాలకు హాజరయ్యేందుకు కాంగ్రెస్ నేతలు శుక్రవారం ఢిల్లీకి వచ్చారు. అందులో ఇటీవల అసెంబ్లీలో అనర్హత వేటుకు గురైన సంపత్‌కుమార్‌తో పాటు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కూడా ఉన్నారు. అయితే పైనుంచి ఆదేశాలు రావడంతో ఇరువురుకి గదులు కేటాయించేందుకు అధికారులు నిరాకరించారు. దీనిపై సంపత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అసిస్టెంట్ కమిషనర్‌తో కొంత దురుసుగా మాట్లాడారు. తన ఎమ్మెల్యే ఐడీకార్డును రిసెప్షన్ బల్లపై విసిరేసి తాను ఎమ్మెల్యే కాదని నిరూపించాలని సవాల్ చేశారు. తన సభ్యత్వం రద్దు చేసిన ఉత్తర్వు కాపీలుఉంటే చూపాలన్నారు. ఈ సందర్భంగా 'మీ అయ్య జాగీరా. ఏం అనుకుం టున్నాడు మీ సీఎం అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రియల్ రహదారి రాజకీయం



భూములు కోల్పోనున్న రైతులు

మొదటిపేజీ తరువాయి


అని ముందుకెళితే...తీగలాగితే డొంక కదిలినట్టు ఓ మంత్రికి సన్నిహితంగా ఉండే ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారికి చెందిన ఓ వెంచర్‌కు వెళ్లేందుకు ఆ రోడ్డు వేస్తున్నట్టు తేలింది. ఈ కాంట్రాక్టు మరో మంత్రికి చెందిన సన్నిహితునికి చెందిన సంస్థకు దక్కింది. ఇందులో అధికారులు బాగానే ఉన్నారు. కాంట్రాక్టర్, రియల్ ఎస్టేట్ వ్యాపారీ లబ్దిపొందుతున్నారు. ఇక్కడ బలి అవుతున్నది మాత్రం రైతన్నే. ఈ తతంగమంతా ఔటర్ రింగ్‌రోడ్డుకు మూడు, నాలుగు కిలోమీటర్ల ఆవల ఉన్న సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం వెలిమల, ఈదుల నాగులపల్లి గ్రామాల్లో జరుగుతున్నది. ఈ రోడ్డు వెనుక అధికార పార్టీకి చెందిన పెద్దల హస్తమున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి ఈదుల నాగులపల్లి రైల్వే గేట్ వరకు 60 ఫీట్ల రోడ్డు వేసేందుకు ఆర్అండ్‌బీ అధికారులు నిర్ణయించారు. డీపీఆర్‌నూ తయారు చేశారు. తర్వాత స్థానిక రియల్ ఎస్టేట్ సంస్థ చక్రం తిప్పి రోడ్డు వెడల్పును 160 ఫీట్లకు పెంచినట్టు తేలింది. రూ.151.62కోట్లతో రోడ్డు వేసేందుకు రంగం సిద్ధమైంది. ఈ రోడ్డు వేయటం వల్ల 28 మంది రైతులు 50 నుంచి 70 ఎకరాలు కోల్పోనున్నారు. ఇంకా సర్వే జరుగుతున్నది. భూమి కోల్పోయే వారి సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఇక్కడ ఎకరా కోటి నుంచి మూడు కోట్ల రూపాయల వరకు పలుకుతున్నది. పైగా మూడు పంటలు పండే భూములు. రోడ్డు పనులు చేపట్టే భూమిలో దాదాపు ప్రతి రెండు వందల మీటర్లకు ఒక బోరు ఉన్న పరిస్థితి. అవన్నీ నీళ్లను పుష్కలంగా పోస్తున్నాయి. ఇందులో అరెకరం, పది గుంటల భూమి ఉన్న రైతులు రోడ్డు కోసం పూర్తిగా భూమిని కోల్పోతున్నారు. తమను బలిచేసి వేసే రోడ్డు ఎవరికోసమని రైతులు ప్రశ్నిస్తున్నారు.

మంత్రి సన్నిహితునికి కాంట్రాక్టు

ఆర్ అండ్‌బీ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సొంత జిల్లా ఖమ్మం నుంచి రాఘవ కన్‌స్ట్రక్షన్ అనే సంస్థ టెండర్లలో పనులను దక్కించుకుంది. కానీ, 'అపర్ణ మెటల్స్' అనే సంస్థ ఈ పనులు చేస్తున్నది. చివరకు ఆర్అండ్‌బీ అధికారులు చేయాల్సిన సర్వే పనులను సైతం 'అపర్ణ' సిబ్బందే చేస్తున్నారు. ఔటర్ రింగు రోడ్డును కలుపుతూ ఇప్పటికే రోడ్డు ఉన్నా రైతుల పొలాల్లో నుంచి 160ఫీట్ల రేడియల్ రోడ్డు వేయడానికి అసలు కారణం.. అపర్ణ మెటల్ సంస్థ వెంచర్ ఒకటి ఇక్కడ నుంచి పది కిలోమీటర్ల దూరంలోపు ఉండటమే. ఇప్పటికే ఆ సంస్థ ప్లాట్ల విక్రయ సమయంలోనూ కొనుగోలుదారులకు 'ఔటర్ రింగురోడ్డు నుంచి రేడియల్ రోడ్డు' సౌకర్యం హామీఇచ్చినట్టు తెలుస్తోంది. అందులో భాగంగానే ఈ రోడ్డు వేస్తున్నట్టు తెలుస్తున్నది. కేవలం అపర్ణ కన్‌స్ట్రక్షన్ కోరిక మేరకు ఏర్పాటు చేస్తున్న మూడున్నర కిలోమీటర్ల రోడ్డులో కిలోమీటర్ వరకు వంద ఫీట్ల వెడల్పుతో, నాలుగున్నర కిలోమీటర్లు 160 ఫీట్లతో రోడ్డు వేసేందుకు సదరు సంస్థ సర్వే రాళ్లను ఏర్పాటు చేసింది. రైల్వే గేటు అవతలి వైపు వేస్తున్న రోడ్డుకు ఇటీవలే రాష్ట్రమంత్రి కేటీఆర్ ప్రారంభోత్సవం చేశారు. మంత్రి కార్యక్రమానికి సంబంధించిన ఖర్చు మొత్తం అపర్ణ సంస్థనే భరించినట్టు సమాచారం.

మాతో ఎవరూ మాట్లాడలే..హద్దురాళ్లు మాత్రం పాతిరు


- దొబ్బలంకొండ అంజయ్య, రైతు, నాగులపల్లి



మేం నలుగురం అన్నదమ్ముళ్లం. మూడెకరాలలో ఆరు బోర్లు వేసుకొని వ్యవసాయం చేస్తున్నాం. భూమి ఇంకా పంచుకోలేదు. ఎకరం వరకు రోడ్డుకు పోతుందని చెబుతున్నారు. ఉన్న భూమి పోతే ఏం చేసుకుని బతకాలి. ఇప్పటివరకు ఒక్క అధికారి కూడా మాతో మాట్లాడనేలేదు. కానీ, వెంచర్ వాళ్లు వచ్చి మా భూముల్లో సర్వే రాళ్లు పాతారు.

పైసల్తోని ఏం జేస్కోవాలి? భూమి ఉంటే ఎల్లకాలం బతుకుతం

- మస్కూరి రాజు, నాగులపల్లి



మేం ఇద్దరన్నదమ్ముళ్లం. 30 గుంటల భూముంది. నా పాలుకొచ్చే 15 గుంటల భూమిని రోడ్డు కోసం తీసుకుంటున్నట్టు మార్కింగ్ చేశారు. అందులో బోరూ ఉంది. మొన్ననే ఆర్ఐ వచ్చి బోర్లు ఎన్నున్నాయో రాసుకొని పోయిండు. మార్కెట్ ప్రకారం డబ్బులిచ్చినా మేం ఏం చేసుకోలేం. పైసలు ఖర్చుయిపోతై. మా బతుకులు రోడ్డున పడుతయి. అదే భూమి ఉంటే దాన్ని నమ్ముకుని ఎల్లకాలం బతుకుతం. ఏదేమైనా భూమి ఇవ్వవద్దని నిర్ణయించుకున్నం.

సెన్సెక్స్ ▼510
33,176

నిఫ్టీ ▼125
10,195

డాలరుకు రూపాయి విలువ
64.94


బంగారం(10.గ్రా)
రూ. 30,117


వెండి (కేజీ)
రూ. 40,200


కోడిగుడ్లు

హైదరాబాద్	368	విజయవాడ	374
ఒక్కగుడ్డుకు	4.30	చెన్నై	397
వరంగల్	370	ముంబయి	410



మార్కెట్లలో 'అవిశ్వాసం'

- దేశ రాజకీయ సెగకు కుదేలైన 'స్టాక్స్
- 510 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్
- 10,200 పాయింట్ల దిగువనకు నిఫ్టీ
- వారాంతంలో భారీ నష్టాల్తో ముగింపు

ముంబయి: స్టాక్ మార్కెట్లు వారాంతంలో భారీ నష్టాలను మూటగట్టుకున్నాయి. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంతో తెలుగుదేశం పార్టీ(తెదేపా) తెగదెంపులు చేసుకొని కూటమి నుంచి వైదొలగడం అనంతరం ప్రభుత్వంపై తెదేపా అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించడంతో.. ఒక్కసారిగా దేశంలో రాజకీయ వేడి మొదలైంది. ఈ పరిణామాల ప్రభావం దేశీయంగా స్టాక్ మార్కెట్లపై పడింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి అందిన బలహీన సంకేతాలతో ఆరంభం నుంచే కుదేలవుతూ వస్తున్న సూచీలు.. రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో భారీ పతనం దిశగా సాగాయి. చివరన అమ్మకాల ఒత్తిడితో కుప్పకూలిన సూచీలు భారీనష్టాలను నమోదు చేశాయి.



ప్రారంభం నుంచి నష్టాల్లోనే..

అమెరికా ట్రేడ్‌వార్ భయాల నేపథ్యాన అంతర్జాతీయంగా అందిన సంకేతాలతో చమురు, లోహ, ఐటీ, బ్యాంకింగ్ రంగాల షేర్లు తీవ్ర అమ్మకాల ఒత్తిడి గురయ్యాయి. దీంతో శుక్రవారం ఉదయం నుంచే స్టాక్‌మార్కెట్లు నష్టాలలో మొదలయ్యాయి. 137 పాయింట్ల నష్టంతో 33,548 వద్ద ప్రారంభమైన బీఎస్ఈ సెన్సెక్స్ ఆ తర్వాత ఏ దశలోనూ కోలుకోలేకపోయింది. ఇక ఆ తరువాత తెదేపా అవిశ్వాస తీర్మానంపై దేశీయంగా రాజకీయ వేడి రగులుకోవడంతో సూచీలు మరింత పతనమయ్యాయి. ఒక దశలో 550 పాయింట్లకు పైగా కుంగిన సెన్సెక్స్ 33,120 పాయింట్ల కనిష్టస్థాయికి పడిపోయింది. చివరకు కాస్త కోలుకున్నా.. భారీ నష్టాలను మాత్రం తప్పించుకోలేకపోయింది. దీంతా వారాంతంలో మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 510 పాయింట్లు కోల్పోయి 33,176 వద్ద స్థిరపడింది. మరోవైపు ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ కూడా భారీగా కుదేలైంది. 50 పాయింట్ల నష్టంతో 10,300 మార్క్ వద్ద ఊగిసలాడుతూ ప్రారంభమైన నిఫ్టీ మదుపర్ల తీవ్ర అమ్మకాల ఒత్తిడి నేపథ్యంలో అంతకంతకూ పతనమైంది. ఒక దశలో 170 పాయింట్లకు పైగా నష్టంతో ట్రేడ్ అయిన సూచీ చివరకు 165 పాయింట్లు కోల్పోయి 10,195 వద్ద ముగిసింది. ట్రేడ్‌వార్ నేపథ్యంలో లోహ రంగపు షేర్లు కళ కోల్పోయాయి.. ఫలితంగా ఈ రంగపు సూచి దాదాపు 2 శాతం మేర పతనమైంది. ప్రధానంగా సెయిల్, వేదాంత, హింద్ కాపర్ షేర్లు ఎన్ఎస్ఈలో దాదాపు 3 నుంచి 5 శాతం నష్టాల్లో నడిచాయి.

పతనానికి ప్రధాన కారణాలివే..

* కేంద్ర ప్రభుత్వంలో మిత్రపక్షంగా ఉంటూ వచ్చిన తెదేపా ఒక్కసారిగా ఎన్డీఏ నుంచి వైదొలిగి, అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టడంతో దేశ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. దీనికి తోడు ఇటీవల వెలువడిన లోక్‌సభ ఉప ఎన్నికల ఫలితాల్లో కూడా బీజేపీకి భంగపాటు కలగడంతో.. ఇక రానున్న రోజుల్లో దేశంలో ఒకే పార్టీకి ప్రభుత్వం నడపగలిగేంత మెజార్టీ వచ్చే అవకాశాలు లేవన్న వార్తా విశ్లేషణలు కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి.

* అమెరికా మొదలుపెట్టిన వాణిజ్య యుద్ధం వల్ల దుష్ ప్రభావాలు మరింత పెరగనున్నాయంటూ అక్కడి వ్యాపార వర్గాల వారు ట్రంప్ సర్కారుకు మొరపెట్టుకున్న నేపథ్యం.. అమెరికా ట్రేడ్‌వార్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందోనన్న ఆందోళనలు ప్రపంచ మార్కెట్లను ప్రతికూల సంకేతాలను పంపాయి. దీంతో అమెరికా ఆసియా మార్కెట్లు రక్షణాత్మక ధోరణిలో ఊగిసలాడాయి.

* గత ఏడాది అనూహ్యంగా లాభాలను నమోదు చేసుకొంటూ సరికొత్త రికార్డులను నమోదు చేసిన దేశీయ మార్కెట్లలో మంచి రోజులు దాదాపు ముగిసినట్టేనని.. ఇకపై మార్కెట్లలో లాభాలను ఆర్జించడం గతంలో ఉన్నంత సులువు కాదన్న వార్తలు మదుపరుల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. దీంతో అధిక ధరల వద్ద స్టాక్స్‌ను అమ్మేందుకు మదుపరులు మొగ్గుచూపారు.

* మార్కెట్లను విశ్లేషిస్తూ రూపొందించే టెక్నికల్ చార్ట్‌లు కూడా ప్రతికూలతను సూచించడంతో.. మదుపరులు శుక్రవారం ఉదయం నుంచే అధిక ధరల వద్ద లాభాల స్వీకరణకు దిగడం కనిపించింది. ఈ అంశం కూడా మార్కెట్ పతనానికి ఆజ్యంపోసింది

మార్కెట్లోకి హోండా యాక్టివా 5జీ



న్యూఢిల్లీ: హోండా మోటార్ సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా సంస్థ అత్యాధునిక యాక్టివా స్కూటర్‌ను మార్కెట్లోకి తీసుకువచ్చింది. యాక్టివా వారసత్వాన్ని కొనసాగిస్తూ యాక్టివా 5జీ వాహనాన్ని మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. దీని ప్రామాణిక మోడల్ ధర రూ. 52,460 (ఎక్స్-షోరూమ్,ఢిల్లీ) గాను.. డీలక్స్ వెర్షన్ ధర రూ. 54,325(ఎక్స్-షోరూమ్,ఢిల్లీ)గా కంపెనీ నిర్ణయించింది. యాక్టివా 5జీ కొత్త అవతార్‌లో మార్పుల విషయానికి వస్తే.. ఎల్ఈడీ హెడ్ ల్యాంప్స్, ఇంటిగ్రేటెడ్ డేలైట్స్‌ను పొందుపర్చింది. డీలక్స్ వెర్షన్లో కొత్త డిజిటల్ అనలాగ్ మీటర్, 3డీ ఎంబ్లమ్‌ను జోడించింది. 110 సీసీ నాలుగు-స్ట్రోక్ ఇంజిన్, 8 బీహెచ్‌పీ పవర్, 9ఎన్ఎం టార్క్‌తో ఈ వాహనం గంటకు గరిష్టంగా 83 కి.మీ వేగంతో పరుగులు తీయనుంది.

రూ.2000 నోట్లను రద్దు చేయం!



న్యూఢిల్లీ: పెద్దనోట్ల రద్దు నేపథ్యంలో ఆర్‌బీఐ కొత్తగా చలామణిలోకి తెచ్చిన రూ.2000 నోటును రద్దు చేసే ఆలోచనేది తమకు లేదని సర్కారు శుక్రవారం వెల్లడించింది. నల్లధనాన్ని నిరోధించే క్రమంలో పాత రూ.500, రూ.వెయ్యి నోట్లను రద్దు చేసినట్టుగానే.. సమీప భవిష్యత్తులో రూ.2 వేల నోటును కూడా రద్దు చేస్తారంటూ ప్రచారం జరుగుతోన్న నేపథ్యంలో ఆర్థికశాఖ లోక్‌సభలో దీనికి సంబంధించిన క్లారిటీ ఇచ్చింది. రూ.2000 నోట్లను రద్దు చేసే ఉద్దేశమేదీ సర్కారుకు లేదని ఆర్థిక శాఖ సహాయ మంత్రి రాధాకృష్ణన్ లోక్‌సభలో ఒక ప్రశ్నకిచ్చిన లిఖిత పూర్వక సమాధానంలో తెలిపారు. మరోవైపు త్వరలోనే దేశంలోని అయిదు నగరాల్లో రూ.10 ప్లాస్టిక్ నోట్లను ప్రయోగాత్మకంగా తీసుకువచ్చే ప్రయత్నాలు కొనసాగిస్తున్నట్టుగా ఆయన మరో ప్రశ్నకు సమాధానంగా తెలిపారు.

నేడు బ్యాంక్ ఆడిట్‌పై సెమినార్

నవతెలంగాణ, వాణిజ్య విభాగం: దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్న బ్యాంకింగ్ రంగంలో రుణ మోసాలు అంతకంతకు పెరుగుతోన్న వేళ.. బ్యాంకింగ్ ఆడిట్‌పై బాధ్యత మరింతగా పెరుగుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో ఛార్టర్డ్ అకౌంటెట్లకు బ్యాంకింగ్ ఆడిట్‌పై మరింత విషయ పరిజ్ఞానాన్ని కల్పించేందుకు గాను 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెట్స్ ఆఫ్ ఇండియా' (ఐసీఏఐ) సంస్థ ఎస్ఐఆర్‌సీ హైదరాబాద్ శాఖ శనివారం (17న) ఒక సెమినార్ నిర్వహించనుంది. గ్రీన్‌లాండ్స్‌లోని మ్యారీగోల్డ్ హోటల్‌లో శనివారం ఈ సెమినార్ ఉంటుందని ఎస్ఐఆర్‌సీ హైదరాబాద్ శాఖ చైర్మెన్ మండవ సునిల్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమ ప్రారంభోత్సవానికి నగర మేయర్ బొంతు రామ్మోహన్‌తో పాటు ఐసీఏఐ మాజీ అధ్యక్షుడు దేవరాజ్ రెడ్డి పాల్గొననున్నట్టుగా ఆయన వివరించారు.

ఆరోగ్యవంతమైన జాతిని నిర్మిద్దాం..!



నవతెలంగాణ, వాణిజ్య విభాగం: టెక్నాలజీ ఎంతగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ.. అది మానవుడి ప్రత్యామ్నాయ స్థాయికి చేరలేదని తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ అన్నారు. శుక్రవారం సీఐఐ తెలంగాణ వార్షికోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన 'రీ ఇమాజినింగ్ అండ్ బిల్డింగ్ తెలంగాణ' అనే అంశంపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఆరోగ్యవంతమైన, సుసంపన్నమైన జాతిని నిర్మించేందుకు గాను పరిశ్రమ వర్గాలు, ప్రభుత్వం కలిసి పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని నరసింహన్ అభిప్రాయపడ్డారు. దేశ ఆర్థికాభివృద్ధిలో పరిశ్రమలు కీలక పాత్ర పోషిస్తున్నాయని.. ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నట్టుగా ఆయన తెలిపారు. నాణ్యమైన విద్య, అందరికీ అందుబాటులో ఉండేలా వైద్యం అందించే విషయంలో పరిశ్రమలు ప్రభుత్వంతో కలిసి రావాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.కె.జోషి మాట్లాడుతూ తెలంగాణ సర్వతోముఖాభివృద్ధికిగాను ప్రభుత్వ ప్రయివేట భాగస్వామ్యానికి గల అవకాశాలపై పరిశ్రమ వార్గలతో చర్చించేందుకు సర్కారు సిద్ధంగా ఉందని అన్నారు. గత కొంత కాలంగా సీఐఐ అందించిన తోడ్పాటును ఆయన ఈ సందర్భంగా ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సీఐఐ తెలంగాణ చైర్మెన్ వి. రాజన్న మాట్లాడుతూ గడిచిన ఏడాది కాలంలో సీఐఐ రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పలు కార్యక్రమాలను చేపట్టిందని అన్నారు. సర్కారు విధానపరమైన నిర్ణయాలతో పాటు స్కిల్ డెవలప్‌మెంట్, పెట్టుడుల ప్రోత్సహించడం, బ్రాండ్ తెలంగాణకు ప్రాచుర్యం కల్పించడం, ద్వితీయ శ్రేణి నగరాలకు ఆర్థికాభివృద్ధిని విస్తరింపజేయడంలో సర్కారుకు సీఐఐ దన్నుగా నిలుస్తూ వచ్చిందని వివరించారు.

జియో 5జీకి సిద్ధమవుతోంది..



ముంబయి: దేశీయ టెలికాం రంగంలో సంచలనంగా నిలుస్తున్న రిలయన్స్ జియా తన కూతురిచ్చిన ఐడియాకు కార్యరూపమని రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేశ్ అంబానీ వెల్లడించారు. గురువారం రిలయన్స్ సంస్థ 'డ్రైవర్స్ ఆఫ్ ఛేంజ్' అవార్డు అందుకుంది. ఈ కార్యక్రమానికి ముఖేశ్ తన కుటుంబ సభ్యులతో సహా కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..'జియో ఐడియా నా కూతురు ఇషాది. 2011లో దీని గురించి ఇషా నాకు వివరించింది. ఆ సమయంలో ఇషా సెలవుల నిమిత్తం అమెరికా నుంచి భారత్‌కు వచ్చింది. ఓ రోజు ఇంట్లో తన కోర్సుకు సంబంధించిన వర్క్ చేసుకుంటోంది. అప్పుడు 'డాడీ మన ఇంట్లో నెట్ అస్సలు బాలేదు' అంది. భవిష్యత్తులో ప్రపంచం డిజిటల్ టెక్నాలజీతోనే నడుస్తుందని ఇషా, ఆకాశ్ నాకు చెప్పారు. అలా వారి ఆలోచనల నుంచే ఈ జియో పుట్టుకొచ్చింది. జియోను 2016 సెప్టెంబర్‌లో ప్రవేశపెట్టాను. ఇప్పుడు భారతదేశంలో జియో గేమ్ ఛేంజర్‌గా మారింది. దేశ వ్యాప్తంగా 2జీ నెట్‌వర్క్‌ను ఏర్పాటుచేయడానికి భారతీయ టెలికాం రంగానికి 25 ఏళ్లు పట్టింది. కానీ 4జీ ఎల్‌టీఈ నెట్‌వర్క్‌ను రూపొందించడానికి జియోకి కేవలం మూడేండ్లే పట్టింది. 5జీ కూడా సిద్ధమవుతోంది.' అని ముఖేశ్ వెల్లడించారు.



కలెక్టరేట్ల ఎదుట అంగన్‌వాడీల ధర్నాలు

నవతెలంగాణ-యంత్రాంగం

కనీస వేతనాలు అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, తమపై రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ల ఎదుట శుక్రవారం ధర్నాలు నిర్వహించారు. సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో జిల్లా ప్రధాన కార్యదర్శి కె. రాజయ్య మాట్లాడుతూ..ఉద్యోగ భద్రత, ఐసీడీఎస్ పరిరక్షణ సమస్యలన్నీ వెంటనే పరిష్కరించాలన్నారు. మెదక్, సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. మెదక్‌లో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏ మల్లేశం, సిద్దిపేటలో అంగన్‌వాడీ టీచర్స్ అండ్ వెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పద్మ పాల్గొన్నారు. అంగన్‌వాడీలకిచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వారిని ప్రభుత్వఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తానుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కురుమూర్తి మద్దతు తెలిపి మాట్లాడారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో అంగన్‌వాడీలు ధర్నా చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు మాట్లాడారు. వనపర్తి ధర్నాచౌక్‌లో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పుట్టాఆంజనేయులు, జిల్లా కార్యదర్శి శారద ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు ధర్నా చేపట్టారు. గద్వాల జిల్లా కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏమలమ్మ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ప్రదర్శన నిర్వహించారు.

స్పందించకుంటే నిరవధిక సమ్మె

- రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగిన సమ్మె
- రోడ్లపై వంటావార్పు

మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ



నవతెలంగాణ- విలేకరులు

మున్సిపల్ కార్మికుల వేతనాల పెంపుపై ప్రభుత్వం ఇకనైనా స్పందించకపోతే నిరవధిక సమ్మె చేస్తామని మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ చైర్మెన్ పాలడుగు భాస్కర్ అన్నారు. సమ్మె రెండోరోజైన శుక్రవారమూ కొనసాగింది. కొన్నిచోట్ల రోడ్లపై వంటావార్పు చేశారు.

కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికుల దీక్షాశిబిరంలో పాలడుగు భాస్కర్ మాట్లాడారు. మూడేండ్లుగా వేతనాల కోసం పోరాడుతున్నామని తెలిపారు. జీవో నెం.14 ప్రకారం జీతాలు పెంచాలని, మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల పోరాటం న్యాయమైందని నగర మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ అన్నారు. దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కార్మికులు ర్యాలీ నిర్వహించారు. వేములవాడ నగరపంచాయతీ కార్మికుల సమ్మెకు కాంగ్రెస్ నాయకులు సంఘీభావం తెలిపారు.

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. మున్సిపాల్ ఐక్యకార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో కామారెడ్డిలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం చేపట్టారు. బోధన్, బాన్సువాడలోనూ సమ్మె కొనసాగింది.

పెద్దపల్లి జిల్లాలో మున్సిపల్ కార్మికులు రెండోరోజూ విధులు బహిష్కరించారు. రామగుండం మున్సిపల్ కార్యాలయం ఎదుట కండ్లకు నల్లగుడ్డలు కట్టుకుని ధర్నా చేశారు.

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నగర పంచాయతీ కార్యాలయం ఎదుట, షాద్‌నగర్‌లో సమ్మె దీక్షలు కొనసాగాయి.

సిద్దిపేట, హుస్నాబాద్‌లోనూ పాలడుగు భాస్కర్ దీక్షలకు సంఘీభావం తెలిపారు. మెదక్‌లో వంటావార్పు నిర్వహించారు. దుబ్బాక, గజ్వేల్‌లో సమ్మె కొనసాగింది. సంగారెడ్డిలో కార్మికులు మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. సదాశివపేటలో వంటావార్పు చేశారు.

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో మున్సిపల్ కార్మికుల దీక్ష రెండోరోజూ కొనసాగింది. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాయింకటి రాందాస్, బీజేపీ జిల్లా అధ్యక్షులు పద్మజారెడ్డి మద్దతు తెలిపారు. నాగర్‌కర్నూల్, గద్వాలలో సమ్మె కొనసాగింది. గద్వాలలో మున్సిపల్ కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఖమర్‌అలీ పాల్గొన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలోకార్మికులు మోకాళ్లపై నిల్చొని సమ్మె చేపట్టారు.

ఖమ్మం కలెక్టరేట్ ఎదుట రోడ్డుపైనే కార్మికులు భోజనం చేశారు. నల్లగొండ, మిర్యాలగూడ మున్సిపాలిటీ కార్యాలయాల ఎదుట చేపట్టిన సమ్మె జరిగింది.

హైదరాబాద్‌లోని బోడుప్పల్, ఫీర్జాదిగూడ మున్సిపల్ కార్యాలయాల ఎదుట కార్మికుల సమ్మె కొనసాగింది.

సీపీఎస్‌ను రద్దు చేయాల్సిందే...

- రాష్ట్ర ప్రభుత్వానికే అధికారముందని ఆధారాలు చూపుతాం: సీఎంకు టీఎస్‌సీపీఎస్ఈయూ విజ్ఞప్తి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంట్రిబ్యూటరీ పింఛన్ స్కీం (సీపీఎస్)ను రద్దు చేయాల్సిందేనని తెలంగాణ స్టేట్ కాంట్రిబ్యూటరీ పింఛన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్‌సీపీఎస్ఈయూ) కోరింది. సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పింఛన్ విధానాన్ని వర్తింపచేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికే ఉందని స్పష్టం చేసింది. ముఖ్యమంత్రి కేసీఆర్ అనుమతి ఇస్తే రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న అధికారాలను ఆధారాలతో సహా చూపిస్తామని తెలిపింది. ఈ మేరకు టీఎస్‌సీపీఎస్ ఈయూ అధ్యక్షుడు జి స్థితప్రజ్ఞ, ప్రధాన కార్యదర్శి కె శ్రీకాంత్ శుక్రవారం సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. సీపీఎస్ రద్దు అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదని, కేంద్రానికే ఉందని బుధవారం అసెంబ్లీలో కేసీఆర్ ప్రకటించారని ఓ ప్రకటనలో తెలిపారు. కొందరు అధికారులు, కొన్ని సంప్రదాయ సంఘాల నాయకులు సీఎంను తప్పుదోవ పట్టించారని పేర్కొన్నారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత రాష్ట్ర ప్రభుత్వం న్యూ పింఛన్ స్కీం (ఎన్‌పీఎస్) ట్రస్టుతో ఒప్పందం కుదుర్చుకుందని తెలిపారు. ఆ తర్వాతే తెలంగాణ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సీపీఎస్ విధానాన్ని వర్తింపచేశామని 2014, ఆగస్టు 23న జీవో నెంబర్ 28 విడుదల చేశారని పేర్కొన్నారు. సీపీఎస్ నుంచి బయటికి వచ్చే అవకాశమున్నా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన విధానాన్ని తెలంగాణ ప్రభుత్వం అమలు చేసిందని తెలిపారు. పశ్చిమబెంగాల్, త్రిపుర ప్రభుత్వాలు మినహా మిగిలిన రాష్ట్ర ప్రభుత్వాలన్నీ స్వచ్ఛందంగా సీపీఎస్‌ను అమలు చేసేందుకు అంగీకరించాయని సమాచార హక్కు చట్టం ద్వారా కేంద్ర ప్రభుత్వం వెల్లడించిందని పేర్కొన్నారు. సీపీఎస్‌ను అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు ఇష్టం లేకపోతే బయటికి వెళ్లే అధికారమూ ఉందని కేంద్రం స్పష్టం చేసిందని తెలిపారు. సీపీఎస్‌ను తప్పనిసరిగా అమలు చేయాలన్న నిబంధన ఏమీ లేదని పేర్కొన్నారు. సీపీఎస్ అంశం రాష్ట్ర పరిధిలోని తప్ప కేంద్రం పరిధిలోనిది కాదని తెలిపారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి కేసీఆర్ సీపీఎస్‌ను రద్దుచేసేందుకు నిర్ణయం తీసుకోవాలని కోరారు. పాత పింఛన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని విజ్ఞప్తిచేశారు. షేర్‌మార్కెట్‌లో పెడుతున్న ఉద్యోగుల పింఛన్ సొమ్ము వేల కోట్ల రూపాయలు ప్రభుత్వానికే ప్రయోజనం కలిగిస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అపాయింట్‌మెంట్ ఇస్తే పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తామని, రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న అధికారాలను వివరిస్తామని పేర్కొన్నారు.

ఆహార భద్రతకు 'ఆధార్' అడ్డంకి

- 14 రాష్ట్రాల్లో ఆధార్ పేరుతో రేషన్ కార్డుల తొలగింపు
- సామాజిక పింఛన్లు, ఉపాధి హామీకి దూరమవుతున్న పేదలు



న్యూఢిల్లీ : రేషన్ సరుకులు తీసుకోవాలన్నా, వృద్ధాప్య పింఛను, ఉపాధి హామీ... అందుకోవాలన్నా ఆధార్ తప్పనిసరి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుజేస్తున్న ఈ నిబంధన కారణంగా దేశవ్యాప్తంగా లక్షలాది మంది పేదలు, మధ్యతరగతివారు, వృద్ధులు, వితంతువులు, వికలాంగులు...సంక్షేమ ఫలాల్ని అందుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఆధార్ గుర్తింపు లేదన్న కారణంతో పాఠశాల పిల్లలకు అన్నం పెట్టకుండా కడుపుమాడుస్తోంది. దేశంలో ఆకలి చావులు ఉండరాదన్న సదుద్దేశంతో తీసుకొచ్చిన సామాజిక పథకాలకు 'ఆధార్' పెద్ద అడ్డంకిగా మారింది. ఆధార్ పేరుతో వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలు ఉపాధి హామీ, ఆహార భద్రత వంటివాటిని నీరుగారుస్తున్నాయి. దేశరాజధాని ఢిల్లీలో రెండు రోజుల క్రితం 'గాంధీ పీస్ ఫౌండేషన్' వారు నిర్వహించిన ప్రజా దర్బారు కార్యక్రమంలో పై విషయాలు బయటపడ్డాయి. ఈ వేదికమీద వ్యక్తమైన అభిప్రాయాలు ఇలా ఉన్నాయి...

ఆహార భద్రత, ఉపాధి కల్పన, సామాజిక పింఛన్లు...వంటివి 'ఆధార్' గుర్తింపు లేదన్న కారణంగా పేద ప్రజలు తిరస్కారానికి గురవుతున్నారు. అన్నింటినీ ఆధార్‌తో ముడిపెట్టడమే ఈ పరిస్థితికి కారణమని అనేక మంది తమ గోడు వెల్లబోసుకున్నారు. ముఖ్యంగా సామాజిక సంక్షేమ పథకాలకు ఆధార్ తప్పనిసరి చేసి, ఎంతోమందిని అనర్హులుగా ప్రకటించటం చేస్తున్నారు. గ్రామాల్లో సామాజిక పథకాల అమలు సరిగా లేక ఆకలితో చనిపోవటమూ జరుగుతోంది.

ఒడిశాలోని కోరాపూట్ గ్రామ సర్పంచి దేబాశిష్ మాట్లాడుతూ..."ఆధార్ అనుసంధానం లేదన్న కారణంగా మా గ్రామంలోని ఎన్నో రేషన్ కార్డులను తొలగించారు. మా గ్రామంలో 1393 కుటుంబాలుంటే, అందులో 175 కుటుంబాలకు రేషన్ కార్డు తొలగించారు. ప్రసవించిన మహిళకు నగదుసాయమంటూ రాష్ట్ర ప్రభుత్వం అమలు జేస్తున్న పథకానికి కూడా ఆధార్ పెద్ద అడ్డంకిగా మారింది. రేషన్ కార్డుల్ని తొలగించి... ఎంతో మంది ఆకలి చావులకు సైతం 'ఆధార్' కారణమైంది" అని చెప్పారు. ఐరిష్ స్కానింగ్ యంత్రాలు సరిగాలేక ఎంతోమందికి 'ఆధార్' గుర్తింపు దక్కలేదని, దీనివల్ల అనేకమంది రేషన్ సరుకులు అందటం లేదని ఢిల్లీకి చెందిన రామా అనే మహిళ ప్రజా దర్బారులో చెప్పారు. ఆధార్ లేదన్న కారణంగా సామాజిక పింఛన్లకు దూరమైన వారు ఎంతోమంది ఉన్నారని పలువురు వెల్లడించారు. ఉపాధికి సైతం దూరమయ్యామని పెద్ద సంఖ్యలో ఆందోళన వ్యక్తం చేశారు.

గుట్టుగా గ్లైసిల్ పత్తి విత్తనాల రవాణా

- లారీ సహా 51.5 క్వింటాళ్లు స్వాధీనం
- ముగ్గురు అరెస్టు



నవతెలంగాణ- తాండూర్

ఉప్పుబస్తాల మధ్య గుట్టుగా నాసిరకం పత్తి విత్తనాలు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మంచిర్యాల జిల్లా తాండూర్ సర్కిల్ ఆఫీసులో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో రామగుండం సీపీ విక్రమ్‌జిత్‌దుగ్గల్ వివరాలు వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం తాండూరులోని రేపల్లెవాడ వద్ద స్థానిక ఎస్ఐ రవి ఉప్పు బస్తాలను తరలిస్తున్న లారీని అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. 51.5 క్వింటాళ్ల గ్లైసిల్ పత్తి విత్తనాలను ఉప్పుబస్తాల మధ్య గుర్తించారు. వాటి విలువ రూ.1కోటి 6 లక్షలా 37వేల 340 ఉంటుందని బెల్లంపల్లి అగ్రికల్చర్ ఏడీ సురేఖ తెలిపారు. లారీ డ్రైవర్ మారుబోయిన క్రిష్ణారెడ్డి, కాకాని సత్యనారాయణ, జిల్లా రాఘవులను విచారించగా కర్నూలులోని ఎమ్మిగనూరుకు చెందిన వ్యాపారులు మద్దెల సాంబారెడ్డి, బుజ్జిలు 'కావ్య సీడ్స్' బ్రాండ్ పేరుతో నాసిరకం విత్తనాలను తెలంగాణ, మహారాష్ట్రకు సరఫరా చేస్తున్నట్టు తెలిపారు. లారీలో 15టన్నుల ఉప్పును మహారాష్ట్రకు తరలిస్తున్నట్టు నకిలీ వే బిల్లు తీసుకుని ఉప్పు బస్తాల కింద గ్లైసిల్ విత్తనాలను కనిపించకుండా లోడ్‌చేశారు. వాటిని ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్, దహెగాంతోపాటు సరిహద్దు రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లోని అమాయక రైతులకు అంటగడుతున్నట్టు విచారణలో వెల్లడైందని సీపీ దుగ్గల్ వివరించారు. పట్టుకున్న సీడ్స్ ప్యాకెట్లపై హైదరాబాద్ లో మానుఫ్యాక్చర్ అయినట్టు ముద్రించి ఉండటంతో ప్రత్యేక బృందాన్ని రాజధానికి పంపించి విచారణ చేస్తామన్నారు. తనిఖీల్లో పాల్గొన్న కానిస్టేబుళ్లు జంపాల రమేష్, తిరుపతి, పురుషోత్తం, నెహ్రూ, హెడ్ కానిస్టేబుల్ హఫీజ్, ఎస్ఐ రవి, సీఐ జనార్ధన్‌రెడ్డిలను సీపీ అభినందించారు. ప్రెస్‌మీట్‌లో డీసీపీ వేణుగోపాల్, ఏసీపీ బాలుజాదవ్, మాదారం ఎస్ఐ రాములు, అదనపు ఎస్ఐ కొమురయ్య, ఏఎస్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

టెక్‌ప్లస్
నవతెలంగాణ

సెన్సార్ గాడ్జెట్లకు స్వాగతం...

టీవీ ఛానల్ మార్చాలంటే రిమోట్ కోసం వెతకాలి. లైట్ ఆన్ చేయాలంటే స్విచ్ కోసం వెతకాలి. కంప్యూటర్‌లో టైప్ చేయాలంటే కీబోర్డు వచ్చి ఉండాలి. ఇదంతా ప్రస్తుతం ఉన్న ట్రెండ్. దీనికి అప్ డేట్‌గా ఇన్‌టర్నెట్ ఆఫ్ థింగ్స్ వచ్చాయి. అప్పుడప్పుడూ సినిమాల్లో చూస్తూ ఉంటాం గదిలోకి వెళ్లగానే లైట్ ఆన్ అవడం. అటోమెటిక్‌గా డోర్లు తెర్చుకోవడం. ఇంతేనా ? ఇంకా ఈజీగా మన డివైజ్‌లను కంట్రోల్ చేయలేమా..? మీరెప్పుడైనా అనుకున్నారా కనుసైగలతో లైట్లు ఆన్ ఆఫ్ చేయొచ్చని, చేతి సంజ్ఞలతో కంప్యూటర్‌లో టైప్ చేయొచ్చని. సంజ్ఞలతో టీవీ ఛానల్ మార్చవచ్చు అని. అవును నిజమే.. సెన్సార్ గాడ్జెట్స్‌తో అది సాధ్యమవుతోంది. ప్రస్తుతం అలాంటి గాడ్జెట్స్ మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. వెల్ డెవెలప్‌డ్ కంట్రీస్‌లో వీటిని ఎక్కువ వాడుతున్నారు. సో మనం కూడా వాటికి వెల్‌కం చెబూతూ ఈ సన్సార్ గాడ్జెట్‌ల సంగతి ఏంటో తెలుసుకుందామా ?



షియోమి కొత్త ఫోన్

1



Singlecue: రిమోట్ లేకుండా టీవీని ఆక్సెస్ చేయొచ్చు. చేతి సంజ్ఞలతో ఛానల్ మార్చడం, వాల్యుమ్ అడ్జస్ట్ చేయటటం ఈ గాడ్జెట్ పని. టీవీ, డీవీడీ, సెటాప్‌బాక్స్, స్మార్ట్ హోం గాడ్జెట్లనూ దీంతో కంట్రోల్ చేయొచ్చు. ఐఆర్ రిమోట్ కంట్రోల్ డివైజ్‌లకు. వైఫై ఉన్న డివైజ్‌లకు ఇది సపోర్ట్ చేస్తుంది. దీనితో ఒకే సారీ మల్టిపుల్ డివైజ్‌లను వేలి సైగలతోనియంత్రించవచ్చు. https://goo.gl/QHkZXo

2

Ring ZERO S : స్మార్ట్ ఫోన్ స్క్రీన్ టచ్ చేయకుండానే ఆపరేట్ చేయలనుకుంటే Ring ZERO S తో సాధ్యమే. 12 గంటలు ఆక్టీవ్ మోడ్ లో ఉంటుంది. 3 రోజుల బ్యాటరీ బ్యాకప్ వస్తుంది. అచ్చం రింగ్‌లాగే దీన్ని చేతి వేళికి తొడుక్కోవాలి. బ్లూటూత్ ఉన్న ఏ స్మార్ట్ ఫోన్‌ను అయినా ఆపరేట్ చేయవచ్చు. ఆప్స్ ఓపెన్ చేయడానిక, మెసెజ్ రాయడానికి ఈ హై స్మార్ట్ గాడ్జెట్ బాగా పనిచేస్తుంది. https://goo.gl/jbC48M

3

జెస్ట్ సెన్సార్ కీబోర్డ్

కంప్యూటర్ ఆపరేట్ చేయాలంటే కీబోర్డు తప్పనిసరి, మౌస్ లేకపోతే పనవ్వదు. ఇప్పుడు వాటితో పని లేదంటోంది. జెస్ట్ సెన్సార్ కీ బోర్డు. ఈ కీ బోర్డు ఉంటే.. మనం గాల్లో టైప్‌చేసిన కంప్యూటర్‌లో అక్షరాలుగా మారిపోతాయి. నాలుగు వేళ్లకు తగిలించుకునే రింగ్‌లు, అరచేతిపై అమర్చుకుని పట్టీలతో కూడిన జెస్ట్‌లో యాక్సెలరోమీటర్లు, గైరో స్కోపులు, మాగ్నెటో మీటర్లు ఇలా బోలెడు సెన్సార్ ఆబ్జెక్ట్‌లు ఉన్నాయి. మన వేలి కదలికలను బట్టి అక్షరాలను అంచనా వేసి స్క్రీన్‌పై చూపుతాయి. స్మార్ట్ ఫోన్లో మాదిరిగా ప్రిడిక్టివ్ టెక్ట్స్ టెక్నాలజీని ఉపయోగించుకుంటాయి. జెస్ట్ ఎక్స్‌బాక్స్ కైనిక్ట్ లేదా లీప్ మోషన్ మాదిరిగా పూర్తిగా వేలి కదలికలపై మాత్రమే ఆధార పడదు. మౌస్ బటన్‌ను డబుల్ క్లిక్ చేసినట్టు, లేదా కీబోర్డ్ షార్టకట్‌ల తీరులో ఒక బటన్ ప్రెస్ చేసినప్పుడు నిర్దిష్టమైన పని జరిగేట్టు కూడా పని చేస్తుంది. బ్లూటూత్ ఉన్న ఏ డివైజ్‌కైనా జెస్ట్ కనెక్ట్ అవుతుంది ఈ కీబోర్డ్ ఎలా పని చేస్తుందో చూడాలంటే క్లిక్ చేయండి : https://goo.gl/ZaWtH8

4



Myo armband: దీన్ని మోచేతికి ధరించాల్సి ఉంటుంది. దీని ద్వారా మ్యూజిక్స్, వీడియో గేమ్స్, ప్రసెంటేషన్స్, వీజువల్ ఎంట ర్టైన్‌మెంట్స్ అన్నిటినీ కంట్రోల్ చేయ వచ్చు. ప్రజెంటేషన్ ఇచ్చేటప్పుడు రిమోట్‌తో పని ఉండదు. దీన్ని దరించి హ్యాండ్ మూమెంట్స్ ఇస్తే చాలు తెరమీద ఆక్సెస్ అవుద్ది. వీడియో గేమ్స్ ఆడేట ప్పుడు రిమోట్ లేకుండానే ప్లేయర్‌ను కంట్రోల్ చేయ వచ్చు. ప్రధానంగా డ్రోన్‌ను కూడా ఇది ఆపరేట్ చేస్తుంది. హ్యాండ్ మూవ్‌మెంట్స్‌ని రిసీవ్ చేసుకుని డ్రోన్ మూవ్ అవుతుంది. థల్మిక్ ల్యాబ్స్ అనే కంపెనీ దీన్ని తయారు చేసింది. https://goo.gl/zBd8iA

- వినో

ఒకే రింగ్‌టోన్‌తో బోర్ కొడుతోందా...?

రింగ్‌టోన్స్ పెట్టుకోవటంలో ఒక్కొక్కరిది ఒక్కో స్టయిల్. ఒకే రింగ్‌లోన్‌ని ఎక్కువ కాలం ఉంచడం, లేదా రోజుకో రింగ్ టోన్ కొత్తది పెట్టుకోవటం లేదా అసలు రింగ్‌టోనే పెట్టుకోకుండా ఉండటం... ఒకే రింగ్‌టోన్‌ను వినీ వినీ బోర్‌గా ఫీల్ అయ్యే వారు. కొత్త కొత్త రింగ్‌టోన్లను పెట్టుకోవాలనుకుంటారు. అయితే ప్రతి సారి టోన్ మార్చటం కొంచెం కష్టమే. అదే ఒకే రోజు రెండు మూడు రింగ్‌టోన్‌లు పెట్టుకోవాలని అనుకునే వారికి అయితే ఇంకా కష్టమే.. ఫ్యామిలీతో ఉన్నప్పుడు ఒక టోన్, ఆఫీస్‌లో ఉన్నపుడు ఒక టోన్, బాస్‌తో ఉన్నపుడు మరో టోన్ ఇలా వేరియేషన్స్ కోరుకునే వారు ఉంటారు. కాదా.. వారి కోసం Random Ringtone manager App అందుబాటులో ఉంది. ఈ ఆప్ ఇన్స్టాల్ చేసుకుంటే మనకు నచ్చిన పాటలను రాన్‌డమ్‌గా రింగ్‌టోన్స్‌గా సెట్ చేసుకోవచ్చు. ఒకే రోజు ఒకటికి మించి రింగర్లు పెట్టుకోవాలనుకునే వారికి ఇది ఉపయోగపడుతుంది. ఆండ్రాయిడ్ స్మార్ట్ ఫోన్లు వాడుతున్న వారికి గూగుల్ ప్లే స్టోర్‌లో అందుబాటులో ఉంది.



డియర్ రీడర్స్..

మీకు తెలిసిన టెక్నాలజీ ఇన్ఫర్మేషన్ ఇతరులతో షేర్ చేసుకోవాలనుకుంటున్నారా ? మార్కెట్‌లోకి వస్తున్న కొత్త కొత్త గాడ్జెట్స్, మొబైల్స్, స్మార్ట్ ఐటెమ్స్ గురించి ఇతరులకు తెలియజేయాలనుకుంటున్నారా..? టెక్నాలజీ పరంగా ఏదైనా సమస్య వచ్చినప్పుడు ఎలా పరిష్కరించారో అందరితో పంచుకోవాలనుకుంటున్నారా ? అయితే మాకు పంపండి.

మాచిరునామా : 'టెక్‌ప్లస్' పేజీ, నవతెలంగాణ దినపత్రిక, ఎంహెచ్ భవన్, ఫ్లాట్ నెం. 21/1, ఆజమాబాద్, ఆర్.టి.సి కల్యాణ మండపం వీధి, హైదరాబాద్ - 500020.
tech.nava11@ gmail.com,
వాట్సాప్ నెం: 07660066469

షియోమి కొత్త ఫోన్

షియోమీ నుంచి కొత్తగా ఇండియా మొబైల్ మార్కుట్ లో దూసుకెళ్తున్న షియోమీ వరుసగా మొబైల్స్ విడు దల చేస్తూ రికార్డు సృష్టిస్తున్నది. గతేడాది చైనాలో రిలీజ్ చేసిన రెడ్‌మీ5 ని ఈ వారం ఇండియాలో రిలీజ్ చేసింది. అమేజాన్, ఎంఐ హోం స్టోర్లలో మార్చి 20న ఫస్ట్ సేల్ ప్రారంభించనుంది.



రెడ్‌మీ 5 స్పెషిఫికేషన్లు..

డిస్‌ప్లే : 5.7 అంగుళాల హెచ్‌డీ ప్లస్
బోర్డు : ఆక్టా-కోర్ క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగన్ 450 ఎస్ఓసీ
స్టోరేజీ : 2/3/4జీబీ ర్యామ్,16/32/64జీబీ స్టోరేజ్
కెమెరా : 12 మెగాపిక్సెల్ రియర్ కెమెరా
సెల్ఫీ: 5 మెగాపిక్సెల్ ఫ్రంట్ కెమెరా విత్ ఎల్ఈడీ సెల్ఫీ లైట్
కలర్స్ : బ్లాక్, గోల్డ్, లేక్ బ్లూ, రోజ్ గోల్డ్

బడ్జెట్ ధరలో



మైక్రోమ్యాక్స్ భారత్ 5 ప్రొ ఫీచర్లు..

డిస్‌ప్లే: 5.2 అంగుళాల హెచ్‌డీ
ప్రాసెసర్ : 1.3 గిగాహెడ్జ్ క్వాడ్-కోర్
స్టోరేజ్ : 3జీబీ ర్యామ్, 32జీబీ ఇంటర్నల్
బ్యాటరీ: భారీగా 5000 ఎంఏహెచ్
కెమెరా : 13 మెగాపిక్సెల్ రియర్ కెమెరా
5 మెగాపిక్సెల్ ఫ్రంట్ కెమెరా, ఫేస్ అన్‌లాక్ ఫీచర్

హిట్ ద ప్లే బటన్



ఆన్‌లైన్‌లో మ్యూజిక్ ఫ్లాట్ ఫామ్స్‌లోకి కొత్తగా వింక్ మ్యూజిక్ (wynk music) ప్లేయర్ వచ్చి చేరింది. సుమారు 30 లక్షల జాతీయ, అంతర్జాతీయ పాటలతో మ్యూజిక్ ప్రియులను అలరిస్తోంది. పాప్, రాక్, బాంగ్రా, రొమాంటిక్, డ్యాన్స్, పార్టీ మీ ఫేవరేట్ ఏదైనా సరే ఆ పాటను ఫ్రీగా అంది స్తోంది. 12 భాషాల్లో పాటలు అందుబాటులో ఉన్నాయి. హైక్వాలిటీ స్ట్రీమింగ్, బఫ్ఫర్ ఫ్రీ మ్యూజిక్ ని ఎల్లప్పుడూ ఎంజాయ్ చేయవచ్చు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ మ్యూజిక్ ప్రియులకు ఈ యాప్, ప్లేయర్ కొత్త అనుభూతిని ఇస్తుంది. 75 మిలియన్ల నెటిజన్లు దీన్ని డౌన్‌లోడ్ చేసుకున్నారు. https://goo.gl/zBECeW

పిండపూజలు చేస్తే పితృదేవతలు సంతోషిస్తారా?

నమ్మకాలు నిజాలు

ప్రశ్న : మనిషి చనిపోతే అస్థికలు నదిలో కలుపుతారు. పిండ పూజ చేస్తారు. ఇలా చేస్తే పితృ దేవతలు స్వర్గంలో సంతోషిస్తారని చెబుతారు. ఇదెంతవరకు నిజం?

- శంకరలింగం, శ్యాయంపేట, పరకాల, భూపాలపల్లి జిల్లా

జవాబు: మన వర్తమాన సమాజంలో భారతదేశంలో మూడు రకాలైన నమ్మకాలు లేదా విశ్వాసాలు ఉన్నాయి. ఒకటి: మారుతున్న లేదా ప్రాయోగికంగా నిర్ద్వంద్వంగా తెలిసి పోయిన శాస్త్ర పరిశోధనా ఫలితాల ద్వారా నిగ్గుతేలిన నిజాల (వాస్తవాల) ఆధారంగా మనిషి ఏర్పర్చుకునే నమ్మకాలు. వీటిని శాస్త్రీయ విశ్వాసాలు లేదా శాస్త్రాధారిత విశ్వాసాలు అంటాం. ఇవి ఎప్పుడూ మారనే మారవన్న నిబంధన లేదు. పాత శాస్త్ర నియమాల స్థానే కొత్త నియమాలు బయటపడ్డపుడు తదనుగుణంగా ఈ శాస్త్రాధారిత నమ్మకాలు మార తాయి. ఇలాంటి దృక్పథం, మానసిక ధోరణి ఉన్నవాళ్లకు శాస్త్రీయ దృక్పథం (Scientific temper) వుందని అంటాం. మనం ప్రజలు కోరుకొనేది ఇలాంటి దృక్పథాన్నే. ఇలాంటి దృక్పథమే దేశంలోని ప్రజలందరిలో ఉన్నట్లయితే ఆ సమాజం అప్రతిహతంగా అభివృద్ధి చెందుతుంది. ప్రకృతి గురించిన శాస్త్రీయ అవగాహననతో పాటు సమాజంలో ఉన్న అశాస్త్రీయతను కూడా వారు ప్రశ్నించగలుగుతారు. తద్వారా దేశంలో అన్యాయం తగ్గి ప్రజల మధ్య సమభావం, మానవతా దృక్పథం, సిసలైన దేశభక్తి, కష్టించే ప్రవృత్తి, నిస్వార్థ తత్పరత పెరుగుతాయి. తోటి మానవుడు, పర్యావరణం, సమతులాభివృద్ధి (Sustainable Development) మొదలయిన అంశాలే ఆ వ్యక్తి చేష్టల్ని, జీవన విధా నాన్నీ నిర్దేశిస్తాయి. అలాంటి మనుషులున్న దేశాన్నే, ప్రపంచాన్నే సోషలిస్టులు, కమ్యూనిస్టులు కోరుకుంటారు. రెండవ రకమైన విశ్వాసం/ నమ్మకం : ఆచారానికి లేదా సంప్రదాయాని (Tradition) కి సంబంధించింది. ఈ రకమైన నమ్మ కాలకు శాస్త్రం చెబుతుందన్న విష యాల పట్ల ఏమాత్రం పట్టింపు ఉండదు. తరతరాలుగా తమ కుటుంబంలోనో తోటి సమాజంలోనో జరిగే పద్ధతుల్ని ఆచరిస్తారు. మీరు చెప్పిన అస్థిక నిమజ్జనం, పిండపూజ ఇలాంటి కోవలోకే వస్తాయి. నిజానికి శవాన్ని దహనం చేశాక ఆ శవం తాలూకు భౌతిక స్వరూపానికి కారణమైన రసాయనిక పదార్థాలయిన నీరు, ప్రోటీన్లు, కణజాలాలు చాలామటుకు వాతావరణంలో కలిసిపోతాయి. ఇక మిగిలిన ఘన రూప పదార్థాలు బూడిద, బూడిదగా మారని కొన్ని బొక్కలు (ఎముకలు). ఈ ఎముకల రసాయనిక, భౌతిక ధర్మాలు బ్రతికున్నప్పుడు ఉన్న ఎముకల ధర్మాలకు ఏమాత్రం సరిపోవు. మరో మాటలో చెప్పాలంటే ఈ ఎముకలకు పగిలిపోయిన టీ కప్పు ముక్కలకు తేడా లేదు. ఈ ఎముకలు పూర్తిగా నీటిలో కరగలేని (sparingly soluble) కాల్షియం ఫాస్పేటు అనే లవణ పదార్థం. దీనిని $Ca_3(PO_4)_2$ గా సూచిస్తారు. ఇక బూడిదలో ఉన్నదల్లా శరీరంలో ఉన్న లోహ పదార్థాల ఆక్సైడులు. ప్రధానంగా కాల్షియం ఆక్సైడు (CaO), సోడియం ఆక్సైడు (Na_2O), ఐరన్ ఆక్సైడు (Fe_2O_3) జింకు ఆక్సైడు (ZnO), కాపర్ ఆక్సైడు (CuO), పొటాషియం ఆక్సైడు (K_2O) మొదలైనవి వుంటాయి. ఫెర్రిక్ ఆక్సైడు దక్క మిగిలినవన్నీ క్షార ఆక్సైడులు. అంటే ఏమాత్రం తడి లేదా నీరు తగిలినా అవి వెంటనే హైడ్రాక్సైడులా మారి, ఆ నీటిని క్షార (Alkaline) లక్షణాన్ని సంతరిస్తాయి. దహనం తర్వాత మిగిలిన ఎముకలతో పోలిస్తే ఈ బూడిద మోతాదు చాలా తక్కువ. ఇందులో ఉన్న చిన్నా చితక ఎముకల్ని, కొంత బూడిదను చెంబులో నింపి అస్తికలు అని పేరు పెడతారు. ఈ పదార్థాన్ని దహన సంస్కారం చేసిన వ్యక్తి (సాధారణంగా పెద్ద కుమారుడు) కుటుంబ సమేతంగా వెళ్లి తమకు బాగా యిష్టమైన నదిలోనో లేదా ఆయా పురోహితులు సూచించిన నదిలోనో కలిపేస్తారు. ఆ తర్వాత పిండ ప్రదానం చేస్తారు. మాంసాహారులైతే మాంసం కలిపిన భోజనాన్ని, శాకాహారులైతే పప్పు నెయ్యి కలిపిన భోజనాన్ని ముద్దలు (పిండాలు)గా చేసి నది గట్టు మీదో, పొదల్లోనో ఆరుబయట పెడతారు. ఈ పిండాల్ని అక్కడక్కడ ఆకలితో అలమటిస్తున్న కాకులు, గద్దలు తింటాయి. అలా తినకపోతే అక్కడున్న కుటుంబీకులు తెగ బాధపడిపోతారు. అలా కాకులు తినడం సంభవిస్తే ఆ పిండ పూజ లేదా పిండ ప్రదానం జయప్రదమయినట్టు అర్థం.

ఇలాంటి ప్రవర్తనలు లేదా కార్యకలాపాలలో ఏమాత్రం విజ్ఞాన శాస్త్ర లక్షణాలు వుండవు. ఆ కాకులే పిత దేవతల ప్రతినిధులుగా భావిస్తారు. చనిపోయిన తర్వాత ఏమీ ఆ వ్యక్తికి సంబంధించిన చైతన్య రూపం వుండదు. ఆత్మలు, స్వర్గ, నరకాలకు ఏమాత్రం ఆధారాలు లేవు. ఇక ఇలా చర్చించుకుంటూ వెళితే ఎన్నో అశాస్త్రీయ అంశాలు బయటకొస్తాయి. అయితే ఇలాంటి ఆచారాల వల్ల సమాజానికి నష్టం లేదు. ఎవరి యిష్టాలు వారివి అని సున్నితంగా ఆ సంప్రదాయాల్ని, ఆచారాల్ని మన్నించవచ్చును. కేవలం ఆర్థిక నష్టాలు, నిష్క్రియాపరమైన కాల హరణం తప్ప సమాజపు గమనాన్ని గణనీయంగా దుష్పరి ణామాల వైప మళ్లించే ధోరణి పెద్దగా వుండదు. పెళ్లిళ్ళ, పండుగలు మొదలయినవన్నీ ఈ కోవలోకి వస్తాయి. కాబట్టి వీటిని సదాచారాలు, సత్కార్యాలు, సత్సంప్రదా యాలు అనలేము గానీ సింపుల్‌గా ఆచారాలని వదిలేస్తాము. కానీ మూడవ నమ్మకాలున్నాయి. వీటిని మూఢనమ్మకాలు, ఛాందసత్వం, అంధ విశ్వాసాలు అంటాము. ఇలాంటి వాటివల్ల సమాజ గమనానికి ప్రమాదం. కులవ్యవస్థ, లైంగిక వివక్షత, మతవిద్వేషాలు, స్వార్థపరత్వం, అమానుషత్వం వంటివి ఇలాంటి విశ్వాసాల వల్ల పెరుగుతాయి. చేతబడి, బాణామతిని నమ్మడం, మనుషులకు అతీత శక్తులున్నట్లు విశ్వసించడం, వాస్తు, జ్యోతిశ్శాస్త్రం వంటి నమ్మకాల వల్ల సమాజం నిష్క్రియా పరత్వానికి చేరువవుతుంది. ఇలాంటి విషయాల పట్ల ఈ శీర్షికలో బాగానే చర్చించుకున్నాం.





ప్రొ॥ ఎ. రామచంద్రయ్య
సంపాదకులు, చెకుముకి,
జన విజ్ఞాన వేదిక

నేడు ఐఎస్ఎల్ ఫైనల్



బెంగళూర్ : సుదీర్ఘంగా సాగిన ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) ఆఖరి అంకానికి చేరుకున్నది. రెండు అంచెల సెమీఫైనల్స్ సమరంలో గెలుపొందిన బెంగళూర్ ఎఫ్సీ, చెన్నయిన్ ఎఫ్సీలు నేడు ఐఎస్ఎల్ టైటిల్ కోసం అమీతుమీ తేల్చుకోనున్నాయి. అరంగ్రేట బెంగళూర్ సొంతగడ్డపై అంతిమ పోరు జరుగుతున్నా.. ఆతిథ్య జట్టుకు ఫైనల్ అచ్చిరాని రికార్డు ఐఎస్ఎల్ సొంతం. ఈసారి లీగ్ దశలో బెంగళూర్పై చెన్నయిన్ 2-1తో గెలుపొందింది. కానీ బెంగళర్ తరపున స్టార్ ఆటగాళ్లు అద్భుతంగా ఆడుతున్నారు. దీంతో టైటిల్ పోరు హోరాహోరీగా ఉండటం ఖాయమే. తుది పోరు నేడు సాయంత్రం 8 గంటలకు ఆరంభం కానున్నది.

చెమటోడ్చి సెమీస్‌కు..

- క్వార్టర్స్‌లో ఒకుహరపై సింధు గెలుపు
- ముగిసిన కిదాంబి శ్రీకాంత్ పోరాటం
- ఆల్ ఇంగ్లాండ్ బ్యాడ్మింటన్



నవతెలంగాణ-బర్మింగ్‌హామ్ : బ్యాడ్మింటన్ గ్రాండ్‌స్లామ్, ప్రతిష్టాత్మక ఆల్ ఇంగ్లాండ్ చాంపియన్‌షిప్ ట్రోఫీకి తెలుగు తేజం, వరల్డ్ నం.3 పి.వి సింధు మరింత చేరువైంది. కఠిన ప్రత్యర్థి, సుదీర్ఘ ర్యాలీలతో చెలరేగే జపాన్ అమ్మాయి నొజొమి ఒకుహరపై మూడు గేముల్లో గెలుపొందిన సింధు.. బర్మింగ్‌హామ్ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. గంటన్నర పాటు హోరాహోరీగా సాగిన మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో 20-22, 21-18, 21-18తో పి.వి సింధు విజయం సాధించింది. నేడు జరిగే సెమీస్ సమరంలో కరొలినా మారిన్ లేదా అకానె యమగూచితో సింధు తలపడనున్నది. పురుషుల సింగిల్స్‌లో స్టార్ షట్లర్ కిదాంబి శ్రీకాంత్ పోరాటం ముగిసింది. ప్రీ క్వార్టర్‌ఫైనల్లో 11-21, 21-15, 20-22తో అన్‌సీడెడ్ చైనీస్ షట్లర్ చేతిలో శ్రీకాంత్ కంగుతిన్నాడు.

వెనుకంజలో నిలిచినా.. : సుదీర్ఘ ర్యాలీలు ఆడుతూ, ఫిట్‌నెస్‌కే కాదు సహనానికీ పరీక్ష పెట్టడంలో జపాన్ అమ్మాయి నొజొమి ఒకుహర దిట్ట. సింధుతో ఇటీవల కీలక మ్యాచుల్లో ఒకుహర ఇదే విధంగా చేసింది. కానీ బర్మింగ్‌హామ్‌లో జపాన్ అమ్మాయి ముందంజ వేసినా.. సింధు చేతిలో ఓటమి తప్పలేదు. మూడు గేముల్లోనూ ఒకుహర, సింధులు నువ్వా నేనా అన్నట్టు తలపడ్డారు. ప్రతి పాయింట్ కోసం తీవ్రంగా చెమటోడ్చారు. తొలి గేమ్‌లో 1-0తో ఒకుహర పాయింట్ల ఖాతా తెరవటమే కాదు 11-10తో విరామ సమయానికి ముందంజలో నిలిచింది. కానీ సింధు ఎక్కడా వెనక్కి తగ్గలేదు. ఆధిక్యంలోకి వెళ్లకపోయినా.. ఒకుహరను వెంబడించింది. 28 నిమిషాల పోరాటంలో టైబ్రేకర్‌లో ఒకుహర తొలి గేమ్ సొంతం చేసుకున్నది. ఓ గేమ్ ఓడినా.. సింధు ఒత్తిడికి లోనవ్వలేదు. 3-1తో దూకుడుగా మొదలెట్టి.. 11-9తో ఆధిక్యం నిలుపుకున్నది. ద్వితీయార్థంలోనూ సింధు జోరు తగ్గలేదు. 14-11, 16-13తో దూసుకెళ్లింది. ఈ సమయంలో ఒకుహర 16-16తో స్కోరు సమం చేసి 18-16తో ముందుకు దూసుకెళ్లింది. ఈ ఉత్కంఠ దశలో సింధు వరుస పాయింట్లతో ఆకట్టుకున్నది. 21-18తో గేమ్ గెల్చుకున్నది. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో సింధు 12-16తో వెనుకంజలో నిలిచింది. ఈ స్థితిలో సింధు అవకాశాలు క్లిష్టమయ్యాయి. కానీ తెలుగు తేజం వరుసగా పాయింట్లు నెగ్గి ఒకుహరను ఒత్తిడిలోకి నెట్టింది. 16-16తో స్కోరు సమం చేసింది. ఈ దశలో 18-18 వరకూ ఆధిక్యం చేతులు మారింది. కానీ ఆఖర్లో రెండు వరుస పాయింట్లు సింధును సెమీఫైనల్లోకి తీసుకెళ్లాయి. ఈ విజయంతో ఒకుహరతో ముఖాముఖి రికార్డును 5-5తో సింధు సమం చేసింది.

చెత్త అంపైరింగ్ : నూతనంగా ప్రవేశపెట్టిన సర్వీస్ రూల్స్ విషయంలో అంపైరింగ్ నిర్ణయాలపై కిదాంబి శ్రీకాంత్ మండిపడ్డాడు. ప్రీ క్వార్టర్స్ మ్యాచ్‌లో అంపైర్ తరచుగా శ్రీకాంత్‌ను ఫౌల్‌గా పరిగణించాడు. దీంతో శ్రీకాంత్ తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. సాత్విక్ రెడ్డి, చిరాగ్ శెట్టిల మ్యాచ్‌లోనూ ఇదే జరిగింది. సిక్కి రెడ్డి జంట మ్యాచ్‌లో అంపైరింగ్ నిర్ణయాలు వివాదస్పదమయ్యాయి. దీనిపై సిక్కిరెడ్డి ట్వీట్టర్‌లో తిట్టిపోయగా.. మ్యాచ్ అనంతరం శ్రీకాంత్ అసహనం వ్యక్తం చేశాడు.

మన ప్రత్యర్థి బంగ్లా

- సిరీస్ నుంచి శ్రీలంక అవుట్
- ముక్కోణపు టీ20 టోర్నీ

కొలంబో : బంగ్లాదేశ్ ఛేదన.. 6 బంతుల్లో 12 పరుగుల సమీకరణం. తొలి రెండు బంతుల్లో పరుగులేమీ రాలేదు. ఉదాన వేసిన ఆ రెండు బంతులు బౌన్సర్లే కావటం.. అంపైర్ నో బాల్ ప్రకటించకపోవటం నాటకీయ పరిణామాలకు దారితీసింది. ఓ దశలో బంగ్లాదేశ్ మైదానం వీడుతుందా? అనిపించింది. లంక ఫీల్డర్లతో బంగ్లా బెంచ్ ఆటగాళ్లు వాదన సైతం మొదలెట్టారు. ఈ దశలో మహ్మదుల్లా మూడో బంతిని బౌండరీ దాటించాడు. నాల్గో బంతికి రెండు పరుగులొచ్చాయి. 2 బంతుల్లో 6 పరుగులు అవసరం కాగా.. ఐదో బంతిని మహ్మదుల్లా స్క్వేర్ లెగ్‌లో సిక్సర్‌గా మలిచాడు. అంతే బంగ్లా శిబరంలో కేరింతలు, నైరాశ్యంలో లంకేయులు. 160 పరుగుల ఛేదనలో మహ్మదుల్లా (43), తమీమ్ ఇక్బాల్ (50) రాణించటంతో బంగ్లాదేశ్ 2 వికెట్లతో గెలుపొందింది. ఆదివారం జరిగే ఫైనల్లో భారత్‌తో బంగ్లా తలపడనున్నది. తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక 41/5తో పతనావస్థలో ఉండగా.. కుశాల్ పెరీరా (61), తిశార పెరీరా (58) అర్ధ సెంచరీలతో లంకను ఆదుకున్నారు. ఏడు వికెట్లు కోల్పోయిన శ్రీలంక 159 పరుగులు చేసింది.

అదిరేలా ఆరంభ వేడుకలు!

- పుణెలో ప్లేఆఫ్ మ్యాచులు
- ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ నిర్ణయం



నవతెలంగాణ-ముంబయి : పాలకుల కమిటీ (సీవోఏ), బీసీసీఐ ఆఫీస్ బేరర్ల మధ్య అగాధం రోజు రోజుకూ పెరుగుతూనే ఉన్నా.. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఆరంభ వేడుకల విషయంలో ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ పట్టుదలగా కనిపిస్తోంది. షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ 6న ఆరంభ వేడుకలు, తర్వాతి రోజున లీగ్ తొలి మ్యాచ్ జరగాల్సి ఉన్నది. కానీ పాలకుల కమిటీ జోక్యంతో ఆరంభ మ్యాచ్ రోజునే కాస్త ముందుగా ప్రారంభోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. బడ్జెట్‌ను సైతం రూ. 50 కోట్ల నుంచి రూ. 30 కోట్లకు కుదించారు. అయినా, ఆరంభ వేడుకలను అట్టహాసంగా నిర్వహించేందుకు ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. 45 నిమిషాల పాటు సాగే ఆరంభ వేడుకలకు ఈ సారి అంతర్జాతీయ తారలను రప్పించాలని బోర్డు భావిస్తోంది. ఈ మేరకు కొన్ని సంస్థలు ఆరంభ వేడుకల నిర్వహణపై బోర్డు ఉన్నతాధికారులకు ప్రజెంటేషన్ ఇచ్చినట్టు తెలుస్తోంది. వీటతో పాటు మరికొన్నింటినీ పరిశీలించి మెరుగైన దాన్ని ఎంచుకునే వీలుంది. ఆరంభ వేడుకలకు ఎనిమిది జట్ల కెప్టెన్లు హాజరు కానుండగా.. 45 నిమిషాల వేడుకను కన్నుల పండువగా నిర్వహించేందుకు బోర్డు రంగం సిద్ధం చేస్తోంది. ఈ వివరాలు అధికారికంగా వెల్లడి కాకపోయినా, అంతర్జాతీయ తారలు చిందేయటం ఖాయమని బోర్డు వర్గాలు చెబుతున్నాయి. ఇక నిరుడు రన్నరప్‌గా నిలిచిన పుణె ఈ సారి లీగ్‌లో లేనందున ప్లేఆఫ్స్ పుణెలోనే నిర్వహించాలని మహారాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ చేసిన విజ్ఞప్తిని బోర్డు పరిగణనలోకి తీసుకున్నది. రెండు ప్లేఆఫ్ మ్యాచులు పుణెలో జరుగుతాయని, రాజ్‌కోట్, లక్నోలు ప్రత్యామ్నాయ వేదికలుగా ఉంటాయని బీసీసీఐ తాత్కాలిక అధ్యక్షుడు సికె ఖన్నా వెల్లడించారు. ఇక చండిగడ్ విమానాశ్రయంలో మే 12- 31 మధ్య ఆధునీకరణ పనులు జరగనున్న నేపథ్యంలో ఆ సమయంలో జరగాల్సిన పంజాబ్ మ్యాచ్‌లను రీ షెడ్యూల్ చేయాలని కింగ్స్ ఎలెవన్ పంజాబ్ ఫ్రాంఛైజీ కోరింది. వచ్చే సమావేశంలో గవర్నింగ్ కౌన్సిల్ దీనిపై ఓ నిర్ణయం తీసుకోనున్నది. ఇదిలా ఉండగా పిచ్‌ల రూపకల్పనలో భారీగా నీరు వృథా అవుతుందని ఐపీఎల్‌ను రద్దు చేయాలని కోరుతూ జాతీయ హరిత ట్రిబ్యునల్‌లో దాఖలైన పిటిషను సైతం గవర్నింగ్ కౌన్సిల్ భేటీలో చర్చకు వచ్చింది.



భారత్‌కు స్వర్ణం

యూనివర్శిటీ షూటింగ్

కౌలాలంపూర్ : ప్రపంచ కప్, కామన్వెల్త్.. ఇప్పుడు యూనివర్శిటీ పోటీలు. స్థాయి ఏదైనా, పోటీ ఎక్కడైనా మన షూటర్ల గురి తప్పడం లేదు. తాజాగా కౌలాలంపూర్‌లో జరుగుతున్న యూనివర్శిటీ షూటింగ్ పోటీల్లో భారత్‌కు స్వర్ణ పతకం లభించింది. 10 మీటర్ల ఎయిర్ పిస్టోల్ విభాగంలో అన్మోల్ జైన్, అచల్ ప్రతాప్ సింగ్, నిశాంత్ సింగ్‌లతో కూడిన పురుషుల జట్టు గోల్డ్ కొల్లగొట్టింది. ఫైనల్లో 1725 పాయింట్లు సాధించిన యువ త్రయం పసిడి పట్టేశారు. పది మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో భారత షూటర్లు మేఘన సజ్జనర్, ఎలావినిల్‌లు వరుసగా రజత, కాంస్య పతకాలు దక్కించుకున్నారు.

కామన్వెల్త్ క్రీడలను బహిష్కరించాలి : 2022 బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్ నుంచి షూటింగ్‌ను ఐచ్ఛిక క్రీడగా చేయటంపై భారత వెటరన్ షూటర్ జస్పాల్ రానా మండిపడ్డాడు. ఇప్పటికే ఆసియా గేమ్స్‌లో షూటింగ్‌లో సుమారు 25 క్రీడాంశాలను తొలగించారు. షూటింగ్‌ను ఐచ్ఛికం చేస్తూ కామన్వెల్త్ గేమ్స్ ఫెడరేషన్ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ‘ షూటింగ్‌ను తొలగించటంపై ప్రభుత్వం పోరాటం చేయాలి. మనకు ఎక్కువ పతకాలు వచ్చే క్రీడలను తొలగించటం పట్ల తీవ్రంగా స్పందించాలి. కామన్వెల్త్ క్రీడలను బహిష్కరించాలి, అక్కడ మన గన్ పేలొద్దు. చైనా నాల్గు ఒలింపిక్స్ క్రీడలను బహిష్కరించింది, తర్వాత వచ్చి మొత్తం పతకాలు కొల్లగొట్టింది. ఈ విషయంలో ప్రభుత్వం వెంటనే చొరవ చూపాలి’ అని రానా పేర్కొన్నాడు.

విదర్భ 702/5

నాగ్‌పూర్ : రెస్టాఫ్ ఇండియాతో జరుగుతున్న ఇరానీ కప్ పోరులో రంజీ విజేత విదర్భ దూసుకుపోతున్నది. వసీం జాఫర్ (286) ద్వి శతకానికి తోడు వాంఖడె (99 నాటౌట్), గణేశ్ సతీష్ (120) రాణించటంతో మూడో రోజు ఆట ముగిసే సమయానికి విదర్భ 702/5తో పటిష్ట స్థితిలో కొనసాగుతోంది. ఓవర్‌నైట్ స్కోరుకు ఒక్క పరుగే జోడించిన జాఫర్.. సిద్ధార్థ్ కౌల్‌కు వికెట్ కోల్పోయాడు. రెస్టాఫ్ ఇండియా తరపున సిద్దార్థ్ కౌల్ రెండు వికెట్లు కూల్చగా.. అశ్విన్, నదీమ్, జయంత్ యాదవ్‌లు తలా ఓ వికెట్ తీసుకున్నారు.

నివేదిక కోసం చూస్తున్నాం

- క్లిన్‌చిట్ లభిస్తే కాంట్రాక్టు పునరుద్ధరణ
- మహ్మద్ షమిపై రాజీవ్ శుక్లా



ముంబయి : భారత క్రికెటర్ మహ్మద్ షమిపై అతడి భార్య మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలు చేసిన నేపథ్యంలో ఐపీఎల్ 11వ సీజన్‌లో పేస్ బౌలర్ ప్రాతినిథ్యంపై బీసీసీఐ నుంచి కాస్త ఊరటనిచ్చే పరిణామాలు చోటుచేసుకున్నట్టు కనిపిస్తోంది!. ఐపీఎల్‌లో షమి ప్రాతినిథ్యంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని, అవినీతి నిరోధక విభాగం నివేదిక వచ్చిన తర్వాతే ఏ నిర్ణయమైనా ఉంటుందని బీసీసీఐ తాత్కాలిక అధ్యక్షుడు సికె ఖన్నా తెలిపారు. బ్రిటన్ వ్యాపారవేత్త ఇచ్చిన డబ్బులు పాకిస్థాన్ అమ్మాయి ద్వారా షమి దుబాయ్‌లో తీసుకున్నాడని అతడి భార్య హసిన్ జహాన్ ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించి షమితో జరిపిన సంభాషణ ఆడియో ఆధారాలను పాలకుల కమిటీ చైర్మెన్ వినోద్ రాయ్‌కు ఆమె అందజేసింది. ఇదే ఆడియో టేపు ఆమె సోషల్ మీడియాలోనూ ఉంచింది. బీసీసీఐ అవినీతి నిరోధక విభాగం చీఫ్ నీరజ్ కుమార్ దర్యాప్తు నివేదికను వారంలోపు సీవోఏ ముందుంచనున్నారు. ఇదిలా ఉండగా ఇటీవల జరిగిన రాష్ట్ర జట్ల కెప్టెన్లు, కోచ్‌ల సమావేశంలో పలువురు బోర్డు (పాలకుల కమిటీ) వైఖరిపై అసంతృప్తి వ్యక్తం చేసినట్టు సమాచారం. కుటుంబ వ్యవహారంలో మహ్మద్ షమి కేంద్ర కాంట్రాక్టును పక్కనపెట్టడంపై మాజీ క్రికెటర్ అయిన ఓ ఆఫీస్ బేరర్ ప్రశ్నించినట్టు తెలుస్తోంది. దీనిపై ఐపీఎల్ చైర్మెన్ రాజీవ్ శుక్లా స్పందించారు. ‘ మహ్మద్ షమి విషయంలో స్పష్టతతో ఉన్నాం. అతడి భార్య చేసిన ఇతర ఆరోపణలపై కోల్‌కత పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అది పూర్తిగా వారి పరిధిలోని అంశం. బీసీసీఐ నుంచి కేవలం దుబాయ్‌లో పాక్ అమ్మాయి నుంచి డబ్బులు తీసుకున్న విషయమై విచారణ చేస్తున్నాం. ఈ అంశంలో నీరజ్ కుమార్ కమిటీ షమికి క్లీన్‌చిట్ ఇస్తే తక్షణమే అతడి కేంద్ర కాంట్రాక్టును పునరుద్ధరిస్తాం. న్యాయస్థానంలో జరిగే అతడి ఇతర అంశాలు బీసీసీఐ పరిధిలోకి రావు. బీసీసీఐ ఆటగాళ్ల ప్రవర్తనా నిమయావళి ప్రకారమే చర్యలు తీసుకోగలం. ఆర్థిక లావాదేవీలకు సంబంధించి క్లిన్‌చిట్ లభిస్తే షమి తిరిగి కాంట్రాక్టు జాబితాలో చోటుచేసుకుంటాడు’ అని శుక్లా తెలిపారు.

న్యాయస్థానంలోనే తేల్చుకుంటా! : భార్య జహన్ హసిన్ చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని నిరూపించుకునేందుకు తగిన ఆధారాలు ఉన్నాయని మహ్మద్ షమి తెలిపాడు. ‘నా నిర్దోషిత్వం నిరూపించుకునేందుకు నా వద్ద తగిన ఆధారాలు ఉన్నాయి. నా భార్యతో రాజీపడే ప్రసక్తే లేదు. ఆమెతో నా బంధం ముగిసిన అధ్యాయం. కోర్టు వెలుపల సమస్యను పరిష్కరించుకోవాలని భావించటం లేదు. నేను న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాను’ అని మహ్మద్ షమి తెలిపాడు.

విమాన ప్రయాణమా.. అమ్మో!

- నెల రోజుల వ్యవధిలో గాలిలో కలిసిన 210 ప్రాణాలు
- సాంకేతికత, భద్రత గురించి డాంబికాలకు పోతున్న ఏఎస్ఎన్‌కు మూడు ఘటనలతో షాక్
- పైలట్‌కి ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సిబ్బందికి మధ్య కొరవడుతోన్న సమన్వయం
- అత్యాధునిక కాక్‌పిట్ టెక్నాలజీ, సుశిక్షిత సిబ్బంది లేకపోవడం కూడా కారణమే!

విమాన ప్రయాణం.. అదో అద్భుత అనుభూతి.. ఆకాశ మార్గంలో అతివేగంగా, వెండి మబ్బులపై హాయిగా గమ్యస్థానాన్ని చేరుకోవచ్చు. ఐతే, అది ఒకప్పటి మాట! గత నెల రోజుల్లో జరిగిన వివిధ పరిణామాలను చూస్తుంటే, విమాన ప్రయాణంలో హాయి మాట అటుంచితే, క్షేమంగా గమ్యానికి చేరితే చాలు అనుకునే పరిస్థితి భయపెడుతున్నది.



కడవేర్లు

నేటి పోటీప్రపంచంలో కాలంతో పాటూ పరిగెత్తాల్సిందే. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్ళాల్సి వస్తే, ప్రయాణం కోసం గంటల పాటూ వెచ్చించే సమయం, తీరిక, నిరీక్షణ, సహనం నేడు ఎవరికుంటున్నది? అందుకే, సుదూర ప్రాంతాలైనా, అతి దగ్గరిప్రాంతాలైనా.. లోహవిహంగానికే అందరూ జై కొడుతున్నారు. దీనికి వివిధ విమాన సంస్థలు ప్రకటిస్తున్న ఆఫర్లు, తగ్గుతున్న విమాన చార్జీలు కూడా ఒక కారణం కావొచ్చు. "గతంతో పోలిస్తే, 2017లో అతితక్కువగా విమాన ప్రమాదాలు జరిగాయని, ఒక్క పాసింజర్ కూడా ఆయా ప్రమాదాల్లో (కమర్షియల్ ఫ్లైట్స్ లో) మరణించలేదని.. ఇది వైమానిక రంగంలో వాడుతోన్న అత్యాధునిక టెక్నాలజీ, సిబ్బంది నిబద్ధతకు నిదర్శనమ"ని గొప్పగా జబ్బలు చరుచుకున్న ఏవియేషన్ సేఫ్టీ నెట్ వర్క్ సంస్థకు షాక్ ఇచ్చేలా.. ఒక్క నెల వ్యవధిలోనే(ఫిబ్రవరి 10 - మార్చి 12, 2018) ఏకంగా మూడు అతిపెద్ద విమాన ప్రమాదాలు జరిగి.. సుమారు 210 మంది అమాయకుల ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ఆయా ప్రమాదాలకు సాంకేతికత, శిక్షణలేమి, సిబ్బంది మధ్య అవగాహన లోపాలే కారణాలని తేలడం పలు విమర్శలకు తావిస్తోంది.

ప్రమాదాలకు కారణం అదే!:

నేపాల్‌లోని త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయం రన్‌వేపై తాజాగా విమానం కూలిన ఘటనలో 50 మంది ప్రయాణికులు చనిపోయిన విషయం తెలిసిందే! ఈ ఘటనలో విమాన బ్లాక్ బాక్స్ ద్వారా లభ్యమైన సమాచారం ప్రకారం.. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్, విమాన పైలట్ మధ్య జరిగిన సంభాషణల్లో గందరగోళం నెలకొనడం వల్లే సదరు ప్రమాదం జరిగినట్టు తెలుస్తోంది. ఇది ఒక్క ఈ ప్రమాదంలోనే కాదు.. ప్రపంచవ్యాప్తంగా విమానం ల్యాండింగ్/టేకాఫ్ జరుగుతోన్న సమయంలో జరిగే డెబ్బై శాతం ప్రమాదాలకు విమానాలు నడిపే పైలట్, భూమిపై ఉండి ఆదేశాలు జారీ చేసే సిబ్బందికీ మధ్య తగిన సమన్వయంలేకపోవడమే కారణమని వివిధ అధ్యయనాల్లో తేలింది. సంక్షోభ సమయంలో విమాన పైలెట్లు అప్రమత్తంగా వ్యవహరించకపోవడానికి ఆధునిక సాంకేతికతో రూపొందించిన కాక్‌పిట్స్ ప్రముఖ కారణం కాగా, కాక్‌పిట్లలో అత్యధిక సమాచారం నిక్షిప్తం చెయ్యడం, విపత్కర పరిస్థితుల్లో పెద్దగా శబ్దం చేస్తూ వచ్చే మూకుమ్మడి హెచ్చరికలు, పైలట్లకు, ఆదేశాలు జారీ చేసే సిబ్బందికీ మధ్య సమన్వయం లేకపోవడం, సుశిక్షితం కాని సిబ్బందిని ఆయా వైమానిక సంస్థలు నియమించుకోవడం తదితర కారణాల వల్ల ఈ ప్రమాదాలు జరుగుతున్నట్టు నిపుణులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా.. విమానయాన సంస్థలు, ఏవియేషన్ అధికారుల తీరులో మార్పు రావాల్సిన అవసరమున్నదని, లేనట్టయితే ప్రయాణికులు విమానాల వైపు చూడాలంటేనే భయపడే పరిస్థితి భవిష్యత్తులో దాపురించవచ్చని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

నెల రోజుల్లో మూడు ఘోర ప్రమాదాలు :

ఫిబ్రవరి 11, 2018:

రష్యా రాజధాని మాస్కోలోని డొమొడెడొవో విమానాశ్రయం నుంచి ఉరల్ పర్వతశ్రేణుల్లోని ఓర్స్క్ పట్టణానికి బయలుదేరిన ఆంటొనోవ్ ఏఎన్-148 జెట్ విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కూప్పకూలిపోయింది. ఈ ఘటనలో 71 మంది చనిపోయినట్టు రష్యా అత్యవసర విభాగం తెలిపింది. కాగా, వారం క్రితం.. సిరియాలోని రష్యా సైనికుల అవసరాలను తీర్చేందుకు వాడుతోన్న రవాణా విమానం కూలిన ప్రమాదంలో ఆరుగురు సిబ్బంది సహా 26 మంది ప్రయాణికులు మరణించారు.

ఫిబ్రవరి 19, 2018:

ఇరాన్ రాజధాని టెహ్రాన్ నుంచి యాసూజ్ నగరానికి వెళ్తున్న ‘ఎన్‌అసమన్ ఎయిర్‌లైన్స్’కు చెందిన ఏటీఆర్ 72 తరహా విమానం టెహ్రాన్‌కు 780 కి.మీ దూరంలో కుప్పకూలిపోయింది. ఈ ప్రమాదంలో 66 మంది పప్రయాణికులు అసువులుబాసారు. కాగా, విమానం టేకాఫ్ అయిన కొద్దినిముషాలలోనే రాడార్‌తో సదరు ఫ్లైట్ సంబంధాలు తెగిపోయినట్టు అధికారులు తెలిపారు.

మార్చి 12, 2018:

నేపాల్ రాజధాని కాఠ్మాండూ త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయం రన్‌వేపై విమానం కూలిన ఘటనలో దాదాపు 50 మంది ప్రాణాలు కోల్పోయారు. ల్యాండింగ్ సమయంలో పైలట్‌కు, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌కు మధ్య జరిగిన సంభాషణలో గందరగోళం వల్లే ఈ ప్రమాదం జరిగినట్టు అధికారులు ప్రాథమికంగా తెలిపారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.